పెరుగుతున్న డయేరియా కేసులు

జిల్లావ్యాప్తంగా ఏటా డయేరియా కేసులు పెరుగుతున్నాయి. గత ఐదేళ్లలో ప్రభుత్వ లెక్కల ప్రకారం 7వేలకుపైగా కేసులు నమోదు కాగా, ప్రైవేటు ఆసుపత్రిలో చేరే వారి సంఖ్యకు లెక్కలేదు. అధికశాతం మంది గ్యాస్ట్రబుల్, కడుపు నొప్పి, మంట, పేగు పూత వంటి వ్యాధులు బారిన పడుతున్న కేసులే అధికంగా కనిపిస్తున్నాయి. పదేళ్ల పిల్లల నుంచి వృద్ధుల వరకు ఉదర సంబంధమైన వ్యాధులతో బాధపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆహార పదార్థాలను కల్తీ చేసి, అనారోగ్యానికి కారణమవుతున్న అక్రమార్కులను గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేస్తే కొంతమేర అడ్డుకట్ట పడే అవకాశం ఉంది.



జిల్లాలో కల్తీ దందా జోరుగా సాగుతోంది. నిత్యం తాగే పాల నుంచి తినే తిండి వరకు కల్తీ దందా నడుస్తోంది. వారంరోజులుగా తిరుమల వ్యవహారం దేశం మొత్తం చర్చనీయాంశమైంది. పవిత్రమైన ప్రసాదంగా భావించే లడ్డూలో ఉపయోగించే నెయ్యిలో ఇతర పదార్థాలు కలిపినట్లు గుర్తించారు. అదే సమయంలో జిల్లాలోనూ కల్తీ వ్యాపారం యథేచ్ఛగా నడుస్తోంది. దర్శి ప్రాంతాల్లో రసాయనాలతో పాలు తయారీని.. ఒంగోలులోనూ నెయ్యి స్కాంను గతంలో అధికారులు గుర్తించారు. ఇటీవల రోడ్‌సైడ్ ఫుడ్ సెంటర్లలో బిర్యానీలో నాసిరకం పదార్థాలు వాడుతున్నట్లు అధికారులు గుర్తించి కేసులు నమోదు చేశారు. అలాగే మినరల్ వాటర్ బాటిళ్లు కూడా నకిలీవి అమ్ముతున్న పరిస్థితి. మొక్కుబడి పెనాల్టీలతో సరిపెట్టి వదిలేస్తుండటంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. నకిలీ తయారీకేంద్రాలపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోకుంటే ప్రజారోగ్యం ప్రమాదంలో పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.



అంతా 'కల్తీ'!

ఆహార పదార్థాలు, డెయిరీ ఉత్పత్తులలో అధికం

అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్న వ్యాపారం

యథేచ్ఛగా అమ్మకాలతో ప్రమాదంలో ప్రజారోగ్యం

క్రిమినల్ చట్ట పరిధిలోకి తెస్తేనే అడ్డుకట్ట

రాష్ట్రంలో కల్తీ గుర్తింపు ల్యాబ్ ఒకటే కావడంతో కేసుల్లో జాప్యం

అధికారులు తక్షణం దృష్టిపెట్టాల్సిందే..

పెరుగుతున్న డయేరియా, ఉదర సంబంధ వ్యాధులు

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 26 : జిల్లాలో నూనెలు, నీళ్లు, ఆహారం, కారం, ప్రతి ఒక్కరూ వినియోగించే పాలు సైతం కల్తీమయంగా మారాయి. డబ్బు సంపాదనే ధ్యేయంగా కొందరు అక్రమార్కులు ఆ దందాకు పాల్పడుతున్నారు. దానికితోడు చాలాచోట్ల టిఫిన్ సెంటర్లు, హోటళ్లు తక్కువ ధరకు దొరుకుతున్నాయని నాణ్యతను పట్టించుకోకుండా కల్తీ వస్తువులను వాడుతున్నారు. ఫలితంగా ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతోంది. తక్కువ రకం నూనె, కంటికి ఇంపుగా ఉండేందుకు వాడే రసాయనాల కారణంగా ఆహారపదార్థాలు విషపూరితంగా మారుతున్నాయి. పాలిష్ చేసిన రేషన్ బియ్యాన్ని ఉపయోగించడం వలన అధికశాతం ప్రజలు ఉదర సంబంధ వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ కల్తీని అరికట్టాల్సిన అధికారులు తనిఖీలు నిర్వహించినా ప్రయోజనం లేకుండాపోతుంది. ప్రత్యేకించి నకిలీ పదార్థాలు ఉన్నట్లు గుర్తించి కేసులు నమోదు చేసినా, అవి క్రిమినల్ చట్టపరిధిలోకి రావడం లేదు. కేవలం జాయింట్ కలెక్టర్ సమక్షంలో పెనాల్టీ విధించడంతో వ్యాపారుల ఇష్టారాజ్యమైంది. గతంలో మునిసిపల్ అధికార యంత్రాంగం ఫుడ్ ఇన్‌స్పెక్టర్లుగా ఉండగా ప్రస్తుతం ఆహార తనిఖీల నిమిత్తం ఆహార భద్రత అధికారులకు ఆ బాధ్యతలు అప్పగించారు. దీంతో ఫిర్యాదులు వస్తే తప్ప కార్యాలయం నుంచి కాలు బయటపెట్టకుండా రూ.వేలలో అదనపు ఆదాయానికి అలవాటు పడి ప్రజారోగ్యాన్ని విస్మరించారు.



గడిచిన ఐదేళ్లలో నమోదైన కేసులు 104

జిల్లాలో గడిచిన ఐదేళ్లలో సుమారు 104 కేసులు నమోదు చేయగా, వ్యాపారుల వద్ద నుంచి సుమారు రూ.34.85 లక్షల అపరాధ రుసుం వసూలు చేశారు. 2021-22 ఏడాదిలో 23 కేసులు నమోదు చేయగా, 2022-23లో 27 కేసులు, అలాగే 2023-24లో 50 కేసులు, 2024-25కు సంబంధించి ఇప్పటివరకు 6 కేసులు నమోదు చేశారు. అందులో ఎక్కువగా పాలు, డెయిరీ ఉత్పత్తులు ఉండగా వంట నూనెలు, బేకరీ ఐటమ్స్, అలాగే నెయ్యి, నాన్‌వెజ్, వెజ్ బిర్యానీలు, నూడిల్స్ తయారీ, చికెన్ పకోడి, కేంద్రాలలోనే కల్తీ ఎక్కువగా జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. వాటితోపాటు టీ పౌడర్, జీడిపప్పు, కారం తయారీ, జ్యూస్ పాయింట్లలోనూ నకిలీ భాగోతం నడుస్తోంది. ఇదిలా ఉంచితే ఐస్‌క్రీమ్, ప్యాక్ చేసిన నీళ్ల ప్యాకెట్లు, బాటిళ్లు ఇలా అన్నీ రకాల ఆహార పదార్థాలలోనూ కల్తీ ఉన్నట్లు గుర్తించారు.

క్రిమినల్ కేసుల పరిధిలోకి తేస్తేనే అడ్డుకట్ట

ఆహార పదార్థాలలో కల్తీని గుర్తించేందుకు అవసరమైన ల్యాబ్ రాష్ట్రంలో విశాఖలోనే ఉంది. ఇతర జిల్లాలో లేకపోవడంతో సేకరించిన శ్యాంపిల్స్‌ను ల్యాబ్‌లకు పంపి, అక్కడ నుంచి నివేదికలు రావడానికి చాలా సమయం పడుతోంది. దీంతో నకిలీ వ్యాపారానికి అడ్డుకట్ట వేసే పరిస్థితి కనిపించడం లేదు. ఇదిలా ఉంచితే నకిలీ అని ల్యాబ్ రిపోర్టు వచ్చిన తర్వాత కూడా అపరాధ రుసుం మాత్రమే వేసి వదిలేస్తుండడంతో నకిలీ వ్యాపారకేంద్రాల తలుపులు మళ్లీ తెరుచుకుంటున్నాయి.



ఫాస్ట్‌ఫుడ్‌కు పెరిగిన డిమాండ్

ప్రస్తుత రోజుల్లో అధికశాతం ప్రజలు ఇంటి వంటకు విరామం ప్రకటిస్తున్నారు. ఫాస్ట్‌ఫుడ్‌లు, రెస్టారెంట్లకు వెళ్లడం ఎక్కువైంది. దీంతో వీధికొక్క ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వెలుస్తోంది. ఇదిలా ఉండగా, కర్రీస్ పాయింట్లు కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి. సాయంత్రమైతే చాలు రహదారుల్లో ఫుట్‌పాత్ వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. తోపుడు బండ్లపై టిఫిన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. జనం కూడా వాటిని ఆదరిస్తున్నారు. ఇంటిల్లిపాది వెళ్లి ఆహారపదార్థాలను తింటున్నారు. దీంతో వ్యాపారులకు ఆదాయం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. అదే సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో తిన్న వారికి మాత్రం అనారోగ్య సమస్యలు తప్పడం లేదు. ఎక్కువగా ఫుడ్ పాయిజన్, డయేరియా బారిన పడుతున్నారు.

సీఎం ఆదేశించారు.. దివ్యాంగునికి ఆసరా కల్పించారు

సీఎం చంద్రబాబు ఆదేశాలతో దివ్యాంగుడికి విలువైన వీల్‌చైర్‌ను అధికారులు అందించారు. ఈ నెల 20న మద్దిరాలపాడులో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరయ్యారు. గ్రామసభలో గ్రామానికి చెందిన గుంజుపల్లి సురేష్ అనే దివ్యాంగుడు ఎలక్ట్రికల్ వీల్ చైర్ మంజూరు చేయాలని కోరారు. దీంతో స్పందించిన సీఎం చంద్రబాబు.. సురేష్‌కు వీల్‌చైర్ అందజేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారీయాకు ఆదేశించారు. కలెక్టర్ రూ.95వేలు విలువ చేసే ఎలక్ట్రికల్ ఫ్రెండ్లీ వీల్‌చైర్‌ను సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి చేతులమీదుగా కలెక్టర్ గుంజుపల్లి సురేష్‌కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు సురేష్ ఆనందం వ్యక్తం చేస్తూ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. జీవితాంతం చంద్రబాబుకు రుణపడి ఉంటానని తెలిపాడు.

- ఒంగోలు (కార్పొరేషన్)

సంకేత భాషలో కలెక్టర్ ప్రసంగం



బధిరుల సంకేత భాషా దినోత్సవం సందర్భంగా ఒంగోలు భాగ్యనగర్‌లోని బధిరుల పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో కలెక్టర్ బధిర భాషలో మాట్లాడారు. సైగలు చేస్తూ, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా ఎలా చదువుతున్నారు. విద్యాభ్యాసాలు ఎలా ఉన్నాయి అంటూ వారిని సైగల ద్వారా అడగటంతో అర్థం చేసుకున్న విద్యార్థులు ఉత్సాహంగా బదులిచ్చారు. దీంతో అక్కడ ఉన్న విద్యార్థులు, అధికారులు సైతం కలెక్టర్ ముచ్చటించిన విధానంపై హర్షం వ్యక్తం చేసి, అభినందించారు.

- ఒంగోలు (కార్పొరేషన్)

అదే ఉత్సాహం

ముగిసిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం

ముఖ్యమైన ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం

ఇతర చోట్ల కదిలిన కేడర్

వందరోజుల పాలన ఫలితాలపై ఇంటింటి ప్రచారం

ఒంగోలు, సెప్టెంబరు 26, (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా సాగి గురువారంతో ముగిసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈనెల 20 నుంచి వారం పాటు ప్రభుత్వంలోని కీలక ప్రజాప్రతినిధుల నుంచి గ్రామ, వార్డు స్థాయిలోని టీడీపీ కేడర్, ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేకించి క్షేత్రస్థాయి సిబ్బంది ఉత్సాహంగా ఇందులో పాల్గొన్నారు. వంద రోజుల్లో ప్రభుత్వం ఆయా వర్గాల సంక్షేమం కోసం అమలుచేసిన పెన్షన్ల పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, అన్న క్యాంటీన్లు పునరుద్ధరణ వంటి కీలక అంశాలతోపాటు ప్రజలకు ఉపయోగపడే పలు నిర్ణయాలను తీసుకుంది. వాటన్నింటిని వివరిస్తూ ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టగా జిల్లాలో వారంరోజులపాటు ఉత్సాహంగా సాగింది. రాష్ట్రస్థాయిలో ఈ కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబునాయుడు తొలిరోజు జిల్లాలోని మద్దిరాలపాడు నుంచే ప్రారంభించగా అనంతరం ఆయా నియోజకవర్గాలలో మంత్రి డాక్టర్ స్వామితో పాటు అధికారపార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు నిర్వహించారు. కాగా చివరి రోజైన గురువారం కూడా ఆయా ప్రాంతాల్లో అదే ఉత్సాహంగా కార్యక్రమం సాగింది. చీమకుర్తి మండలం కంభంపాడులో ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ ఆధ్వర్యంలో జరిగిన సభలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొన్నారు. ఒంగోలులోని 30వ డివిజన్‌లో జరిగిన సభలో ఎమ్మెల్యే జనార్దన్ పాల్గొనగా మార్కాపురంలోని రాజ్యలక్ష్మి కాలనీలో జరిగిన సభలో అక్కడి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొన్నారు. గిద్దలూరు మండలం ముండ్లపాడులో జరిగిన సభలో అక్కడి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొనగా దర్శిలోని క్రిస్టియన్‌పాలెంలో జరిగిన సభలో నియోజకవర్గ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి పాల్గొన్నారు. వారం రోజుల పాటు జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించడంతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు కూడా నిర్వహించారు.



మాట్లాడుతున్న జనార్దన్, పక్కన మేయర్ సుజాత, బుజ్జి

జనసేనలో చేరిన బాలినేని, రవిశంకర్

అనుచరులతో వెళ్లిన మాజీమంత్రి

కూటమి పార్టీలతో కలిసి పనిచేస్తా

జగన్ ఏకపక్ష నిర్ణయాలతో ఇబ్బంది పడ్డా

ఒంగోలులో భారీ ర్యాలీ చేసిన వ్యాపారవేత్త 'కంది'

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు బాలినేని శ్రీనివాసరెడ్డి, వ్యాపారవేత్త కంది రవిశంకర్ గురువారం వేర్వేరుగా జనసేన పార్టీలో చేరారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కండువాలు కప్పి వారిని పార్టీలో ఆహ్వానించారు. పార్టీ ఆదేశం మేరకు ఒక్కొక్కరే జనసేనలో చేరినప్పటికీ తదుపరి వారి అనుచరులను కూడా చేర్చుకునే కార్యక్రమాలు చేపట్టనున్నారు. వైసీపీకి గుడ్‌బై చెప్పిన బాలినేని భారీ వాహనాలలో అనుచరులు వెంటరాగా మంగళగిరిలోని పార్టీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. కంది రవిశంకర్ ఒంగోలులో అనుచరులతో ర్యాలీ నిర్వహించి, ఆ తర్వాత కుటుంబసభ్యులతో మాత్రమే జనసేన కార్యాలయానికి వెళ్లారు. అక్కడ జనసేన నాయకత్వం నిర్ణయించిన మేరకు బాలినేనితోపాటు మరో ఇద్దరు, ముగ్గురు నాయకులతో వెళ్లారు. పవన్ కల్యాణ్ తొలుత బాలినేనిని పార్టీలోకి చేర్చుకుని ఆలింగనం చేసుకున్నారు. ఆ తర్వాత గొర్రెపాటి శ్రీనివాసరావుతోపాటు కార్పొరేటర్ భర్త తిరుమలరావును బాలినేని పవన్ కల్యాణ్‌కు పరిచయం చేయగా వారు కూడా పార్టీలో చేరారు. వ్యాపారవేత్త రవిశంకర్, తన వియ్యంకుడు పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారు రోశయ్యతో కలిసి పార్టీలో చేరారు. ఆ తర్వాత రవిశంకర్ తన ఇద్దరు కుమారులు విష్ణుమోహన్, సాయినాథ్‌లను పవన్ కల్యాణ్‌కు పరిచయం చేశారు. బాలినేని వెంట ఒంగోలు నియోజకవర్గానికి చెందిన వైసీపీ శ్రేణులు పెద్దసంఖ్యలో వెళ్లారు. సుమారు 10మందికిపైగా కార్పొరేటర్లు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, బాలినేని అనుచరులు ఆయన వెంట వెళ్లిన వారిలో కనిపించారు.



బాలినేనిని పార్టీలోకి ఆహ్వానించిన పవన్



పవన్‌తో రవిశంకర్

కూటమితో కలిసి పనిచేస్తా

పార్టీలో చేరిన అనంతరం బాలినేని మీడియాతో మాట్లాడుతూ కూటమి పార్టీ నేతలను కలుపుకొని ముందుకు పోతానని, తనపై జరుగుతున్న కొన్ని అసత్యప్రచారాలు, చిన్న వివాదాలు సర్దుకుంటాయని చెప్పారు. ఇక నుంచి అధినేత పవన్ ఏది చెబితే అది చేస్తా. ప్రకాశం జిల్లాలో జనసేనను ప్రజల్లోకి తీసుకెళ్తా, టీడీపీ, బీజేపీ నేతలతో కలిసి పనిచేస్తానని ప్రకటించారు. వైసీపీ నేత జగన్‌మోహన్‌రెడ్డికి తన లాంటి సీనియర్ నేతలంటే లెక్కలేదని వ్యాఖ్యానించారు. ఆయన తీసుకున్న ఏకపక్ష నిర్ణయాలు మనసుకు కష్టం కలిగించాయన్నారు. గతంలో జగన్ మంత్రివర్గ విస్తరణలో అందరినీ మారుస్తానని చెప్పి తనలాంటి కొందరిని మార్చి అవమానించారు.

ప్రజాసేవ కోసమే...

వ్యాపారవేత్త రవిశంకర్ మాట్లాడుతూ ప్రజాసేవ చేయాలన్న దృఢమైన లక్ష్యంతోటే ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చినట్లు చెప్పారు. పార్టీ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ కూటమి పార్టీలతో కలిసి ప్రభుత్వ సేవా కార్యక్రమాలలో భాగస్వామిని అవుతానని చెప్పారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఇతర నేతలతో కలిసి పనిచేస్తానని పేర్కొన్నారు.

దీపావళి నుంచి

సూపర్‌సిక్స్ ధమాకా

మంత్రి గొట్టిపాటి

రామతీర్థంలో సబ్‌స్టేషన్ ప్రారంభం

ఆర్ఎల్ పురంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం

చీమకుర్తి, సెప్టెంబరు 26 : దీపావళి నుంచి సూపర్ సిక్స్ పథకాల అమలు వేగం పుంజుకోనున్నదని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. రామతీర్థం వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవం, ఆర్ఎల్ పురంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో గురువారం మంత్రి రవికుమార్, ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. తొలుత గ్రానైట్ పరిశ్రమకు తోడ్పాటు అందించే విధంగా రామతీర్థం సమీపాన ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను గొట్టిపాటి, బీఎన్‌లు ప్రారంభించారు. అనంతరం పూజలు నిర్వహించారు. తరువాత ఆర్ఎల్ పురం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ పింఛన్ నాలుగువేలకు పెంపు, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టుని రద్దుచేయటం, నిరుద్యోగులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వటం, అన్నక్యాంటీన్ల ఏర్పాటు.. ఇలా వందరోజుల్లోనే ఎన్నికలనాటి హామీలైన సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేశామని వివరించారు. కొత్త పింఛన్లను అక్టోబర్, నవంబర్‌లో మంజూరు చేస్తామన్నారు. దీపావళి నుంచి మహిళలకు ఉచితంగా సిలిండర్లు పంపిణీ చేస్తామన్నారు. ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ఒకేసారి వెయ్యిరూపాయల పెన్షన్ పెంచటమే కాక మూడునెలల బకాయిలతో అందివ్వటం హర్షించదగిన పరిణామమన్నారు.

మంత్రికి 'గ్రానైట్' అసోసియేషన్ వినతి

రామతీర్థం వద్ద సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రికి గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ నాయకులు కాట్రగడ్డ రమణయ్య ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ప్రారంభించిన సబ్‌స్టేషన్ సామర్థ్యం పెంచాలని కోరారు. గత ప్రభుత్వం చీమకుర్తి మండలాన్ని విద్యుత్ పరంగా దర్శి సబ్‌డివిజన్‌లో కలిపిందని, దీనివలన పలు సమస్యల ఎదుర్కొంటున్నామని, తిరిగి ఒంగోలు డివిజన్‌లో కలపాలని కోరారు. స్పందించిన మంత్రి తక్షణమే ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. అంతేగాక బూదవాడ వద్ద మరో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసి గ్రానైట్ పరిశ్రమకు విద్యుత్‌పరంగా సమస్యలు లేకుండా చేస్తామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఝాన్సీరాణి, ఆర్డీవో సుబ్బారెడ్డి, ఎస్ఈ కేవీ సత్యనారాయణ, టీడీపీ నాయకులు అడకా స్వాములు, మన్నం ప్రసాద్, గొట్టిపాటి రాఘవరావు, గొల్లపూడి సుబ్బారావు, రావిపాటి రాంబాబు, యడ్లపల్లి రామబ్రహ్మం, ఉన్నం సుబ్బారావు, కందిమళ్ల గంగాధరరావు, గొల్లపూడి కోటేశ్వరరావు, ఎనికపాటి లక్ష్మీనరసయ్య, అగ్గి రామయ్య పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే బీఎన్

మైనార్టీలకు సంక్షేమ పథకాలను అందించాలి

• డీఆర్వో శ్రీలత ఆదేశం

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 26: అన్నిశాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాలను మైనార్టీ ప్రజలకు కనీసం 15శాతానికి తగ్గకుండా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని డీఆర్వో ఆర్.శ్రీలత ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో గురువారం మైనార్టీలకు అమలు చేస్తున్న ప్రధానమంత్రి 15 పాయింట్ల కార్యక్రమంపై సంబంధితశాఖల అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తప్పనిసరిగా మైనార్టీలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌జీవో నాయకులు షేక్ షాకీర్, ఎస్.రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భారీ కాన్వాయ్‌తో మంగళగిరి వెళ్లిన బాలినేని

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 26: జనసేన పార్టీలో చేరేందుకు మాజీమంత్రి, ఒంగోలు మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి భారీ కాన్వాయ్‌తో గురువారం తన నివాసం నుంచి మంగళగిరి బయలు దేరివెళ్లారు. ముందుగా స్థానిక లాయర్‌పేటలోని సాయిబాబా మందిరంలో పూజలు చేసిన అనంతరం బయలుదేరాలని అక్కడకు వెళ్లగా మధ్యాహ్నం కావడంతో ఆలయం మూసి ఉంది. దీంతో బాలినేని నేరుగా మంగమూరు రోడ్డుజంక్షన్ నుంచి కాన్వాయ్‌తో మంగళగిరి వెళ్లారు. వైసీపీలో వివిధ హోదాలో ఉన్న నేతలతో పాటు గత ప్రభుత్వంలో నామినెటెడ్ పదవుల్లో ఉన్న వారు, పది మంది కార్పొరేటర్లు కూడా బాలినేని వెంట బయలుదేరారు. కాగా మరోవైపు జనసేన చెందిన నాయకులు కూడా కొంతమంది వెళ్లిన వారిలో ఉన్నారు.

నేడు తిరుమల పరిరక్షణ పాదయాత్ర

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 26: భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ శుక్రవారం పుంగనూరు నుంచి చేపట్టిన తిరుమల పరిరక్షణ పాదయాత్రను విజయవంతం చేయాలని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో కోరారు. శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూల కల్తీ జరుగుతున్న ప్రచారంపై విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రామచంద్రయాదవ్ ఈ పాదయాత్ర చేపట్టారని ఆయన పేర్కొన్నారు. ఈ పాదయాత్రలో భక్తులందరూ పాల్గొని కోరారు.

కంభంపాడులో కొండచిలువ కలకలం

చీమకుర్తి, సెప్టెంబరు 26 : మండలంలోని కంభంపాడులో గురువారం రాత్రి కొండచిలువ కలకలం రేపింది. గ్రామానికి చెందిన దారపునేని వెంకట్రావుకు చెందిన బ్యారన్ వద్ద ఉండే గది పంచలో కుండ పక్కన దాక్కొని ఉన్న కొండచిలువను అక్కడే ఉన్న పనివారు గుర్తించారు. దీంతో వారు వెంకట్రావుకు సమాచారం ఇవ్వగా చీమకుర్తి ఎస్ఐ ద్వారా ఫారెస్ట్ అధికారుల ఫోన్ నంబర్ తెలుసుకొని ఫోన్ చేశారు. అయితే వారి నుంచి స్పందన లేకపోవడంతో అక్కడకు చేరుకున్న గ్రామస్థులు కొండచిలువను కదలికలను గమనిస్తూ కాపలాగా ఉన్నారు.

వంద రోజుల్లోనే అభివృద్ధి వైపు అడుగులు

• ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 26: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అభివృద్ధి వైపు అడుగులు వేసిన ఏకైక ప్రభుత్వం టీడీపీ కూటమేనని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. గురువారం ఒంగోలు నగరం 30వ డివిజన్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం కమిషనర్ వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడం టీడీపీ కూటమికే సాధ్యమన్నారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే హామీలలో కొన్నింటిని నెరవేర్చామని చెప్పారు. పింఛన్ల పెంపు, అలాగే అన్నక్యాంటీన్లు పునఃప్రారంభం చేశామన్నారు. అలాగే త్వరలోనే ఉచిత సిలిండర్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు టీడీపీ కూటమిపై ఎంతో నమ్మకంతో గెలిపించారని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా హామీలన్నీ నెరవేరుస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి వెంకటసూర్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు కనకారావు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.


కమ్యూనిటీహాలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

41వ డివిజన్‌లో 'ఇది మంచి ప్రభుత్వం'

సంతనూతలపాడు: మండలంలోని పేర్నమిట్ట 41వ డివిజన్‌లో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పలు సంక్షేమ పథకాలను అర్హులకు అందించినట్లు వారు తెలిపారు. ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు వివరం గోవిందు, కరిచేటి శ్రీనివాసరావు, పి.శ్రీను, కె.శ్రీను, రసూల్, వెంకట్రావు, సురేష్, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

పార్వతమ్మకు ఘననివాళులు

ఎంపీ మాగుంటను పరామర్శించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు



పార్వతమ్మ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యేలు బీఎన్, ఉగ్ర, కందుల, దామచర్ల

ఒంగోలు(కలెక్టరేట్)సెప్టెంబరు 26 : ఒంగోలు మాజీ ఎంపీ మాగుంట పార్వతమ్మ మృతి పట్ల పలువురు జిల్లా నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. చెన్నైలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్సపొందుతూ బుధవారం ఉదయం ఆమె కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆమె పార్థివదేహాన్ని నెల్లూరులోని వారి ఇంటికి తీసుకొచ్చారు. గురువారం ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, శాసనసభ్యులు జనార్దన్, బీఎన్ విజయకుమార్, డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, నారాయణరెడ్డి, దర్శి ఇన్‌చార్జీ డాక్టర్ లక్ష్మి, ఆమె భర్త లలిత్‌సాగర్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, మాజీ ఎమ్మెల్యే బలరామకృష్ణమూర్తి, టీడీపీ నేత కందుల రామిరెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురువారం సాయంత్రం నెల్లూరులో పార్వతమ్మ అంత్యక్రియలు జరిగాయి.

పవన్ ఆశయాలు నచ్చే జనసేనలో చేరుతున్నా

పారిశ్రామికవేత్త రవిశంకర్ • ఒంగోలులో భారీ ర్యాలీ

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 26: జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదర్శాలు, ఆశయాలు నచ్చి ఆ పార్టీలో చేరుతున్నట్లు ప్రముఖ పారిశ్రామికవేత్త, రవిశంకర్ గ్రూప్స్ అధినేత కంది రవిశంకర్ తెలిపారు. ఎటువంటి షరతులు లేకుండా స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. కూటమి నాయకులు, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఇతర నేతలతో కలిసి పనిచేస్తానని పేర్కొన్నారు. జనసేన పార్టీలో చేరేందుకు గురువారం రవిశంకర్ ఒంగోలు నుంచి భారీర్యాలీతో మంగళగిరికి బయలు దేరివెళ్ళారు. రవిప్రియమాల్ నుంచి వందలాది వాహనాలతో ర్యాలీతో పాటు భారీ ఎత్తున బాణసంచా పేల్చుతూ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవిశంకర్‌ను అభిమానులు భారీ గజమాలలతో సత్కరించారు. మరో వైపు నగరంలోని ప్రధాన కూడళ్ళలో కూడా రవిశంకర్ అభిమానులు పలు కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన లీగల్ అడ్వయిజర్ సుంకర సాయిబాబా, చనపతి రాంబాబు, మాల్యాద్రి, కేఎల్.నరసింహరావు, భాస్కరరావు, కంది చంద్రశేఖర్, కంది రవిశంకర్ తనయులు విష్ణుమోహన్, సాయినాథ్, సుహారి ఫౌండేషన్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.


రవిశంకర్‌ను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 26: పీఎంశ్రీ పథకంలో భాగంగా పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టర్‌క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పీఎంశ్రీ పథకంలోని మొదటి దశలో చేపట్టిన పనులను అక్టోబరు నెలాఖరుకు పూర్తి చేయాలని, పనుల నాణ్యతలో నిర్లక్ష్యం లేకుండా చూడాలని చెప్పారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయా పనులపై మండల విద్యాధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు సమావేశంలో డీఈవో సుభద్ర, డిప్యూటీ సీఈవో సుబ్బారావు, డీఈ నమ్మయ్య, ఏపీవో మాధవీలత, డీసీడీవో ప్రమోద, ఏఎంవో రమేష్, కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వర్ల రామయ్యను కలిసిన టీడీపీ నాయకులు

నాగులుప్పలపాడు సెప్టెంబరు 26: ఒంగోలులోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం పోలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్యను మండల టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు తేళ్ల మనోజ్‌కుమార్, కోశాధికారి మెట్టు సుబ్బయ్యనాయుడు, ఎస్సీ నాయకులు స్వర్ణ కిషోర్‌లు రామయ్యకు బొకే అందించి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం పలు విషయాలపై ఆయనతో చర్చించారు.

3 నుంచి ఏపీ టెట్ పరీక్షలు

జిల్లాలో 4 పరీక్షా కేంద్రాలు • డీఈవో

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 26: జిల్లాలో ఉపాధ్యాయ పరీక్ష(ఏపీటెట్) అక్టోబరు 3నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు డీఈవో సుభద్ర గురువారం తెలిపారు. జిల్లాలోని 4 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9.30నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయన్నారు. పెద్దారవీడు మండలం దేవరాజుగట్టులోని కృష్ణచైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్(కిట్స్), దరిమడుగులని డాక్టర్ శామ్యూల్ జార్జీ ఇంజనీరింగ్ కాలేజీ, ఒంగోలులోని నేషనల్ కౌన్సిల్ ఫర్ దిచర్చ్ సోషల్ యాక్షన్ ఇండియా, ఒంగోలులోని కోల్‌సొసైటీ కాంప్లెక్స్‌లో ఉన్న బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్‌లో పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులు పరీక్షా సమయానికి గంట ముందుగా ఆయా కేంద్రాలకు చేరుకోవాలని, తమ సెల్‌ఫోన్లు, జామెంట్రీబాక్సులు, ఎలక్ట్రికల్ పరికరాలను లోపలికి నిషేధమని చెప్పారు. డీఈవో కార్యాలయంలో ప్రత్యేకంగా టెట్ గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేశారు. ఏదైనా సమస్యలు ఉంటే ఏసీ శివకుమార్ 9701000346, ఏడీ ఉదయభాస్కర్ 8919121853, ఏఎస్‌వో కృష్ణకుమార్ 9246460656, డేటా ఎంట్రీ ఆపరేటర్ 9985468555 నెంబర్లను సంప్రదించాలని డీఈవో కోరారు.

శిద్దా హనుమంతరావుకు సత్కారం

సంతనూతలపాడు, సెప్టెంబరు 26 : సంతనూతలపాడు ఎంఈవో కార్యాలయాన్ని రూ.3లక్షల వ్యయంతో ఆధునికీకరణపనులు చేయించిన ప్రముఖ పారిశ్రామికవేత్త శిద్దా హనుమంతరావును గురువారం స్థానిక జడ్పీ హైస్కూలులో ఎంఈవో డి.వెంకారెడ్డి సన్మానించారు. మాజీ సర్పంచ్ అంకారావు, ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వరి, పి.స్వప్నరాజు, కె.శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, సుధాకరరావు, ఎం.తిరుపతిరెడ్డి, చంద్రమౌళి, డీపీఎస్.ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.


హనుమంతరావును సత్కరిస్తున్న అధికారులు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి మృతి

జరుగుమల్లి (కొండపి), సెప్టెంబరు 26 : వావిలేటిపాడు అడ్డరోడ్డు వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగరాయకొండకు చెందిన పసుమర్తి శ్రీనివాసరావు(48) మరణించగా, టంగుటూరుకు చెందిన అల్లాభక్షుకు తీవ్ర గాయాలయ్యాయి. జరుగుమల్లి నుంచి ద్విచక్రవాహనంపై వారు వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో శ్రీనివాసరావు అక్కడికక్కడే మరణించగా, అల్లాభక్షుకు గాయాలు కాగా 108 వాహనంలో ఒంగోలు తరలించారు. ఎస్సై మహేంద్ర కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పీవీఆర్ విద్యార్థులకు బెస్ట్ స్టూడెంట్ అవార్డులు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 26: ఒంగోలులోని పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులకు అక్కినేని కళాపరిషత్ బెస్ట్ స్టూడెంట్ అవార్డులను అందజేసింది. కళాపరిషత్ గౌరవాధ్యక్షుడు సీహెచ్.లక్ష్మీనారాయణ ఈ అవార్డులను స్పాన్సర్ చేశారు. గత మూడేళ్ళుగా ఆయన వాటిని అందజేస్తున్నారు. సీహెచ్.చతుర్వేది, ఎం.రిషికుమార్‌లకు ఈ అవార్డులను ప్రధానోపాధ్యాయులు ఎం.రాధిక చేతుల మీదుగా అందజేశారు. అవార్డు కింద విద్యార్థులకు జ్ఞాపిక, పతకం, ప్రశంసాపత్రం, రూ.వెయ్యి నగదును ప్రదానం చేశారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరించారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, స్టాఫ్ సెక్రటరీ పీవీ.నారాయణ, జాయింట్ సెక్రటరీ అరుణశ్రీ, జి.రామయ్య, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ పోటీలకు ఐకాన్ విద్యార్థులు

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 26 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఒంగోలుకు చెందిన ఐకాన్ గ్లోబల్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. స్కూలులో చదువుతున్న బి.అభినందన్, కె.మనురేష్వంత్ ఎంపికైనట్లు స్కూలు కరస్పాండెంట్ కాజా చిరంజీవి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మహిళకు గాయాలు

మద్దిపాడు, సెప్టెంబరు 26: గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం దగ్గర గురువారం స్కూటీ అదుపుతప్పి మహిళకు గాయాలయ్యాయి. అద్దంకికి చెందిన పి.రమాదేవి ఒంగోలు వెళుతుండగా సడన్ బ్రేక్ వేయడంతో స్కూటీ అదుపుతప్పి కిందపడింది. ఈ ఘటనలో ఆమెకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలించారు.

విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలి : ఎస్ఐ

మద్దిపాడు, సెప్టెంబరు 26: పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని ఎస్ఐ శివరామయ్య తెలిపారు. గురువారం మద్దిపాడులోని కడియాల యానాదయ్య ఉన్నత పాఠశాలలో గుడ్-బాడ్ టచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థినుల పట్ల ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే కేసులతో వారి జీవితాలు నాశనం అవుతాయని హెచ్చరించారు. అంకితభావంతో చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, హెచ్ఎం కోటిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేస్ పాలిటెక్నిక్‌లో ఉద్యోగావకాశాలపై సదస్సు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 26: ఒంగోలులోని పేస్ పాలిటెక్నిక్ కళాశాలలో భవిష్యత్‌లో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రశేఖర్ మాట్లాడుతూ సాంకేతిక విద్యను అభ్యసించడం ద్వారా విద్యార్థులు తమ ఉద్యోగ అవకాశాలను మెరుగు పర్చుకుంటున్నారన్నారు. అవసరమైన నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ జి.కోటిరెడ్డి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్ వీరాంజనేయులు, రూప అక్కేష్ తదితరులు పాల్గొన్నారు.

జలవనరులశాఖ ఎస్ఈగా వరలక్ష్మి

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 25: జిల్లా జలవనరులశాఖ ఎస్ఈగా వరలక్ష్మి నియమితులయ్యారు. పల్నాడు జిల్లా లింగంగుంట్లలో పనిచేస్తున్న ఆమెను జిల్లా ఎస్ఈగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు సీఈగా పనిచేస్తున్న కె.మల్లికార్జునరావును ఒంగోలు ప్రాజెక్టుల సీఈగా నియమితులయ్యారు. ఒంగోలులో పనిచేస్తున్న సీఈ ఉమామహేశ్వరరావును విజయవాడ హైడ్రాలజీకి బదిలీ చేశారు. పలువురు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను కూడా బదిలీలు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఒంగోలులో పనిచేస్తున్న ఎం.రామకృష్ణను ఇరిగేషన్ దర్శి డివిజన్‌కు, వెలిగొండప్రాజెక్టు కన్‌స్ట్రక్షన్ డివిజన్‌లో పనిచేస్తున్న పి.పురుద్రకరుణరెడ్డిని ఒంగోలులోని ప్రాజెక్టు సర్కిల్ కార్యాలయానికి, ఇక్కడ పనిచేస్తున్న ఎ.సౌదర్గార్‌ను వెలిగొండ ప్రాజెక్టుకు, నెల్లూరు ఈఎన్‌సీలో పనిచేస్తున్న కృష్ణమోహన్‌ను లింగంగుంట్ల సర్కిల్‌కు, వెలిగొండ ప్రాజెక్టులో పనిచేస్తున్న నాగమురళీమోహన్‌ను ఒంగోలులోని సీఈ కార్యాలయం బదిలీ చేశారు.

జడ్పీ ఉద్యోగుల బదిలీల్లో ప్రతిష్టంభన

జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద కోలహాలం

కార్యాలయ, క్షేత్ర స్థాయి బదిలీలపై కూడా సందిగ్ధం • సీఈవోను కలిసిన ఉద్యోగ సంఘాలు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 26: జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీల్లో ప్రతిష్టంభన నెలకొంది. ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఆ ప్రక్రియను జిల్లా పరిషత్ అధికారులు చేపట్టారు. అయితే గత వైసీపీ అధికారంలోకి వచ్చాక జిల్లా పరిషత్ కార్యాలయంలోనే పనిచేసే ఉద్యోగులను బదిలీలకు అధికారులు శ్రీకారం చుట్టారు. అయితే జడ్పీ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగుల బదిలీల ప్రక్రియను చేపట్టగా గందరగోళంగా మారింది. వైసీపీ హయాంలో ఎక్కువ మంది జిల్లా పరిషత్‌లోనే తిష్ట వేసి పనిచేస్తున్నారు. ప్రస్తుతం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా బూచేపల్లి వెంకాయమ్మ ఉండటంతో ఆమె ద్వారా సమీప ప్రాంతాలకు బదిలీలు చేయించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంకొక వైపు ఉద్యోగుల బదిలీలకు శాసనసభ్యుల నుంచి సిఫార్సులు లేఖలు కూడా రావడంతో జిల్లా పరిషత్ అధికారులు ఏమి చేయాలో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే జిల్లాపరిషత్ ఉద్యోగుల బదిలీలపై బుధవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి చర్చించారు. ఒక వైపు ఎంపీడీవోల బదిలీలపై ప్రతిష్టంభన కొనసాగుతుండగా మరో వైపు ఉద్యోగుల బదిలీలపై కూడా అదే పరిస్థితి కొనసాగుతోంది. ఈక్రమంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల నేతలను బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ ఇప్పటికే ఉద్యోగ సంఘాల నాయకులు జిల్లా పరిషత్ అధికారులకు సిఫార్సు లేఖలు ఇచ్చారు. అయితే ఆ స్థానాల్లో ఇప్పటికే రాజకీయ నేతల నుంచి సిఫార్సులు రావడంతో వాటిని కూడా పక్కన పెడుతున్నారని సమాచారం రావడంతో గురువారం రాత్రి ఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు కూచిపూడి శరత్‌బాబు, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డిలు జడ్పీ సీఈవోను కలిశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉద్యోగుల బదిలీలపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఇంకొక వైపు ఉద్యోగులు తమ బదిలీల కోసం జిల్లా పరిషత్ కార్యాలయానికి క్యూ కట్టారు. ఇలా జడ్పీ కార్యాలయంలో ఉద్యోగుల బదిలీల్లో ప్రతిష్టంభన కొనసాగుతుండటంతో ఎప్పుడు ఈ వ్యవహారం కొలిక్కి వస్తోందో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది.



సత్యను సత్కరిస్తున్న పత్తిపాటి పుల్లారావు

చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా కష్టపడాలి

టంగుటూరు, సెప్టెంబరు 26 : ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా కష్టపడాలని మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యకు మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు సూచించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య రాష్ట్ర మారిటైమ్ బోర్డు కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపికైన సందర్భంగా మాజీ మంత్రి పుల్లారావును చిలకలూరిపేటలోని ఆయన నివాసంలో గురువారం సత్య కలిశారు. ఈసందర్భంగా సత్యకు పుల్లారావు పలు సూచనలు చేశారు. పోర్టులు, హార్బర్లు సంబంధిత శాఖ మీద మరింత పట్టు సాధించాలని, పరిశ్రమలు ఎక్కువగా రాష్ట్రానికి వచ్చేలా కృషి చేయాలని చెప్పారు. సత్యకు దుశ్శాలువా కప్పి సత్కరించారు..



అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న డీటీ సుజాత

సమాచార హక్కుతో జవాబుదారీతనం

కొండపి, సెప్టెంబరు 26 : సమాచార హక్కు వలన ప్రభుత్వ యంత్రాంగంలో జవాబుదారీతనం పెరుగుతుందని, ప్రతి పౌరుడు సమాచార చట్టం ద్వారా సమాచారాన్ని పొందవచ్చని డిప్యూటీ తహసీల్దార్ జె. సుజాత చెప్పారు. సమాచారం చట్టం-2005పై కొండపి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. 2009 నుంచి అమలులోకి వచ్చిన ఈ చట్టం ద్వారా కోరే సమాచారాన్ని గ్రామ స్థాయిలో ఉచితంగా, మండలస్థాయిలో 5 రూపాయలు, జిల్లా స్థాయిలో 10 రూపాయలు నగదు చలానా ద్వారా చెల్లించి సమాచారం 30 రోజుల్లోగా పొందవచ్చని తెలిపారు. ఏవో డి.విజయకుమార్, ఏపీవో మహాలక్ష్మి, మండల స్థాయి శాఖల సిబ్బంది, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆ కానిస్టేబుల్ డబ్బులు తీసుకోలేదు..!

- సీసీకెమెరా ఫుటేజీలో వెలుగుచూసిన నిజం
- ఎస్పీని కలిసి క్షమాపణ చెప్పిన ఫిర్యాదుదారుడు

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 26: ఓ కానిస్టేబుల్ కిందపడిన తన డబ్బులు తీసుకున్నాడంటూ ఫిర్యాదు చేసిన పశువుల ఆసుపత్రిలో పనిచేస్తున్న అటెండర్ చింతలపూడి వెంకట్రావు గురువారం ఎస్పీ ఏఆర్.దామోదర్‌ను కలిసి క్షమాపణలు కోరారు. ఆ కానిస్టేబుల్ ఎలాంటి తప్పు చేయలేదని విన్నవించారు. వివరాల్లోకి వెళితే.. ఈనెల 20వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు మద్దిరాలపాడు పర్యటన సందర్భంగా పోలీసు సిబ్బంది రహదారి వెంట విధుల్లో ఉన్నారు. అయితే చదలవాడలోని కుంభకర్ణ హోటల్, శ్రీలక్ష్మి రెస్టారెంట్‌ల వద్ద ఉన్న అటెండర్ వెంకట్రావు తన ప్యాంట్ జేబులోని రూ.13 వేలు నగదు అదృశ్యమైనట్లు గుర్తించాడు. దీంతో ఆయన కుంభకర్ణ హోటల్‌లో ఉన్న సీసీఫుటేజీని పరిశీలించారు. అయితే అక్కడ ఓ కానిస్టేబుల్ కిందకి వంగి ఏదో తీసుకున్నట్లు గుర్తించారు. దీంతో ఆ కానిస్టేబుల్ తన నగదును తీసుకున్నట్లు పోలీసులకు చెప్పాడు. ఆ కానిస్టేబుల్‌పై ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఒంగోలురూరల్ సీఐ ఆధ్వర్యంలో గురువారం సీసీ ఫుటేజీని క్షుణ్ణంగా పరిశీలించగా ఆ కానిస్టేబుల్ శీతలపానీయం తాగి బాటిల్ కింద పెడుతున్నట్లు ఉంది. దీంతో బాధితుడు వెంకట్రావు కానిస్టేబుల్‌పై అనవసరంగా ఆరోపణ చేసినట్లు అంగీకరించి ఎస్పీని కలిసి క్షమాపణ కోరారు. అదే సమయంలో ఎస్పీ కూడా సీసీఫుటేజీని పరిశీలించి కానిస్టేబుల్ కేవలం తాను తాగిన శీతలపానీయం బాటిల్‌ను కింద పెడుతున్నట్లు నిర్ధారించారు.

జిల్లా స్థాయి పోటీలకు టంగుటూరు క్రీడాకారులు

టంగుటూరు, సెప్టెంబరు 26 : సింగరాయకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముగిసిన నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల్లో టంగుటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పలు ఆటల పోటీల్లో విజయం సాధించారు. వీరు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీల్లో ప్రతిభచూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక య్యారు. ఎంపికైన విద్యార్థులను టంగుటూరు హైస్కూల్ పీటీ యరమాల అరుణ అభినందించారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి పెద్దపీట

మంత్రి స్వామి
ఎన్‌హెచ్‌ఎఫ్‌డీసీ లబ్ధిదారులకు రూ.1.46కోట్ల రుణాలు అందజేత

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 26: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి టీడీపీ కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. గురువారం ఒంగోలు నగరం భాగ్యనగర్‌లోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన బధిరుల సంకేతభాషా దినోత్సవం, జాతీయ దివ్యాంగుల ఆర్థిక అభివృద్ధి సంస్థ ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులకు రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమానికి కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి మంత్రి స్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ఎనలేని కృషి చేస్తుందన్నారు. బధిరుల సంకేత భాషా దినోత్సవం బధిరుల పాఠశాలలో జరుపుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు. వారి భవిష్యత్తు, ఆర్థిక పరిస్థితులు, జీవన ప్రమాణాలు, మెరుగుపడేలా అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్క విభిన్న ప్రతిభావంతులు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. 40 సంవత్సరాల క్రితమే బధిరుల కోసం దూరదర్శన్‌లో ప్రత్యేకంగా వార్తలు ప్రసారం అయ్యేవని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి స్వామి, వేదికపై కలెక్టర్ అన్సారియా

అలాగే విశాఖపట్నంలో రూ.200 కోట్లతో 30 ఎకరాలలో జాతీయ విభిన్న ప్రతిభావంతుల క్రీడా ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. అలాగే పదో తరగతి పాసైన విద్యార్థులు ఇంటర్ చదువుకునేందుకు అవసరమైన జూనియర్ కళాశాల ఏర్పాటుకు తనవంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే విభిన్న ప్రతిభావంతులు తమ సమస్యలు చెప్పుకునేందుకు కలెక్టర్, ఎస్పీ స్పందన (గ్రీవెన్స్)లో ప్రతి సోమవారం ఒక అనువాదకుడిని అందుబాటులో ఉంచుతామని మంత్రి తెలిపారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులను అన్ని విధాలుగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. బధిరులైనప్పటికీ అన్నింటిలో ఎవరికీ తీసిపోమనే విధంగా బాగా చదివి, ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ముందుగా మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా జ్యోతి ప్రజ్వలన చేసి విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషి చేసిన హెలెన్‌కెల్లర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే 50 మంది లబ్ధిదారులకు రూ.1.46కోట్ల రుణ చెక్కులను మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో విభిన్నప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ అర్చన, సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్, పలువురు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని అందజేస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ అధికారులు

'ఇది మంచి ప్రభుత్వం'పై ప్రచారం

జరుగుమల్లి (కొండపి), సెప్టెంబరు 26 : గడిచిన వంద రోజుల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ఇంటింటికీ తిరిగి జరుగుమల్లిలో ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ ప్రచారం నిర్వహించారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రచార పత్రాలను ఇంటింటికీ తిరిగి అందించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉన్నం రామ్మోహన్, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

టంగుటూరులో...

టంగుటూరు : స్థానిక అంబేడ్కర్‌నగర్‌లో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. టంగుటూరు-2 గ్రామ సచివాలయ సర్వేయర్ చంద్రమౌళి, టీడీపీ నాయకుడు ఈశ్వరరావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో వీరు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ ప్రగతి నివేదికలు పంపిణీ చేశారు.

బ్యూటీ పార్లర్ కోర్సులో ఉచిత శిక్షణ

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 26: ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంత మహిళలకు బ్యూటీపార్లర్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 3వ తేదీ నుంచి 30 రోజుల పాటు ఒంగోలులో శిక్షణ ఇస్తామన్నారు. 18 ఏళ్ల నుంచి 45 ఏళ్లలోపు మహిళలు తమ వివరాలతో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన వసతి, సదుపాయాలు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్నవారు 9573363141 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

నవోదయ దరఖాస్తు గడువు పొడిగింపు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 26: ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయం లో 2025-26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల గడువును అక్టోబరు 7వతేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ గీతాలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష వచ్చే ఏడాది జనవరి 18వతేదీన ఒంగోలులో జరుగుతుందన్నారు. గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు నవోదయ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తులను పూరించి చదువుతున్న పాఠశాల హెచ్‌ఎంతో ధ్రువీకరించి ఆన్‌లైన్‌లో సమర్పించాలని ఆమె కోరారు.

టీటీసీ ఫలితాలు విడుదల

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 26: ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు(టీటీసీ) టైలరింగ్, డ్రాయింగ్, ఎంబ్రాయిడింగ్ పరీక్షా ఫలితాలు విడుదలైనట్లు ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కె.శివకుమార్ గురువారం తెలిపారు. ఫలితాలు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ వెబ్‌సైట్ లో ఉన్నాయన్నారు.

సింగరాయకొండ గురుకులంలో డిగ్రీ కళాశాల

సాంఘిక సంక్షేమశాఖ మంత్రి స్వామి వెల్లడి
వచ్చే నెల నుంచి విద్యార్థులకు ఐఐటీ, నీట్ శిక్షణ
కలెక్టర్, ఏపీఎస్‌డబ్ల్యూ కార్యదర్శితో కలిసి పాఠశాల సందర్శన

సింగరాయకొండ, సెప్టెంబరు 26 : సింగరాయకొండలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తామని, రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా తొలుత ఇక్కడే చేపడతామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. అదే విధంగా వచ్చే నెల నుంచి గురుకుల విద్యార్థులకు ఐఐటీ, నీట్ శిక్షణా తరగతులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గురువారం కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఇతర అధికారులతో కలిసి గురుకుల పాఠశాలను మంత్రి సందర్శించారు. తొలుత ఏపీఎస్‌డబ్ల్యూ ఆర్‌ఐఈఎస్ జిల్లా కోఆర్డినేటర్ జయ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి లక్ష్మానాయక్, ఈఈ భాస్కర్‌రావు, డీఈ జగన్, ప్రిన్సిపాల్ కె. రమాదేవితో సమీక్షించారు. పాఠశాలలో వసతులు, సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కొన్ని తరగతి గదులలో ఫ్యాన్లు, లైట్లు లేవని, వంట మనుషుల సమస్య ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఏపీఎస్‌డబ్ల్యూ ఆర్‌ఐఈఎస్ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ పాఠశాలకు అవసరమైన ఫ్యాన్లు, లైట్లు సమకూరుస్తామని, వంట మనుషులను తాత్కాలిక ప్రాతిపదికన నియమించుకోవాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. పారిశుధ్య పనులకు అవసరమైన మిషన్లను కొనుగోలు చేయడానికి టెండర్లు పిలిచినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఐఐటీ, నీట్ శిక్షణ తరగతులకు అవసరమైన తరగతి గదుల లభ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీనిపై ప్రిన్సిపాల్ స్పందిస్తూ ప్రస్తుతం 10 గదులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అనంతరం ప్రాంగణంలోని భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ ఈ ఏడాది పాఠశాలలో 80 మందికి ఐఐటి, నీట్ శిక్షణ ఇస్తామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం 160 మందికి కోచింగ్ ఇస్తామని తెలిపారు. ఈ ఏడాది మొదటి కౌన్సెలింగ్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 40 మంది గురుకుల పాఠశాల విద్యార్థులకు ఎంబీబీఎస్ సీట్లు వచ్చాయని, ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని స్వామి చెప్పారు. అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి, కలెక్టర్, కార్యదర్శి ప్రసన్న వెంకటేష్ భోజనం చేశారు.



గురుకుల పాఠశాలలో భవనాలను పరిశీలిస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా, ఏపీఎస్‌డబ్ల్యూ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్

పాకల బీచ్ సందర్శన

గురుకుల పాఠశాల సందర్శన ముగిసిన అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియా, సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్‌తో కలిసి మంత్రి డాక్టర్ స్వామి పాకల తీరాన్ని సందర్శించారు. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రారంభించి వైసీపీ ప్రభుత్వంలో నిలిచిపోయిన టూరిజం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ పాకల తీరాన్ని పర్యాటకంగా అన్నీ విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవి, ఇన్‌చార్జి ఎంపీడీవో నరసింహమూర్తి, సర్పంచ్ సైకం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డిక్లరేషన్‌పై జగన్ సంతకం చేయాల్సిందే

మంత్రి స్వామి డిమాండ్

సింగరాయకొండ గురుకుల పాఠశాల సందర్శన సందర్భంగా విలేకరుల అడిగి ప్రశ్నలకు మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సమాధానం చెప్తూ.. తిరుమల తిరుపతి దేవస్థానంలో అన్యమతస్థులు దర్శనం చేసుకోవాలంటే డిక్లరేషన్‌పై సంతకం చేయడం సంప్రదాయం అన్నారు. ఈ సంప్రదాయాన్ని గౌరవిస్తూ రాష్ట్రపతిగా ఉన్నసమయంలో అబ్దుల్ కలాం, యూపీఏ చైర్‌పర్సన్‌గా ఉన్న సోనియాగాంధీ డిక్లరేషన్‌పై సంతకం చేశారని గుర్తుచేశారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా తిరుమల సందర్శనకు వచ్చే సమయంలో డిక్లరేషన్‌పై సంతకం చేయాలని డిమాండ్ చేశామని తెలిపారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని సంప్రదాయాలను తుంగలో తొక్కి అడ్డగోలుగా వ్యవహరించారని చెప్పారు. ప్రజలు కూడా అదే డిమాండ్ చేస్తున్నారన్నారు.

ఎక్సైజ్ కొత్త టీమ్

బాధ్యతలు తీసుకున్న డిప్యూటీ కమిషనర్
నేడు సీఐలకు పోస్టింగ్
నెలాఖరులోపు సిబ్బంది బదిలీలు



బాధ్యతలు స్వీకరిస్తున్న డీసీ హేమంత్‌నాగరాజు, ఏసీ కె. విజయ

ఒంగోలు(క్రైం)సెప్టెంబరు 26 : ఎక్సైజ్ నూతన పాలసీ రానున్న నేపథ్యంలో ముందుగా బదిలీల ప్రక్రియను పూర్తి చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఎక్సైజ్‌శాఖను విభజించి 70 శాతం మంది సిబ్బందితో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) ఏర్పాటు చేసింది. అదే విధంగా మద్యం దుకాణాలు ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని నిర్వహించింది. నూతన ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత ఎక్సైజ్‌శాఖలో మార్పులు తీసుకువస్తోంది. తొలుత ఎక్సైజ్, ఎస్‌ఈబీలను విలీనం చేసింది. అనంతరం కొత్త పాలసీని తీసుకొచ్చి మద్యం దుకాణాలు తిరిగి ప్రయివేటు వ్యక్తులకు కేటాయించనుంది. ఈ క్రమంలో ప్రకాశం, బాపట్ల జిల్లాల పర్యవేక్షణకు ఒంగోలు కేంద్రం కార్యాలయంగా డిప్యూటీ కమిషనర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విధుల నిర్వహణకు అసిస్టెంట్ కమిషనర్‌ను నియమించింది. దీంతో డిప్యూటీ కమిషనర్‌గా హేమంత్ నాగరాజు, అసిస్టెంట్ కమిషనర్‌గా కె.విజయలు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఖాజామోహిద్దీన్ బుధవారమే బాధ్యతలు స్వీకరించారు. ఇంకా రెగ్యులర్ ఎఈఎస్‌గా పి.ఎర్ర వెంకట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎఈఎస్‌గా ఎ.జనార్దనరావును నియమిస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇంకా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 14 సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల నియామకం శుక్రవారం జరిగే అవకాశం ఉంది. ఎస్సైలు, కింది స్థాయి సిబ్బంది బదిలీలు కూడా ఈనెలాఖరు లోపు పూర్తి చేయనున్నారు.

వచ్చే నెలలో మద్యం దుకాణాలకు టెండర్లు

వచ్చే నెలలో మద్యం దుకాణాలకు ఆన్‌లైన్ ద్వారా టెండర్లు పిలవనున్నారు. దరఖాస్తు ఫీజు రూ. 50 వేలనుంచి రెండు లక్షల వరకు ఉండే అవకాశం ఉంది. నూతన పాలసీ వచ్చిన తరువాత వచ్చే నెలలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి ప్రయివేటు దుకాణాలలో మద్యం విక్రయాలు జరగనున్నాయి. ఇప్పటికే కొన్ని మద్యం బ్రాండ్‌ల ధరలు తగ్గించి విక్రయాలు చేస్తున్నారు. వచ్చే నెలలో అన్నీ మద్యం బ్రాండ్‌లు అందుబాటులో ఉంటాయని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు.

రోడ్డు ఆక్రమణదారులకు ముచ్చెమటలు

బొమ్మలసెంటర్ నుంచి నాలుగు వైపులా ఆక్రమణలు
పంచాయతీ పాలకుల హెచ్చరికలతో తొలగింపు

టంగుటూరు, సెప్టెంబరు 26 : హైదరాబాద్‌లో హైడ్రా దాడుల తరహాలో టంగుటూరులోనూ ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఆక్రమించి షాపులకు అద్దెకు ఇస్తున్నారు. ఒంగోలు, నెల్లూరు, కొండపి, టంగుటూరు గ్రామంలోకి వెళ్లే నాలుగు రోడ్ల కూడలి. దీనినే బొమ్మల సెంటర్ అని పిలుస్తారు. నలుదిశలా ఆక్రమణలతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య ఎప్పుడూ వేధిస్తూనే ఉంటోంది.

ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఆక్రమణలు

ఒంగోలు నుంచి సింగరాయకొండ రోడ్డు మార్గం మొత్తం అంటే టంగుటూరు పంచాయతీ పరిధిలో రెండు కిలోమీటర్ల దూరానికి పైగా ఉంది. ఈరోడ్డుకు ఇరువైపులా ఫైర్‌స్టేషన్ దగ్గర నుంచి రైల్వేస్టేషన్ వరకు ఆక్రమణలకు గురైంది. గతంలో ఈరోడ్డు పొడవునా పంచాయతీ వారు కాలువ తవ్వించారు. అంటే రోడ్డుకు ఇరువైపులా ఉండే షాపులన్నీ కాలువకు పైభాగంలోనే ఉండాలి. ప్రస్తుతం కాలువ కనిపించకపోగా.. ఆక్రమణలతో నిండిపోయింది.

కొండపి రోడ్డులోనూ ఇదే పరిస్థితి

కొండపి రోడ్డులోనూ దండిగా ఆక్రమణలే. కొండపి రోడ్డు పొడవునా రెండు వైపుల కలిపి ఒక కిలోమీటరు ఉంటుంది. గ్రామంలోని బడాబాబుల ఆక్రమణలు అటు ఒంగోలు-సింగరాయకొండ, ఇటు కొండపి రోడ్డులోనూ కొదువ లేదు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి షాపులు అద్దెకు ఇస్తున్నారు.

కళ్లు తెరిచిన పంచాయతీ

ఎట్టకేలకు పంచాయతీ పాలకులు కళ్లు తెరిచారు. బస్టాండ్ సెంటర్‌లో ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. రోడ్డు పొడవునా ఉన్న ఆక్రమణదారులను కలసి తక్షణమే ఆక్రమణలను తొలగించాలని హెచ్చరించారు. లేదంటే తామే తొలగిస్తామని హెచ్చరించారు. ఈ క్రమంలో ఆక్రమణదారులు ఆక్రమణలో ఉన్న సామగ్రి వృథాగా పోవడం ఎందుకు? మనమే తొలగించుంటే పోలా అని ఆపనిలో పడ్డారు. కొండపి రోడ్డులోని ఆక్రమణదారుల్లో కొందరు ససేమిరా అంటున్నట్లు సమాచారం.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

పెద్దదోర్నాల, సెప్టెంబరు 26: ప్రతిఒక్కరూ మొక్కలునాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సావిత్రి అన్నారు. గురువారం కళాశాలలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సావిత్రి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కళాశాల ఆవరణలో అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటారు. పిచ్చి మొక్కలు తొలగించి ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు విజయబాబు, జయసింహా, అక్రమ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పాఠశాలకు ఫ్యాన్లు అందజేత

గిద్దలూరు, సెప్టెంబరు 26: పట్టణంలోని మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలకు ప్రజాసంకల్ప వేదిక ప్రతినిధులు గురువారం పదివేల రూపాయల విలువైన ఫ్యాన్లు, టేబుళ్ళు, ఇతర సామగ్రిని అందచేశారు. కార్యక్రమంలో వేదిక జిల్లా అధ్యక్షుడు ఒ.వెంకటయ్య, మహిళ అధ్యక్షురాలు ఎ.నాగమణి, మాజీ సైనికుల విభాగం జిల్లా అధ్యక్షులు ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాంత్‌కు సేవారత్న అవార్డు

గిద్దలూరు, సెప్టెంబరు 26: రాచర్ల మండలం చినగానిపల్లె గ్రామానికి చెందిన మాగులూరి శ్రీకాంత్‌కు మదర్‌థెరిస్సా సేవారత్న అవార్డు లభించింది. చిన్ని సేవాసంస్థను ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలను ఆయన చేపట్టారు. దాతల సహకారంతో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్నారు. శ్రీకాంత్ చేస్తున్న సేవా కార్యక్రమాలను గుంటూరులోని అమ్మఒడి చారిటబుల్ ట్రస్టు గుర్తించింది. మదర్‌థెరిస్సా సేవారత్న అవార్డుకు ఎంపికైనట్లు సమాచారం పంపింది. ఈ నెల 29న గుంటూరులో శ్రీకాంత్‌కు అవార్డును ప్రదానం చేస్తారని చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు.

శివశంకర్‌ను కలిసిన జనసేన నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 26: ఏపీఎంఎస్‌ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ తమ్మిశెట్టి శివశంకర్‌ను జనసేన నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జనసేన రాష్ట్ర మైనార్టీ నాయకులు మిర్జా అబీద్ హుస్సేన్, ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ సాదిక్‌లు ఆయనను కలిశారు.

వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ నాశనం

» ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం, సెప్టెంబరు 26: గత వైసీపీ ప్రభుత్వం రూ.7 లక్షల కోట్ల ప్రజా ధనాన్ని దోచేసిందని, వ్యవస్థలన్నింటినీ సర్వనాశనం చేసిందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. గురువారం స్థానిక 31వ వార్డు పరిధిలోని రాజ్యలక్ష్మి కాలనీలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఇంటింటికి తిరిగి వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలపై రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను స్వయంగా అంటించారు.

అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేసరికి అన్ని వ్యవస్థలు లూటీ అయ్యాయన్నారు. అన్ని శాఖలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయన్నారు. అయితే, ఎంతో అనుభవం ఉన్న ధీశాలి కాబట్టి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెనుకడుగు వేయకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రాధాన్యతా క్రమంలో నెరవేరుస్తున్నారని చెప్పారు. ఇచ్చి న మాట తప్పకుండా పింఛన్‌ను పెంపుదల చేసి ఇంటి వద్దనే పంపిణీ చేయిస్తున్నారని అన్నారు. మార్కాపురం నియోజకవర్గంలో గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఏడు కిలోమీటర్ల మేర మాత్రమే రహదారులు నిర్మించిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తాను 87 కిలోమీటర్లు సీసీ రహదారులు నిర్మించినట్లు గుర్తుచేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే నియోజకవర్గానికి రూ.15 కోట్లు సీసీ రహదారుల నిర్మాణానికి సాధించానన్నారు. త్వరలోనే పనులు పూర్తవుతాయని చెప్పారు.

నియోజకవర్గంలో గత ఐదేళ్ల కాలంలో దోపిడీలు, దుర్మార్గాలు జరిగాయని ఎమ్మెల్యే కందుల పేర్కొన్నారు. పేద, మధ్యతరగతికి చెందిన వారి భూములను ఇష్టారీతిన కొల్లగొట్టారన్నారు. ప్రజలకు మేలు చేసేది కూటమి ప్రభుత్వమేనని చెప్పారు. ప్రధానంగా పట్టణంలోని శివారు కాలనీల అభివృద్ధికి శక్తివంచనలేకుండా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, మేనేజర్ శ్రీనివాసన్, పలు విభాగాల అధికారులు, టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, కౌన్సిలర్ నాలి కొండయ్య, మాలపాటి వెంకటరెడ్డి, డి.మస్తానయ్య, హుసేన్‌ఖాన్,తదితరులు పాల్గొన్నారు.



మార్కాపురం: వంద రోజుల పాలనపై కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

దామచర్ల సత్యకు అభినందనలు తెలిపిన కందుల

మార్కాపురం, సెప్టెంబరు 26: రాష్ట్ర మారిటైమ్ బోర్డ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన దామచర్ల సత్యను ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అభినందించారు. నెల్లూరు వెళ్తూ మార్గమధ్యలో ఒంగోలులోని ఆయన స్వగృహంలో కలిసి అభినందనలు తెలియజేశారు. పార్టీకి, తీర ప్రాంత అభివృద్ధికి శక్తివంచనలేకుండా కృషి చేయాలని నారాయణరెడ్డి కోరారు.

ప్రతి హామీని అమలుచేస్తాం: ముత్తుముల

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 26: ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను అమలుచేస్తుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని ముండ్లపాడు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు డీఎస్సీపై తొలి సంతకం ముఖ్యమంత్రి చంద్రబాబు చేశారని చెప్పారు. రైతులకు ఇబ్బందికరంగా ఉన్న ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేశారన్నారు. అన్న క్యాంటీన్లను ప్రారంభించినట్లు చెప్పారు. ఒకటో తేదీన పెంచిన పింఛన్లను అందజేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవి, ఉపసర్పంచ్ కడియం శేషగిరి, తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, టీడీపీ నాయకులు బొమ్మినేని వెంకటేశ్వర్లు, గంజి వీరయ్య, శివపురం మురళి, బైలడుగు బాలయ్య, ముచ్చుకుంట్ల రామసుబ్బయ్య, బోదనబోయిన గోపాలకృష్ణ, నరసింహులు, ఎంఈవో కావడి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



గిద్దలూరు: ముండ్లపాడులో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

పార్వతమ్మకు నివాళి.. మాజీ పార్లమెంటు సభ్యురాలు మాగుంట పార్వతమ్మ మృతదేహానికి గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి గురువారం సాయంత్రం నివాళులు అర్పించారు. రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో కలిసి ముత్తుముల అశోక్‌రెడ్డి నెల్లూరు వెళ్ళి మాగుంట పార్వతమ్మకు నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం వ్యక్తం చేశారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ క్షేమం



గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న సీడీపీవో పద్మావతి

పెద్దదోర్నాల, సెప్టెంబరు 26: పౌష్టికాహారంతోనే తల్లీ బిడ్డ క్షేమంగా ఉంటారని సీడీపీవో పద్మావతి అన్నారు. మండలంలోని నల్లగుంట్లబోడు గిరిజన గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సీడబ్ల్యూఎస్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం పౌష్టికాహార వారోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా మార్కాపురం సీడీపీవో పద్మావతి మాట్లాడుతూ చెంచు గిరిజనుల్లో పౌష్టికాహారలోపం అధికంగా ఉందన్నారు. తద్వారా ప్రసవం సమయంలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశముందన్నారు. గర్భం దాల్చినప్పటి నుంచి ఆకుకూరలు, కూరగాయలు, రాగి, కొర్ర, జొన్న వంటి చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. పెరటితోటలు సాగు చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు కుటుంబ అవసరాలు తీర్చుకోవచ్చునని చెప్పారు. ఈసందర్భంగా గర్భిణుల సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మొబలైజర్ కె.బాలరాజు, పుష్పలత, సూపర్‌వైజర్ అంజమ్మ, కార్యకర్త సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటో సౌకర్యం

పెద్దదోర్నాల, సెప్టెంబరు 26: మండలంలోని చిన్నదోర్నాల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మండ్ల శ్రీనివాసులును బయన్నగూడెం గిరిజన పెద్దలు, విద్యార్థులు గురువారం ఘనంగా సన్మానించారు. బయన్నగూడెం నుంచి చిన్నదోర్నాల పాఠశాలకు విద్యార్థులు రావాలంటే ఐదు కిలోమీటర్లు నడవాలి. ఈక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చొరవ తీసుకుని స్థానిక ఆర్‌డీటీ సంస్థ నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సంస్థ ప్రతినిధులు ఆటో సౌకర్యం కల్పించారు. విషయం తెలుసుకున్న గ్రామం ఈటీటీ అధ్యక్షుడు దాసరి లక్ష్మయ్య ఆధ్వర్యంలో గూడెం పెద్దలు తమ పిల్లలకు ఆటో సౌకర్యం కల్పించినందులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ శాలువ కప్పి సత్కరించారు.

ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌కు సన్మానం

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 26: స్థానిక బీసీ భవన్‌లో తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముత్తోజు సుధాకర్‌ను గురువారం సన్మానించారు. ఈసందర్భంగా బీసీ భవన్ కమిటీ అధ్యక్షుడు గోను సుబ్బారావు మాట్లాడుతూ వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తూ సుమారు 70 మంది విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందటంతో తోడ్పాటు అందించిన సుధాకర్ సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధానకార్యదర్శి పిన్నిక లక్ష్మీప్రసాద్, రంగస్వామి గౌడ్, పురుషోత్తం, వెంకటేశ్వర్లు, చెంచయ్య, రమణగౌడ్, వి.శ్రీనివాసులు, రాంబాబు, చిన్నవెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థుల హాస్టల్ ఆకస్మిక తనిఖీ

మార్కాపురం, సెప్టెంబరు 26: స్థానిక కళాశాల విద్యార్థుల హాస్టల్‌ను మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి జె.కిషోర్‌కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థులు ఉండే గదులు, మరుగుదొడ్లు, స్టోర్ రూమ్, వంటశాలలను పరిశీలించారు. రిజిస్టర్‌లోని విద్యార్థుల పేర్లు చూసి హాజరువేశారు. హాస్టల్ ఆవరణలో కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది ఎదురైనా టోల్‌ఫ్రీ 15100 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని న్యాయాధికారి విద్యార్థులకు సూచించారు. ఆయన వెంట న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



ఆహార పదార్థాలు పరిశీలిస్తున్న న్యాయాధికారి కిషోర్‌కుమార్

అక్రమంగా నిల్వఉంచిన ఎరువుల సీజ్

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 26: అక్రమంగా నిల్వఉంచిన ఎరువులను వ్యవసాయాధికారులు సీజ్‌చేసి 6ఏ కేసు నమోదు చేశారు. గిద్దలూరు మండలంలోని గడికోట పంచాయతీ పరిధిలో గల దేవనగరం గ్రామంలో గురువారం రూ.3,77,208 విలువగల ఎరువులను గుర్తించి సీజ్ చేశారు. సహాయ వ్యవసాయ సంచాలకులు జి.బాలాజీనాయక్, వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి దాడిచేసి 6ఏ కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో సాంకేతిక వ్యవసాయాధికారి షేక్ బాషా, గ్రామ రెవెన్యూ అధికారి సయ్యద్ చిన్నఖాశింపీరా పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు విరాళం

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 26: పట్టణంలోని అన్న క్యాంటీన్ నిర్వహణకు బేస్తవారపేటకు చెందిన బనగానిపల్లె బాబులయ్య రూ.10,116 విరాళాన్ని గురువారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో దూదేకుల ఆదాం, పెద్ద ఎలికేటి, డీకే, చిన్నఖాదరయ్య పాల్గొన్నారు.

ఆటోనగర్‌పై నిఘా పెంచాలి

మార్కాపురం, సెప్టెంబరు 26: మండల పరిధిలోని దరిమడుగు పంచాయతీలో ఉన్న ఆటోనగర్‌పై నిఘా పెంచాలని ప్రతినిధులు గురువారం మార్కాపురం సీఐ పి.సుబ్బారావును కోరారు. ముందుగా ఆయనకు పూలకుండీ అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ప్రతినిధులు ఎమ్మార్కే బాషా, నేరెళ్ల బద్రి మాట్లాడుతూ ఆటోనగర్‌లో తరచూ దొంగతనాలు జరుగుతున్నాయని తెలిపారు. పోలీసుల పర్యవేక్షణ, గస్తీ లేకపోవడంతో దుకాణాలను పగులగొట్టి విలువైన సామగ్రిని దొంగిలించుపోతున్నారని తెలిపారు. సీఐ సుబ్బారావు మాట్లాడుతూ ఆటోనగర్‌లో దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సయ్యద్ వలి, మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం

మార్కాపురం, సెప్టెంబరు 26: నూర్ బాషా కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు కేటాయిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 23న రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ సమావేశంలో పేర్కొనడం హర్షణీయమని నూర్‌బాషా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.మస్తానయ్య అన్నారు. స్థానిక ఎస్ఎస్ నగర్‌లోని ఆయన కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో మస్తానయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న నూర్ బాషాల కార్పొరేషన్ ఏర్పాటుకు త్వరలో జరగనున్న కేబినేట్ సమావేశంలో ఆమోదం పొందుతుందని తెలిపారని, ఇది శుభపరిణామమని అన్నారు. చంద్రబాబుకు నూర్‌బాషాలు రుణపడి ఉండారని తెలిపారు. కార్యక్రమంలో డి.ఖాశిం, డి.పెద్దహుస్సేన్, డి.బాబు, డి.వలి పాల్గొన్నారు.

ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 26: తెలంగాణ లో భూస్వామ్య వ్యవస్థకు జమీందారి ఆలోచన విధానానికి వ్యతి రేకంగా పోరాడిన బీసీ మహిళ చాకలి ఐలమ్మ జయంతి గురువారం నిర్వహించారు. స్థానిక బీసీ భవన్‌లో ఐలమ్మ చిత్ర పటానికి నివాళులర్పించారు. బీసీ సంఘం నాయకులు పిన్ని క లక్ష్మీప్రసాద్, సుబ్బారావు, రజక సంఘం నాయకులు ఆర్. శ్రీనివాసులు, సీహెచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో శార్వానీష్‌కు పతకం

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 26: స్థానిక సాయిబా లాజీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న శార్వానీష్ కరాటేలో ప్రతిభ కనబర్చారు. ఈసందర్భంగా గురువారం పాఠశాలలో శర్వానీష్‌ను పాఠశాల డైరెక్టర్ ప్రకాశ్‌రావు, ప్రిన్సిపాల్ సయ్యద్ మస్తాన్‌వలిలు అభినందించారు. కర్నూలులో జరిగిన 6వ ఇంటర్ స్టేట్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో కటా, కుమితే విభాగాలలో శర్వానీష్ బంగారు పతకం సాధించారని అభినందించారు.

నేడు సీపీఐ కార్యకర్తలకు శిక్షణ తరగతులు

త్రిపురాంతకం, సెప్టెంబరు 26: సీపీఐ నాయకులు, కార్యకర్తలకు జిల్లాస్థాయి శిక్షణ తరగతులను శుక్రవారం కనిగిరిలో నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.శ్రీనివాస్ తెలిపారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ ఈ తరగతులకు మండలంలోని నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

ప్రతిభ చాటిన స్వాప్నిక

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 26: మార్కాపురం ప ట్టణానికి చెందని కొండెపోగు స్వాప్నిక విశాఖపట్నం మహిళా మనోవికాస్ క్రాఫ్ట్ అండ్ క్రియేషన్ సంస్థ నిర్వహించిన ప్రదర్శనలో గిన్నీస్ వరల్డ్ రికార్డు పొందారు. సంస్థ వ్యవస్థా పకురాలు సూరెపల్లి మాధవి, గిన్నీస్ రికార్డు లండన్ ప్రతినిధి స్వప్నిల్ గంగారికర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 450 మంది మహిళలు రూ.58,112 క్రోచర్స్‌తో లార్జెస్ట్ డిస్‌ప్లే ఆఫ్ క్రోచర్స్ స్క్వేర్‌ను తయారు చేశారు. ఇందులో పాల్గొన్న తనకు గిన్నీస్ వరల్డ్ రికార్డు మెమెంటోతో పాటు ప్రశంసాపత్రం అందజేసినట్లు స్వాప్నిక తెలిపారు. తాను తయారుచేసిన వస్తువులను ఉచితంగా అనాథలకు అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు.

29న టెట్ మోడల్ టెస్ట్

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 26: యూటీఎఫ్, డీవై ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 29న మార్కాపురం పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో టెట్ మోడల్ టెస్ట్ నిర్వ హిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి.ప్రభాకర్ ఒక ప్ర కటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు 9951068750, 9948464660 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల

కొనకనమిట్ల, సెప్టెంబరు 26: మండలంలోని చినమనగుండం గ్రామంలో గురువారం పోలేరమ్మ తిరునాళ్లను వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు మొక్కుబడులు తీర్చేందుకు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా అమ్మవారి గుడికి వచ్చారు. అమ్మవారికి పొంగళ్ళు పెట్టి కొబ్బరికాయలు కొట్టి మొక్కుబడులు తీర్చుకున్నారు.



పోలేరమ్మ తల్లికి బోనాలు తీసుకెళుతున్న మహిళలు

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

తర్లుపాడు, సెప్టెంబరు 26: మార్కాపురం నియోజకవర్గ స్థాయిలో జరిగిన అండర్-17 పోటీలలో తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. జిల్లా స్థాయి పోటీలలో పాల్గొనేందుకు ఎంపికయ్యారు. బాలురు అండర్-17 విభాగంలో ఎస్‌కే మౌలాలి, ఎస్‌కే అఫ్రిద్ బాషా, విష్ణు, జి.అజయ్‌లు ఎంపియ్యారు. బాలికల విభాగంలో పి.దీక్ష, వై.వైష్ణవి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌బాబు తెలిపారు.

ఎద్దును చంపిన పెద్దపులి

కంభం, సెప్టెంబరు 26: అర్థవీడు మండలం అచ్చంపేట రైతు అంకయ్యకు చెందిన ఎద్దుపై పెద్దపులి దాడిచేసి చంపిన ఘటన గురువారం వెలుగుచూసింది. నల్లమల అటవీ ప్రాంత సమీపంలో ఉన్న అచ్చంపేట గ్రామం చుట్టూ కొండలు, దట్టమైన అటవీ ప్రాంతం ఉంది. ఆ గ్రామంలోని రైతులు తమ పశువులను మేత కోసం సమీపంలోని అడవికి తోలుకెళతారు. రెండు రోజులక్రితం అంకయ్య అనే రైతు రెండు ఎద్దులను మేత కోసం అడవిలోకి తోలాడు. సాయంత్రానికి ఒక ఎద్దు మాత్రమే ఇంటికి వచ్చింది. చీకటిపడడంతో మరుసటి రోజు ఉదయం అడవిలో గాలించినా ఎద్దు కనిపించలేదు. గురువారం పశువుల కాపరులకు మరణించిన ఎద్దు కనిపించడంతో రైతు అంకయ్యకు, ఫారెస్టు అధికారులకు సమాచారం తెలపడంతో సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. పరిసరాలలో ఉన్న పెద్దపులి పాదముద్రలను గుర్తించి నిర్ధారించారు. రూ.50వేల విలువ చేసే ఎద్దు పులిదాడిలో చనిపోయిందని, ఫారెస్టు అధికారులు తనను ఆదుకోవాలని రైతు అంకయ్య కోరారు. స్పందించిను ఫారెస్టు ఆఫీసర్ రంగారెడ్డి నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈఘటనతో అచ్చంపేట సమీప గ్రామస్థులు రైతులు భయాందోళనకు గురవుతున్నారు.

బేస్తవారపేటలో క్రికెట్ టోర్నమెంట్

బేస్తవారపేట, సెప్టెంబరు 26: బేస్తవారపేట పట్టణంలో అక్టోబరు ఒకటో తేదీనుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ను హరి ఎడ్యుకేషనల్ కన్సల్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.లక్ష, రెండో బ హుమతి రూ.50 వేలు, మూడో బహుమతి రూ.30వేలు అం దజేస్తారు. ఎంట్రీ ఫీజు రూ.2500 చెల్లించి నమోదు చేయించుకోవాలని నిర్వాహకులు కోరారు. వివరాలకు 8977553431, 8105934660 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పేదరికం లేని రాష్ట్రమే ప్రభుత్వం లక్ష్యం

● టీడీపీ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి ●దర్శిలో 'ఇది మంచి ప్రభుత్వం' నిర్వహణ ● ప్రభుత్వ ప్రగతి పత్రాల పంపిణీ



దర్శిలో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, సెప్టెంబరు 26 : పేదరికం లేని రాష్ట్రం కోసం టీడీపీ కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ పేర్కొన్నారు. దర్శి నగర పంచాయితీలోని క్రిస్టియన్‌పాలెంలో గురువారం సాయంత్రం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర 2047 వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. మంచినీటి వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో 2047 నాటికి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా అభివృద్ధి చేసి ప్రథమస్థానంలో నిలపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. వందరోజుల పాలనలో ఎన్నో అద్భుతాలు సాధించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గత వైసీపీ అరాచకపాలన నుంచి విముక్తులైన ప్రజలు కూటమి ప్రభుత్వ ప్రజారంజక పాలనలో ఆనందంతో ఉన్నారని చెప్పారు. దర్శి నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. దర్శి నగర పంచాయితీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, కనిగిరి ఆర్డీవో పాలపర్తి జాన్‌ఇర్విన్, తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్, నగరపంచాయితీచైర్మెన్ నారపుశెట్టి పిచ్చయ్య, వైస్ చైర్మెన్ స్టీవెన్, నగర పంచాయితీ కమిషనర్ వై.మహేశ్వరరావు, తెలుగు మహిళ నాయకురాలు ఎం.శోభారాణి, దర్శి పట్టణ టీడీపీ అధ్యక్షుడు యాదగిరి వాసు, పట్టణ క్లస్టర్ ఇన్‌చార్జ్ నారపుశెట్టి మధు, ఐటీడీపీ ఇన్‌చార్జ్ సందు రామయ్య, బీసీ సెల్ నాయకుడు బేళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దొనకొండ : సంక్షోభంలోనూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి అభివృద్ధికి రెక్కలు తొడిగిన మంచి ప్రభుత్వంగా టీడీపీ కూటమి ప్రభుత్వం గుర్తింపుపొందిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వర రావు తెలిపారు. మండల కేంద్రమైన దొనకొండ వీవీపురం ఎస్సీకాలనీలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు ప్రభుత్వ ప్రగతిపై ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. గోడలకు స్టిక్కర్లు అంటించే కార్యక్రమం గురువారం సందడిగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తారన్నారు. దర్శి టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, సీఎం నారా చంద్రబాబునాయుడు సహకారంతో దర్శి నియోజకవర్గ అభివృద్ధికి బాధ్యతగా చర్యలు చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొమ్మతోటి సుబ్బారావు, పత్తి వెంకటేశ్వర్లు, పరుచూరి రామలింగయ్య, షేక్ తోహీద్, మస్తాన్, పోతిపోగు చెన్నయ్య, రాయని కుమార్, మాలపోలు చెన్నయ్య, టోనీ, సచివాలయ సిబ్బంది మరికొందరు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పామూరు : రాష్ట్రంలో పేదరికం నిర్మూలన కోసం ప్రజలకు అభివృద్ధి సంక్షేమ పథకాలు సక్రమంగా అందించడమే ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్ధనరావు, టీడీపీ మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు తెలిపారు. పామూరు పట్టణంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రభుత్వం ఏర్పడి వంద


ప్రభుత్వ ప్రగతి పత్రాలు పంపిణీ చేస్తున్న శివకోటేశ్వరరావు

రోజుల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, చేపట్టనున్న సంక్షేమ కార్యక్రమాల గురించి అవగాహన కల్పిస్తూ, కరపత్రాలను పంపిణి చేశారు. పింఛన్లు, పెంచి పేదలకు రూ.5లకే కడుపు నిండా భోజనం పెట్టి మెగా డీఎస్సీతో నిరుద్యోగులకు భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. దీపావళి నుంచి ఉచితంగా గ్యాస్ పంపిణీ చేస్తూ ప్రజల ఆకాంక్షలకు అణుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యారవ శ్రీనివాసులు, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, సయ్యద్ అమీర్‌బాబు, బొల్లా నరసింహారావు, షేక్ ఖాజారహంతుల్లా, ఆర్‌ఆర్ రఫీ, ఉప్పలపాటి హరిబాబు, పువ్వాడి వెంకట్ చౌదరి, ఇర్రికోటిరెడ్డి, దేవరపు మాల్యాద్రి, ఎన్ సాంబయ్య, జి.శ్రీనివాసులు, నాగేంద్రచారి, మెంటా నరశింహారావు, బీజేపీ నాయకులు కేవీ.రమణయ్య, జె.చినసుబ్బయ్య, జనసేన నాయకులు దర్శి ఏడుకొండలు సచివాలయ అధికారులు, వీఆర్వోలు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

మంత్రి లోకేష్‌ను కలిసిన వెంకటేశ్వర్లు


లోకేష్‌ను కలిసిన వెంకటేశ్వర్లు

పామూరు, సెప్టెంబరు 26 : టీడీపీ జాతీయ కార్యదర్శి రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను పామూరు మండలం ఇనిమెర్ల గ్రామ టీడీపీ అధ్యక్షులు నల్లబోతుల వెంకటేశ్వర్లు మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థి ఉగ్ర నరసింహారెడ్డి విజయానికి చేసిన కృషి గురించి వివరించారు. రాజకీయాల్లో నీలాంటి బీసీ సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తులు అవసరమని, గ్రామంలో టీడీపీ బలోపేతానికి తగిన కృషి చేయాలని కోరినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు.

జిల్లా స్థాయి పోటీలకు మారెళ్ల విద్యార్థులు

ముండ్లమూరు, సెప్టెంబరు 26 : జిల్లాస్థాయిలో జరిగే ఆటల పోటీలకు మండలంలోని మారెళ్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయురాలు సుజాతలు తెలిపారు. జావలిన్ త్రో అండర్ - 17 విభాగంలో పీ అనురాధ, హేమర్ త్రో అండర్ - 17లో అనురాధ, హైజంప్ అండర్ - 14లో కే శ్రావణసాయి, రన్నింగ్ ఆరు వందల మీటర్లలో ఏ.సంతోష్, వాలీబాల్ అండర్ - 14లో ఏ సంతోష్, కబడ్డీలో అండర్ - 14లో కే.శ్రావణ సాయి, కే.అరుణ, వై.అర్జున్, ఖోఖో అండర్ - 14 పీ.ప్రవల్లికలు ఎంపికైనట్లు తెలిపారు. ఆ పాఠశాల చైర్మన్ పూరిమెట్ల యల్లయ్య జిల్లాస్థాయి ఆటల పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు.

3న రేషన్ బియ్యం వేలం

దొనకొండ, సెప్టెంబరు 26 : అక్రమంగా తరలిస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీల్లో పట్టుబడిన రేషన్‌బియ్యాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ఉత్తర్వుల మేరకు అక్టోబరు 3న తహసీల్దార్ కార్యాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రమాదేవి తెలిపారు. వివిధ ప్రదేశాల్లో పట్టుబడి సీజ్ చేసిన స్థానిక సివిల్‌సప్లై గోడౌన్‌లోని 37.50 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని వేలం వేయనున్నట్లు తెలిపారు. వేలంలో హాజరయ్యే వారు కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ నుంచి లైసెన్స్ పొంది వేలానికి హాజరయ్యే సమయంలో వ్యాపారం చేయుచున్న వారై ఉండాలన్నారు. వేలం నిర్వహించే ముందురోజుల్లో సరుకును పరిశీలించుకోవడానికి అనుమతి ఉందన్నారు. ఆసక్తి ఉన్న వారు నిబంధనల ప్రకారం వేలంలో పాల్గొనాలని తహసీల్దార్ వివరించారు.

బాలికలకు గుడ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన


మాట్లాడుతున్న ఎస్సై మల్లికార్జునరావు

తాళ్లూరు, సెప్టెంబరు 26 :బాలికలు గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని, ఎస్సై ఎస్.మల్లికార్జునరావు తెలిపారు. స్థానిక వీకే.ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్, ఈవ్‌టీజింగ్‌పై విద్యార్థులకు గురువారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ బాలికలు విద్యార్థి దశ నుండే ఇతరుల వ్యవహరించే తీరుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలికలు సమాజంలో జరుగుతున్న మంచి చెడుపట్ల అవగాహన కల్గివుండాలన్నారు. సమస్యలను బాలికలు ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. బాలికలకు రక్షణ కల్పిస్తూ ప్రభుత్వాలు అనేక చట్టాలు చేశాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయు లు, మహిళా పోలీసులు, పోలీస్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత

పీసీపల్లి : బాలికల సంరక్షణ మనందరి బాధ్యత అని పీసీపల్లి ఎస్సై జి.కోటయ్య అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఈవ్‌టీజింగ్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నేరాలకు దూరంగా ఉండాలన్నారు. చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిఒక్క విద్యార్థి విద్యపై శ్రద్ధ వహించి ఉన్నత చదువులు చదువుకుని లక్ష్యాలను చేరుకోవాలన్నారు. .బాలికలకు ఎటువంటి ఇబ్బందులు కలిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

పల్లెల్లో ప్రశాంతంగా ఉండాలి


సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ

కురిచేడు, సెప్టెంబరు 26: మండలంలో పల్లెల్లో ప్రశాం తంగా ఉండాలని దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ అన్నారు. కురిచేడు పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికం గా తనిఖీ చేశారు. ఎస్‌ఐ శివ, సిబ్బందికి పలు సూచనలు చేశారు. దేకనకొండ గ్రామం లో పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆవులమంద గ్రామంలో ఫ్లెక్సీల చింపివేతపై తలెత్తిన వివాదంలో గ్రామస్థులతో మాట్లాడారు. కల్లూరు గ్రామంలో ఇరు కుటుంబాల మధ్య జరిగిన వివాదం కొట్లాట వరకు వెళ్లడంపై ఆరా తీశారు. పల్లెల్లో ఎవరూ గొడవలకు దిగినా పోలీసు చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శివ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌కు ఏసీ బహూకరణ

ముండ్లమూరు, సెప్టెంబరు 26 : ముండ్లమూరు పోలీసు స్టేషన్‌కు రూ.35వేలు విలువైన ఏసీ (ఎయిర్‌కండీషనర్)ను మండలంలోని పసుపుగల్లు గ్రామానికి చెందిన టీడీపీ యువ నాయకుడు గూడాల సాంబశివారెడ్డి బహూకరించారు. గురువారం ఎస్‌ఐ వై నాగరాజుకు ఏసీని అందజేశారు. దీంతో ఎస్‌ఐ నాగరాజు, సిబ్బంది సాంబశివారెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో గూడాల శివశంకర్‌రెడ్డి, బిజ్జం వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నాయుడుపాలెంలో పారిశుధ్య కార్యక్రమాలు


కాలువలు శుభ్రం చేయిస్తున్న పారిశుధ్య కార్మికులు

ముండ్లమూరు, సెప్టెంబరు 26 : మండలంలోని నాయుడుపాలెం పంచాయ తీ పరిధిలో వారంరోజుల నుంచి ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. గ్రామ సర్పంచ్ గొర్రె శ్రీదేవి రాముడు పర్యవేక్షణలో పెదరావిపాడు, తమ్మలూరు, నాయుడుపాలెం గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు మురుగు కాలువల్లో పూడిక ఏర్పడి దుర్వాసన వెద జల్లుతుంది. పారిశుధ్యం లోపించి వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందుజాగ్రత్తగా గ్రామాల్లోని మురుగు కాలువల్లో పేరుకు పోయిన మురుగుతోపాటు వీధుల్లో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించారు. సైడు కాలువల్లో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించి దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేపట్టారు. గ్రామంలో ఉన్న వ్యర్ధ పదార్ధాలను సైతం డంపింగ్ యార్డులో పార వేస్తున్నారు. గ్రామంలో ప్రధానంగా నాయుడు పాలెంలో ఎస్సీ, బీసీ మెయిన్ వీధులు, తమ్మలూరులో బీసీ కాలనీలో వీధులు, రావిపాడులో బీసీ, ఓసీ, ఎస్సీ కాలనీ వీధుల్లో మురుగు కాలువల్లో పూడిపోయిన చెత్తాచెదారాన్ని, మురికిని తొలగించారు. సర్పంచ్ రాముడు తీసుకున్న నిర్ణయాన్ని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్‌రెడ్డి, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

నూకసాని బాలాజీకి టీడీపీ నాయకుల అభినందన


బాలాజీని సన్మానిస్తున్న బీసీ నాయకులు

కురిచేడు, సెప్టెంబరు 26: రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు నూకసాని బాలాజీని చంద్రబాబునాయుడు ఎంపిక చేయడంపై టీడీపీ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం టీడీపీ నాయకులు ఒంగోలు వెళ్లి బాలాజీకి అభినందనలు తెలిపారు. బాలాజీని కలసిన వారిలో టీడీపీ మండల నాయకులు గడ్డం బాలయ్య, దాసరి ఏడుకొండలు, కమతం నాగిరెడ్డి, మక్కెన లక్ష్మీనారాయణ, మొఘల్ మస్తాన్‌వలి, గంధం గురునాథం, బాలయ్య, నాగపెద్ది రాజు, రామకోటి రెడ్డి, గొట్టిపాటి వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

విహారయాత్రలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు

సీఎస్‌పురం(పామూరు) సెప్టెంబరు 26 :మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో గల కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు గురువారం దక్షిణ బారత దేశ విహారయాత్ర కు బయలు దేరారు. విహారయాత్రలో భాగంగా కర్ణాటక రాష్ట్రంలోని మండ్యాలో విసీ ఫామ్, తమిళనాడు రాష్ట్రంలోని ఊటి, కొడైకెనాల్, తదితర వ్యవసాయ క్షేత్రాలను అధ్యాపకులతో కలిసి సందర్శించారు.

యుటీఎఫ్ సేవలు అభినందనీయం

● ఎంపీపీ ఉషాముర‌ళి


మాట్లాడుతున్న ఎంపీపీ ఉషామురళి

దొనకొండ, సెప్టెంబరు 26 : ఉపాధ్యాయులకు అన్ని రకాలుగా గత 50 సంవత్సరాలుగా యూటీఎఫ్‌శాఖ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళీ పేర్కొన్నారు. యూటీఎఫ్ శాఖ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ఇటీవల నిర్వహించిన వివిధ రకాల ఆటలపోటీల్లో విజేతలకు బహుమతుల పంపిణీ చేశారు. ఉపాధ్యాయదినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై కలెక్టర్ నుంచి అవార్డు పొందిన వారిని, మండలంలో అన్ని రంగాల్లో ప్రతిభకనబర్చిన వారిలో యూటీఎఫ్ ఎంపిక చేసిన 19 మంది ఉపాధ్యాయులకు ప్రతిభా పురస్కారాలు అందించి పూలమాలలు, శాలువాలతో సత్కరించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వసంతరావునాయక్, ఎంఈవోలు సాంబశివరావు, అమీర్, జడ్పీటీసీ సభ్యుడు సుధాకర్, యూటీఎఫ్ రాష్ట్రనాయకులు టి.రాజశేఖర్, గౌరవ అధ్యక్షుడు ఏ ప్రభుదాస్, అధ్యక్షుడు వెంకటరెడ్డి, ప్రతినిధులు ఈ రోశయ్య, అంజినాయక్, లత మండలస్థాయిలోని యూటీఎఫ్ శాఖకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కురిచేడు, సెప్టెంబరు 26: కురిచేడు మండల పరిషత్ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతుందని ఎంపిడివో కుసుమ కుమారి తెలిపారు. మండల స్థాయి అధికారులు, ఎంపీటీసి సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొనాలని ఆమె కోరారు.

రాయితీపై రైతులకు విత్తనాలు

సీఎస్‌పురం(పామూరు) సెప్టెంబరు 26 : పంటలు సాగుచేసే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీ పథకం కింద అందజేస్తున్న జొన్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఒంగోలు పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి షేక్.రజబ్‌బాష అన్నారు. మండలంలోని కోవిలంపాడు గ్రామంలో వ్యవసాయశాఖ తరపున జొన్నవిత్తనాలను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షులు షేక్ నాయబ్‌రసూల్, సచివాలయ సిబ్బంది అమృత, టీడీపీ నాయకులు టి.లక్ష్మీనారాయణ, చావా వెంకట సుబ్బయ్య, చావా ప్రభాకర్, షేక్ హజరత్, రైతులు పాల్గొన్నారు.

పార్వతమ్మ మృతికి పలువురి సంతాపం


పార్వతమ్మ భౌతిక కాయానికి నివాళి అర్పిస్తున్న తాళ్లూరు ఎంపీపీ

తాళ్లూరు, సెప్టెంబరు 26 : ఒంగోలు మాజీ ఎంపీ, కావలి మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ మృతికి తాళ్లూరు మండలంలోని పలువురు టీడీపీ నేతలు నివాళి అర్పించారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డికి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢసానుభూతిని తెలిపారు. నెల్లూరులోని మాగుంట నివాసంతో పార్వతమ్మ మృతదేహానికి పలువురు నివాళి అర్పించారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షులు బి.ఓబుల్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి మానం రమేష్‌బాబు, నాయకులు గొల్లపూడి వేణుబాబు, షేక్ కాలేషావలి, పిన్నిక రమేష్, రాచకొండ వెంకట్రావు, దర్శి మున్సిపల్ కౌన్సిలర్ వి.సీ.రెడ్డి తదితరులు ఉన్నారు.

జడ్పీటీసీ మారం నివాళి

జడ్పీటీసీ మారంవెంకటరెడ్డి, బెల్లంకొండపాలెంసర్పంచ్ పి.ఎస్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు జిఎస్‌ప్రభాకర్‌రెడ్డిలు పార్వతమ్మ మృతదేహాన్ని సంద ర్శించి నివాలులర్పించారు. ఎంపీ మాగుంటను పరామర్శించి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

పామూరు : ఒంగోలు మాజీ ఎంపీ, కావలి మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వత మ్మ అకాల మృతికి కనిగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామి రెడ్డిలు సంతాపం తెలిపారు. స్థానిక దారపనేని క్యాంపు కార్యాలయంలో పార్వతమ్మ చిత్ర పటానికి గురువారం పూల మాలలు వేసి ఘనంగా నివాలర్పించారు. భర్త మాగుంట సుబ్బరామిరెడ్డి రాజకీయ వారసురాలిగా రాణించి నెల్లూరు. ప్రకాశం జిల్లాల ప్రజల హృదయాల్లో చేరగని ముద్ర వేశారన్నారు. కార్యక్రమలంలో జీవి.రత్నం, ఎం.సుబ్బరాయుడు, కౌలూరి ఖాజారహంతుల్లా, దారపనేని రాజేంద్ర, నరసింహనాయుడు, నాగరాజు, యర్రసింగ్ రాయుడు, ఎం రాహుల్‌యాదవ్, వెంకట్‌రెడ్డిలు పాల్గొన్నారు.

దర్శి : దివంగత మాజీ ఎంపీ మాగుంట పార్వతమ్మ మృతదేహం వద్ద దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, డాక్టర్ లలిత్‌సాగర్‌లు నెల్లూరు లోని వారి స్వగృహంలో గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాగుంట కుటుంబం 35 సంవత్సరాలుగా జిల్లా ప్రజలకు ఎనలేని సేవలందించారన్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఆయన తనయుడు రాఘవరెడ్డి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. దర్శి నగర పంచాయితీ కౌన్సిలర్ విసి రెడ్డి, తదితరులు ఉన్నారు.

తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన


వరిపొలాలను పరిశీలిస్తున్న అధికారులు

కనిగిరి, సెప్టెంబరు 26: సాగుచేసిన పైర్లలో తెగుళ్ల నివారణకు రైతులలో అవగాహన పెంచాలని, ఆత్మా డీపీడీ సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం వ్యవసాయశాఖ సిబ్బంది అధికారులతో జరిగిన సమీక్షలో ఆయన ప్రొజెక్టర్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్కేవీవై రాఫ్తార్ పథకం కింద పంట జీవిత దశల, చీడ పీడల, సూక్ష్మపోషక లోపాల గురించి వివరించారు. రైతులకు ఎప్పటికప్పుడు తెగుళ్లపై సాంకేతిక సలహాలు ఇవ్వాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఎస్.రామ్మోహన్ మాట్లాడుతూ వీపీఏలు ఎప్పటికప్పుడు వారి నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ రైతులకు అన్ని విధాలుగా అందుబాటులో ఉండాలన్నారు. రైతుల కు పంట యాజమాన్య పద్ధతులపై విస్తృతంగా అవగాహన కల్పించేలా గ్రామల్లో రైతుశిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. దర్శి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు జీ.రమేష్, వెంకటేశ్వర రెడ్డిలు కంది, వరి, మిరప, సజ్జ, మొక్కజొన్న, కొర్ర పంటలలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై, మినుము పంటలో రకాలు, చీడపీడలు, కలుపు నివారణ పద్ధతులపై రైతులకు వివరించాలని సూచించారు. అనంతరం మండలంలోని నందనమారెళ్ల గ్రామలోని వరినాట్లు వేసిన పైరును, కంది పంటను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వనరులు కేంద్రం వ్యవసాయాధికారి వీవీ శేషయ్య, ఏడీఏ ఈవీ రమణ, ఏఏవోలు, వీపీఏలు, మీసేవ, రైతుభరోసా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

బాలల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించాలి

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి


పౌష్టికాహార లోగోను ప్రదర్శిస్తున్న అధికారులు

కనిగిరి, సెప్టెంబరు 25: బాలల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బీ పద్మావతి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా గురువారం కస్తూర్బా స్కూలును ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోడీ 2018వ సంవత్సరంలో రాజస్థాన్‌లో ప్రతిష్టాత్మకంగా పౌష్టికాహార వారోత్సవాలు, మాసోత్సవాలు ప్రారంభించినట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల ఎదుగుదలకు ఎంతో దోహదపడుతుందన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం మానసిక, శారీరక ఎదుగుదలకు దోహద పడుతుందన్నారు. ఆర్డీవో జాన్‌ఇర్విన్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలోని ప్రీ స్కూల్ ద్వారా చిన్నారులను పాఠశాల వైపుకు నడిపించేందుకు ఉపయోగ పడుతున్నాయన్నారు. అదేవిధంగా భవిష్యత్తు తరాలు పిల్లలు ఆరోగ్యంగా, దృఢంగా ఉండేందుకు కేంద్రంలో అందించే బాలామృతం, ఫోర్టిఫైడ్ రైస్, కందిపప్పు, రాగిపిండి, బెల్లం, వేరుశనగ ముద్దలు, గుడ్లు, పాలు, ఖర్జూరాలు, ఉపయుక్తంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ సరోజిన, మునిసపల్ చైర్మన్ గఫార్, ఎంఈఓలు యూవి నారాయణరెడ్డి, దేవిరెడ్డి రామిరెడ్డి, ప్రిన్సిపల్ హసీనా పాల్గొన్నారు.



పన్నులు.. 49.46%



చీరాల మునిసిపాలిటీ కార్యాలయం

- వసూళ్లు అంతంత మాత్రమే
- మున్సిపాల్టీల్లో భారీగా బకాయిలు
- లక్ష్యాల మేర వసూళ్లలో అధికారులు విఫలం
- లక్ష్యం రూ.283.26 కోట్లు.. వసూలు రూ.140.12 కోట్లు
- టాప్ టెన్‌లో వినుకొండ, దాచేపల్లి, మంగళగిరి, చీరాల
- ఈ నెలాఖరుకు నూరు శాతం వసూలు చేయాలని ఆదేశాలు

"అభివృద్ధి పనులు.. ఉద్యోగుల జీతాలు.. కార్యాలయ నిర్వహణకు నిధులు కావాలి. మున్సిపాలిటీల్లో ఆయా నిధులకు పన్నులే ఆధారం. అయితే అలాంటి పన్నుల వసూళ్లపై మున్సిపాలిటీలు ప్రత్యేక దృష్టి సారించాలి. కానీ గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని కొన్ని మున్సిపాలిటీల్లో అధికారులు పన్నుల వసూళ్లపై కనీసంగా కూడా ప్రయత్నించడంలేదని డీఎంఏ కార్యాలయ గణాంకాలు తెలియజేస్తున్నాయి. గుంటూరు కార్పొరేషన్ సహా పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని అన్ని మున్సిపాలిటీల్లో ఆస్తి, నీటి పన్ను రూ.283.26 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.140.12 కోట్లు పన్ను వసూలు చేశారు. పన్ను వసూలు 49.46 శాతానికే పరిమితమైందంటే అధికారుల పనితీరు అర్థం చేసుకోవచ్చు. ఆదాయ వనరులను పెంపొందించుకోవడంలో మున్సిపాలిటీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఈ వసూళ్లను చూస్తే తెలుస్తోంది. మున్సిపాలిటీల్లో ఆస్తి, నీటిపన్ను బకాయిలు పేరుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. మున్సిపాలిటీలకు ఇచ్చిన లక్ష్యాల మేర పన్ను వసూలు జరగడం లేదు. సిబ్బంది అలసత్వంతో వసూలు మందకొడిగా సాగుతోంది. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహిస్తున్నా మున్సిపాల్టీల్లోని అధికారులు సరైన రీతిలో స్పందించడంలేదని బకాయిలను చూస్తే తెలుస్తోంది. ఏటికేడు బకాయిలు పేరుకుపోతున్నాయే కాని వసూళ్లపై అధికారులు దృష్టి సారించడంలేదు. అవినీతి, రాజకీయ ఒత్తిళ్లతో పన్నుల వసూళ్లలో అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలున్నాయి."

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పురపాలక సంఘాలకు ప్రధాన ఆదాయ వనరు.. పన్నులు. ఇలాంటి పన్నుల వసూళ్లలో మున్సిపాలిటీలు వెనుకబడిపోతున్నాయి. పన్నుల వసూళ్లలో కనీస ప్రయత్నం కూడా ఉండటం లేదని ఈ ఆర్థిక సంవత్సరంలో వసూలైన పన్నులను చూస్తే తెలుస్తోంది. ఇక లక్ష్యాల మేర పన్నుల వసూళ్లు జరగకపోతుండ టంతో ఆ ప్రభావం ఉద్యోగుల జీతాలు, అభివృద్ధి పనులపై పడుతోంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాలిటీల్లో పన్ను వసూలు అంతంతమాత్రంగానే ఉంది. ప్రగతి పనుల నిర్వహణకు ప్రధాన వనరుగా ఉన్న పన్ను వసూళ్లలో మున్సిపా లిటీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తాజా గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఆస్తి, నీటి పన్ను వసూలు మొక్కుబడిగా సాగుతోంది. అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడంతో సిబ్బంది నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో కొన్ని మున్సిపాలిటీలు చతికిల పడుతున్నాయి. రాష్ట్ర స్థాయిలో వినుకొండ, దాచేపల్లి, తాడేపల్లి.. మంగళగిరి, చీరాల పురపాలక సంఘాలు మొదటి పదిస్థానాల్లో ఉన్నాయి. ఆస్తి పన్ను రూ.229 కోట్లకు రూ.128.89 కోట్లు వసూలు కాగా అది 56.28 శాతంగా ఉంది. నీటి పన్ను రూ.54.26 కోట్లు వసూలు లక్ష్యం కాగా ఇప్పటికి రూ.11.26 కోట్లు వసూలు కాగా అది 20.75 శాతంగా ఉంది. ఈ నెలాఖరు కల్లా నూరు శాతం పన్ను వసూలు చేయాలని మున్సిపాల్టీలకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఇచ్చిన లక్ష్యాలను వినుకొండ, దాచేపల్లి పురపాలక సంఘాలు మినహా గుంటూరు కార్పొరేషన్‌తో పాటు ఏ ఒక్క పురపాలక సంఘం చేరుకోలేదు. చిలకలూరిపేట మున్సిపాల్టీ, గుంటూరు కార్పొరేషన్ పన్ను వసూళ్లలో వెనుకబడి ఉన్నాయి. చిలకలూరిపేట మున్సిపాల్టీలో పన్నుల వసూళ్లు 36శాతం లోపే ఉంది. గుంటూరు కార్పొరేషన్‌లో 46 శాతం మాత్రమే వసూలు చేశారు. ఉన్నతాధికారులు పన్ను వసూళ్లపై సమీక్షిస్తున్నా మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యాన్ని వీడటం లేదు. ఈ నెలాఖరులోగా నూరు శాతం పన్ను వసూలు చేయాల్సి ఉండగా ఆ పరిస్థితులు లేవనే చెప్పాలి. వచ్చే నెల 1 నుంచి పన్ను కొత్త డిమాండ్ రానున్నది.

ఆస్తి పన్ను వసూళ్లు (రూ.కోట్లలో)

మునిసిపాలిటీ	లక్ష్యం	వసూలు	శాతం
గుంటూరు జిల్లా :			
గుంటూరు కార్పొరేషన్	145.54	66.53	45.70
తెనాలి	13.42	9.92	73.90
మంగళగిరి, తాడేపల్లి	18.62	17.25	92.64
పొన్నూరు	3.06	2.19	71.60
పల్నాడు జిల్లా :			
నరసరావుపేట	8.93	5.24	58.70
చిలకలూరిపేట	8.53	3.00	35.10
వినుకొండ	2.57	3.64	141.50
సత్తెనపల్లి	3.86	2.04	52.90
మాచర్ల	2.99	1.73	58.00
పిడుగురాళ్ల	2.86	2.54	88.90
దాచేపల్లి	1.07	0.99	92.20
గురజాల	0.78	0.50	64.60
బాపట్ల జిల్లా :			
బాపట్ల	5.24	2.88	54.90
రేపల్లె	2.86	2.44	85.30
చీరాల	6.20	5.72	92.10
అద్దంకి	2.47	2.28	92.10

జిల్లాలో మొదటి, చివరి స్థానాలు

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాలిటీల్లో కొన్ని పన్ను వసూళ్లలో 50 శాతం దాటాయి. నూరుశాతం మించి పన్నులు వసూలు చేసి పల్నాడు జిల్లాలోని వినుకొండ మున్సిపాలిటీ 141.50 శాతంతో రాష్ట్రంలో మొదటి పది స్థానాల్లో నిలిచింది. ఇక చిలకలూరిపేట మున్సిపాలిటీ 35.10 శాతం మాత్రమే వసూలు చేసి ఉమ్మడి గుంటూరు జిలాల్లోనే చివరి స్థానంలో నిలిచింది. గుంటూరు జిల్లా విషయానికి వస్తే మంగళగిరి, తాడేపల్లి మున్సిపాలిటీ 92.64 శాతం పన్నుల వసూలుతో జిల్లాలో ప్రథమ స్థానంలో ఉండగా గుంటూరు నగర పాలక సంస్థ 45.70 శాతంతో చివరి స్థానంలో ఉంది. ఒక బాపట్ల జిల్లాలో 92.10 శాతం పన్నుల వసూళ్లతో చీరాల, అద్దంకి మున్సిపాలిటీలు ప్రథమ స్థానంలో ఉండగా జిల్లా కేంద్రమైన బాపట్ల 54.90 శాతంతో చివరి స్థానంలో ఉంది.

డిఫాల్టర్లలో ప్రభుత్వ కార్యాలయాలు

కేంద్ర, రాష్ట్ర కార్యాలయాలకు సంబంధించిన పన్ను బకాయిలు మూడు జిల్లాల్లో రూ.కోట్లలో పేరుకుపోయాయి. డిఫాల్టర్ల జాబితాలో ఆయా ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయంటే ఆశ్చ ర్యం కాదు. మొండి బకాయిల్లో 70 శాతం వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన బకాయిలు ఉన్నాయి. గుంటూ రు కార్పొరేషన్ సహా అన్ని పురపాలక సంఘాల్లో 300 వరకు డిఫాల్టర్లను గుర్తించారు. పల్నాడు జిల్లాలో



బాపట్ల మునిసిపాలిటీ కార్యాలయం

రూ.14.82కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.5.30 కోట్లు, గుంటూరు కార్పొరేషన్‌లో రూ.55.74కోట్లు డిఫాల్టర్ల నుంచి పన్ను వసూలు చేయాల్సి ఉంది.

జీతాలు చెల్లింపుల్లో జాప్యం

మున్సిపాలిటీల్లో నిధుల లేమితో అభివృద్ధి పనుల నిర్వహణ, కార్మికుల, ఉద్యోగుల జీతాల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుంది. సకాలంలో పన్ను వసూలు కాకపోవడం వల్లే కొన్ని పురపాలక సంఘాల్లో ఈ పరిస్థితి నెలకుంది. సాధారణ నిధుల నుంచి చేపట్టే పనులు బిల్లులు చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండడంతో అవి నిలిచి పోయే పరిస్థితులు నెలకొంటున్నాయి.



కార్యదర్శుల.. పంచాయితీ

- గ్రేడ్ 5 పేరుతో అశాస్త్రీయ విభజన
- జీవో 85 ప్రకారం ఉన్నవి గ్రేడ్ 1, 2, 3, 4
- 1020 మంది పంచాయతీ కార్యదర్శులకు ఇబ్బందులు
- సచివాలయ సెక్రటరీల కోసం వైసీపీ ప్రభుత్వ వింత వాదన
- గ్రేడ్ 5 ఆధారంగా జరిపే బదిలీలను ఆపాలని డిమాండ్

గుంటూరు సిటీ, సెప్టెంబరు 26: సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టిన వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులు పంచాయతీ కార్యదర్శులకు ప్రస్తుతం తలనొప్పిగా మారాయి. పంచాయతీ వ్యవస్థకు సమాంతరంగా తీసుకువచ్చిన సచివాలయాల వల్ల సర్వీసులో ఉన్న ఉద్యోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సచివాలయ కార్యదర్శి మనుగడ కోసం పాత ప్రభుత్వం గ్రేడ్ 5 పంచాయతీలు అంటూ తెచ్చిన విభజన కొత్త వివాదాన్ని సృష్టిస్తోంది. జీవో నెంబరు 85 ప్రకారం 2019 వరకు కేవలం గ్రేడ్ 1, 2, 3, 4 పంచాయతీలు మాత్రమే ఉన్నాయి. పంచాయతీల ఆదాయం ఆధారంగా వాటిని విభజించారు. రూ.5 లక్షలు పైబడి ఆదాయం వచ్చే పంచాయతీలను గ్రేడ్ 1 అని, రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలు ఆదాయం వచ్చే వాటిని గ్రేడ్ 2 అని, రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం వచ్చే వాటిని గ్రేడ్ 3 అని, రూ.లక్ష లోపు ఆదాయం వచ్చే పంచాయతీలను గ్రేడ్ 4 అని విభజించారు. గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శి గా నియమించే వారికి సర్వీసును పరిగణనలోకి తీసుకుని అనుభవజ్ఞులకు అవకాశం ఇస్తారు. దానివల్ల గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు, పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా చేయించే వీలు ఉంటుంది. పంచాయతీ నిధులకు కూడా వారే పూర్తి జవాబుదారులు కావడం వల్ల అక్రమాలకు చాలా వరకు అవకాశం ఉండదు. ఈ పద్ధతిలో ఉన్న పంచాయతీ వ్యవస్థకు సచివాలయం ఉప్పెనలా పరిణమించింది.

అనుభవం లేని వారి చేతుల్లోకి..

గత వైసీపీ ప్రభుత్వం సచివాలయంలో కార్యదర్శి పేరుతో ప్రత్యేకంగా ఓ పోస్టును భర్తీ చేసింది. పంచాయతీ కార్యదర్శికి, సచివాలయ కార్యదర్శికి పెద్దగా సారూప్యత ఉండదు. చట్ట ప్రకారం విధులు కూడా వేర్వేరుగా నిర్దేశించబడ్డాయి. అయినా జగన్ ప్రభుత్వం సచివాలయ కార్యదర్శిని, పంచాయతీ కార్యదర్శితో సమానంగా ఎంచుతూ వచ్చింది. ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్‌కు విరుద్ధంగా గ్రేడ్ 5ని తెరపైకి తెచ్చింది. పంచాయతీలను కూడా అదే రీతిలో విభజిస్తూ వచ్చారు. విభజనకు ప్రాతిపదిక ఆదాయమా, జనాభా అన్న దానిపై స్పష్టత లేకుండానే ముందుకు వెళ్లారు. ఫలితంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1020 గ్రామ పంచాయతీల్లో ఎక్కువ ఆదాయం ఉన్న పంచాయతీలు కూడా గ్రేడ్ 5లోకి వెళ్లాయి. ఉదాహరణకు ప్రత్తిపాడు మండలంలోని ఈదులపాలెం పంచాయతీ ఆదాయం రూ.34 లక్షలు. దాన్ని కూడా గ్రేడ్ 5 లోకి మార్చారు. ఇప్పుడు అంత ఆదాయం వచ్చే ఆ పంచాయతీని బొత్తిగా అనుభవం లేని సచివాలయ కార్యదర్శి చేతిలో పెట్టటం జరుగుతుంది. అసలు ఆదాయం లేని కొన్ని పంచాయతీలను గ్రేడ్ 1, 2, 3లలో చేర్చారు. ఉదాహరణకు ఫిరంగిపురం మండలం రేపూడి గ్రామ పంచాయతీ ఆదాయం రూ.8 లక్షలు మాత్రమే. దానిని గ్రేడ్ 1 పంచాయతీగా నిర్ధారించారు. అనుభవం ఉన్న పంచాయతీ కార్యదర్శి ఆదాయం తక్కువ ఉన్న చోట, ఏ మాత్రం అనుభవం లేని సచివాలయ కార్యదర్శి ఆదాయం ఎక్కువగా ఉన్న చోట పని చేయాల్సి వస్తుంది.

విభజనపై పంచాయతీ కార్యదర్శుల నిరసన

చట్టంలో లేని గ్రేడ్ 5 పంచాయతీ విభజనపై నిరసన వ్యక్తమవుతోంది. సచివాలయ కార్యదర్శిని పంచాయతీ కార్యదర్శిగా నియమించడంపై వివాదం చెలరేగుతుంది. వారిని దృష్టిలో ఉంచుకుని పంచాయతీలను అశాస్త్రీయం గా విభజించారని పంచాయతీ కార్యదర్శులు అంటున్నారు. దానివల్ల తమకు అన్ని విధాల అన్యాయం జరుగుతుందని చెబుతున్నారు. గ్రేడ్ 5 పంచాయతీ జాబితా ఆధారంగా జరిపే బదిలీ ప్రక్రియను ఆపాలని డిమాండ్ చేస్తున్నారు. పంచాయతీరాజ్ మంత్రి, కమిషనర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్తామని చెబుతున్నారు.

కారులో వెళ్లి.. కానరాని లోకాలకు

- క్యాన్సర్ చికిత్సకు వెళ్లి వస్తూ ముగ్గురు మృతి
- గన్నవరం వద్ద ప్రమాదంలో పంగులూరు వాసుల మృతి



పి.మేరిమ్మ



మార్క్



పి.ప్రేమ (ఫైల్‌ఫొటోలు)

పంగులూరు, సెప్టెంబరు 26: క్యాన్సర్ బాధితురాలకు చికిత్స కోసం బస్సులో వెళ్లాలనుకున్నా నడవలేని స్థితిలో ఉండటంతో కారులో ప్రయాణమయ్యారు. చికిత్స అనంతరం అదే కారులో వస్తుండగా జరిగిన ప్రమాదంలో క్యాన్సర్ బాధితురాలితో పాటు మరో ఇద్దరు మృతి చెందారు. కారులో వెళ్లి కానరానిలోకాలకు వెళ్లారంటూ కుటుంబసభ్యులు, బంధువులు కన్నీటి పర్యంతమవుతున్నారు. కృష్ణాజిల్లా గన్నవరం వద్ద జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పంగులూరు మండలానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు.. మండలంలోని కోటపాడుకు చెందిన పి.ప్రేమ(52) క్యాన్సర్‌తో బాధపడుతోంది. దీంతో ప్రేమకు చికిత్స చేయించేందుకు ఆమె భర్త ఆదాము, అల్లుడు కురుగంటి మార్క్(25), అన్న కొడుకు మురారి, ఆదాము బావమరిది భార్య పి.మేరిమ్మ(40) మంగళవారం వేకువజామున కారులో వైజాగ్ వెళ్లారు. వైద్యం చేయించుకుని బుధవారం సాయంత్రం అదే కారులో తిరుగు ప్రయాణమయ్యారు. అర్ధరాత్రి సమయంలో గన్నవరం వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో మార్క్, మేరిమ్మ అక్కడికక్కడే మరణించారు. కారు నడుపుతున్న ఆదాము, మురారి తీవ్రంగా గాయపడ్డారు. స్వల్పంగా గాయపడిన ప్రేమ కోటపాడుకి తిరిగి వస్తూ గురువారం రాత్రి చిలకలూరిపేట సమీపంలో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కల్లంవారిపాలేనికి చెందిన మార్క్ మృతితో భార్య సుకన్య కన్నీరు మున్నీరవుతోంది. కొండమూరుకు చెందిన పి.మేరిమ్మ మరణ వార్తతో భర్త, కుమారులు, కుమార్తె బోరున విలపిస్తున్నారు. ప్రేమకు వైద్యం కోసం వైజాగ్‌కు బస్సులో వెళ్ళాలని భావించారు. అయితే ఆదాము, ప్రేమ నడవలేని స్థితిలో ఉండటంతో కారులో వెళ్లాల్సి వచ్చిందని, అదే బస్సులో వెళ్లి ఉంటే ఇంత దుర్ఘటన జరిగేది కాదని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు రోదిస్తున్నారు.

ఆర్డీవోలు బదిలీ

బాపట్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాపట్ల, రేపల్లె, చీరాల ఆర్డీవోలను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. బాపట్ల ఆర్డీవోగా గ్లోరియాను నియమించి ఇక్కడ పనిచేస్తున్న గంధం రవీందర్‌ను జీఏడీలో రిపోర్ట్ చేయాలని సూచించింది. రేపల్లె ఆర్డీవోగా రామలక్ష్మిని నియమించి ఇక్కడ విధులు నిర్వహిస్తున్న హేలాషాలోన్‌ను ఉయ్యూరు ఆర్డీవోగా బదిలీ చేసింది. చీరాల ఆర్డీవోగా దేవరకొండ అఖిలను నియమించి ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సూర్యనారాయణరెడ్డిని జీఏడీలో రిపోర్ట్ చేయమని ప్రభుత్వం ఆదేశించింది.

అసాంఘిక శక్తుల కట్టడికి కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్ డూడీ

- నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్ల, సెప్టెంబరు 26: అసాంఘిక కార్యకలాపాల కట్టడికి కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ తుషార్‌డూడీ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ కేసుల విచారణ వేగవంతంగా నిర్వహించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఒంటరి మహిళలు, వృద్ధుల గృహాలను సందర్శిస్తూ ఉండాలన్నారు. రాత్రి సమయాల్లో గస్తీని మరింత సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. పాతనేరస్తులు, చెడున డత కలిగిన వారిపై నిఘా ఉంచాలని ఆదేశించారు. గంజాయి, ఎస్సీ, ఎస్టీ, మిస్సింగ్ కేసులు, మహిళా సంబంధిత నేరాలు, ఫోక్సో కేసులు, దొంగతనాలు, తీవ్రమైన నేరాలు, రౌడీషీటర్లపై నిఘా ఉంచాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాన్‌బెయిల్‌బుల్ వారెంట్లు, రోడ్డుప్రమాదాలు, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు. వివిధ కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. నేరాల కట్టడికి తీసుకుంటున్న చర్యలు గురించి సంబంధిత విచారణ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నేరాల కట్టడికి కృషి చేసిన పట్టణ సీఐ ఆర్.అహ్మద్‌జాని, సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసపత్రాలు అందజేశారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, డీఎస్పీలు టి.మురళీకృష్ణ, జి.రామాంజనేయులు, పి.జగదీష్‌నాయక్, ఎస్.చంద్రమోహన్, సీఐలు జి.నారాయణ, బాల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పగ్గాలు మేరుగ నాగార్జునకు

- సామాజిక సమీకరణాల నేపథ్యంలో మాజీ మంత్రికి అవకాశం

బాపట్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రి మేరుగ నాగార్జునను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ పరిశీలకుడిగా నందిగం సురేష్‌బాబుకు వైసీపీ అవకాశం కల్పించింది. వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మోపిదేవి వెంకటరమణ అటు పార్టీకి ఇటు ఎంపీ పదవికి ఇటీవల రాజీనామా సమర్పించడంతో మేరుగ నాగార్జునకు సారథ్య బాధ్యతలను అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. తొలుత చీరాలకు చెందిన కరణం వెంకటేశ్ పేరు తెరమీదకు రాగా ఆయన తిరస్కరించారు. బుధవారం మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి తనయుడు మధుసూదనరెడ్డి పార్టీ అధినేత జగన్‌ను కలిశారు. ఆయనకే పార్టీ పగ్గాలనే ప్రచారం జరిగింది. సామాజిక సమీకరణాల నేపథ్యంలో మేరుగకు పార్టీ సారథ్య బాధ్యతలను అప్పగిస్తూ వైసీపీ నిర్ణయం తీసుకుంది. 2019 ఎన్నికల్లో వేమూరు నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన మేరుగ నాగార్జున జగన్ క్యాబినేట్‌లో మంత్రిగా కూడా పనిచేశారు. అయితే ఐదేళ్లలో నియోజకవర్గ వ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకోవడంతో ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రకాశం జిల్లా సంతనూతలపాడు నియోజకవర్గానికి ఆయన్ను బదిలీ చేసి అక్కడి నుంచి వైసీపీ బరిలోకి దించింది. ఇప్పుడు అదే వ్యక్తికి ఏకంగా వైసీపీ జిల్లా పగ్గాలు అందించడంపై సొంతపార్టీలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తగ్గించేదిలేదు

- మెట్టు దిగని వంటనూనెల వ్యాపారులు
- అధికారులు ఆదేశించినా ఎమ్మార్పీ ఆధారంగా దోపిడీ
- చర్యలు తీసుకోలేకపోతున్న రెవెన్యూ, పౌరసరఫరాల శాఖలు

గుంటూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): 'వంటనూనెల దిగుమతిపై కేంద్ర ప్రభుత్వం పెంచిన దిగుమతి సుంకం గతంలో దిగుమతి చేసుకున్న నూనెలకు వర్తించదు. అయినా వ్యాపారులు నూనెల ధరలు అమాంతం పెంచేశారు. పాత స్టాకుపై కూడా ధరలు పెంచి విక్రయించడం నేరం. స్టాక్ ఉండి కూడా లేనట్లుగా కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచితే కఠిన చర్యలు తీసుకుంటాం..' అని అధికారులు వంట నూనెల వ్యాపారులను హెచ్చరించారు. అయితే అధికారుల ఆదేశాలను జిల్లాలోని వంట నూనెల వ్యాపారులు పెడచెవిన పెడుతున్నారు. అటు వ్యాపారులు, ఇటు మాల్స్, సూపర్‌మార్కెట్ల నిర్వాహకులు వంట నూనె ధరల విషయంలో ఒక్క మెట్టు కూడా దిగలేదు. ఒక్కో ఆయిల్ ప్యాకెట్‌పై రూ.20 పెంచిన ధరనే వినియోగదారుల వద్ద వసూలు చేస్తున్నారు. అదేమని ఎవరైనా ప్రశ్నిస్తే ఎమ్మార్పీ కంటే తక్కువగా ఇస్తున్నామని సమాధానాలు చెబుతున్నారు. అంతేకాకుండా చాలా బ్రాండ్స్ ఆయిల్స్‌ని దాచేసి రెండు, మూడు రకాల ప్యాకెట్లను మాత్రమే అందుబాటులో ఉంచుతున్నారు.

వ్యాపారుల సిండికేట్..

ముడి చమురుపై కస్టమ్స్ సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం పెంచిందే తడవుగా ఈ నెల 14 నుంచి వంట నూనెలు విక్రయించే వ్యాపారులు సిండికేట్ అయిపోయారు. ఒకపక్క కేంద్రం కొత్తగా దిగుమతి చేసుకునే క్రూడ్ ఆయిల్ పైనే ఈ పెంచిన సుంకం అమలు చేయాలని చెబుతున్నప్పటికీ పాత స్టాకుపై ఇక్కడి వ్యాపారులు అమలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. అప్పటివరకు బ్రాండ్‌ని బట్టి రూ.100 నుంచి రూ.110 మధ్య ఉన్న సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటర్ ప్యాకెట్‌ని రూ.120 నుంచి రూ.130కి పెంచేశారు. అలానే రైస్‌బ్రాన్ ఆయిల్‌ని రూ.130 చేశారు. పామాయిల్, సోయాబీన్ ఆయిల్స్‌ని కూడా లీటర్‌కి రూ.20 చొప్పున పెంచారు. వంటనూనె నిత్యావసర సరుకు కావడంతో గత్యంతం లేని పరిస్థితుల్లో పెంచిన ధరలను చెల్లించి వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. ధరల పెంపుపై జిల్లా అధికారులు ఇటీవల ఆయిల్స్ డీలర్లతో సమావేశం ఏర్పాటు చేసి పాత స్టాకుపై రేటు పెంచడానికి



వీల్లేదని సూచించారు. పాత ధరలకే విక్రయించడానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అయితే గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో ఇందుకు ఏ ఒక్క వ్యాపారి ముందుకు రాలేదు. నేటికీ పెంచిన ధరలనే అమలు చేస్తున్నారు. వంటనూనె ప్యాకెట్లపై విపరీతమైన ఎమ్మార్పీ ఉంటుంది. గతంలో రూ.100కి విక్రయించిన ప్యాకెట్‌పై ఎమ్మార్పీ రూ.160 వరకు ఉంటుంది. ఇప్పుడు దానిని సొమ్ము చేసుకుంటూ ఇంకా మేము ఎమ్మార్పీ కంటే తక్కువకే విక్రయిస్తున్నామని వ్యాపారులు బుకాయిస్తున్నారు. ఈ ఎమ్మార్పీ మాయాజాలాన్ని అటు తూనికలు, కొలతలు, ఇటు రెవెన్యూ అధికారులు అరికట్టలేకపోతున్నారు.



సబ్‌స్టేషన్ ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే బీఎన్

దీపావళి నుంచి సూపర్‌సిక్స్ ధమాకా

- **మంత్రి గొట్టిపాటి రవికుమార్**
- **రామతీర్థంలో సబ్‌స్టేషన్ ప్రారంభం**
- **ఆర్‌ఎల్ పురంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం**

చీమకుర్తి, సెప్టెంబరు 26 : దీపావళి నుంచి సూపర్‌సిక్స్ పథకాల అమలు వేగం పుంజుకోనున్నదని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. రామతీర్థం వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవం, ఆర్‌ఎల్ పురంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో గురువారం మంత్రి రవికుమార్, ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. తొలుత గ్రానైట్ పరిశ్రమకు తోడ్పాటు అందించే విధంగా రామతీర్థం సమీపాన ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను గొట్టిపాటి రవికుమార్, బీఎన్ విజయ్‌కుమార్‌లు ప్రారంభించారు. అనంతరం పూజలు నిర్వహించారు. తరువాత ఆర్‌ఎల్ పురం గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ పింఛన్ నాలుగువేలకు పెంపు, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ని రద్దుచేయటం, నిరుద్యోగులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వటం, అన్నక్యాంటీన్ల ఏర్పాటు.. ఇలా వందరోజుల్లోనే ఎన్నికలనాటి హామీలైన సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేశామని వివరించారు. కొత్త పింఛన్లను అక్టోబర్, నవంబర్‌లో మంజూరు చేస్తామన్నారు. దీపావళి నుంచి మహిళలకు ఉచితంగా సిలిండర్లు పంపిణీ చేస్తామన్నారు. ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ఒకేసారి వెయ్యిరూపాయల పెన్షన్ పెంచటమే కాక మూడునెలల బకాయిలతో అందివ్వటం హర్షించదగిన పరిణామమన్నారు.

మంత్రికి గ్రానైట్ ఫ్యాక్టరీ అసోసియేషన్ వినతి

రామతీర్థం వద్ద సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రికి గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ నాయకులు కాట్రగడ్డ రమణయ్య ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ప్రారంభించిన సబ్‌స్టేషన్ సామర్థ్యం పెంచాలని కోరారు. గత ప్రభుత్వం చీమకుర్తి మండలాన్ని విద్యుత్ పరంగా దర్శి సబ్‌డివిజన్‌లో కలిపిందని, దీని వలన పలు సమస్యలు ఎదుర్కొంటున్నామని, తిరిగి ఒంగోలు డివిజన్‌లో కలపాలని కోరారు. స్పందించిన మంత్రి తక్షణమే ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఎస్‌ఈని ఆదేశించారు. అంతేగాక బూదవాడ వద్ద మరో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసి గ్రానైట్ పరిశ్రమకు విద్యుత్‌పరంగా సమస్యలు లేకుండా చేస్తామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఝాన్సీరాణి, ఆర్‌డీవో సుబ్బారెడ్డి, ఎస్‌ఈ కేవీ సత్యనారాయణ, టీడీపీ నాయకులు అడకా స్వాములు, మన్నం ప్రసాద్, గొట్టిపాటి రాఘవరావు, గొల్లపూడి సుబ్బారావు, రావిపాటి రాంబాబు, యడ్లపల్లి రామబ్రహ్మం, ఉన్నం సుబ్బారావు, కందిమళ్ల గంగాధరరావు, గొల్లపూడి కోటేశ్వరరావు, ఎనికపాటి లక్ష్మీనరసయ్య, అగ్గి రామయ్య పాల్గొన్నారు.



పార్వతమ్మ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యేలు బీఎన్, ఉగ్ర

పార్వతమ్మకు ఘననివాళులు

- **ఎంపీ మాగుంటను పరామర్శించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు**

ఒంగోలు(కలెక్టరేట్) సెప్టెంబరు 26 : ఒంగోలు మాజీ ఎంపీ మాగుంట పార్వతమ్మ మృతి పట్ల పలువురు జిల్లా నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. చెన్నైలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్సపొందుతూ బుధవారం ఉదయం ఆమె కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆమె పార్థీవదేహాన్ని నెల్లూరులోని వారి ఇంటికి తీసుకొచ్చారు. గురువారం ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు పార్వతమ్మ పార్థీవదేహాన్ని సందర్శించారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయకుమార్, డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కందుల నారాయణరెడ్డి, దర్శి ఇన్‌చార్జీ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, టీడీపీ నేత కందుల రామిరెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురువారం సాయంత్రం నెల్లూరులో పార్వతమ్మ అంత్యక్రియలు జరిగాయి.

ఆకట్టుకున్న సంకేత భాషలో కలెక్టర్ ప్రసంగం

బధిరుల సంకేత భాషా దినోత్సవం సందర్భంగా స్థానిక భాగ్యనగర్‌లోని బధిరుల పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారీయా ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో కలెక్టర్ బధిర భాషలో మాట్లాడారు. సైగలు చేస్తూ, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా ఎలా చదువుతున్నారు. విద్యాభ్యాసాలు ఎలా ఉన్నాయి అంటూ వారిని సైగల ద్వారా అడగటంతో అర్థం చేసుకున్న విద్యార్థులు ఉత్సాహంగా బదులిచ్చారు. దీంతో అక్కడ ఉన్న విద్యార్థులు అధికారులు సైతం కలెక్టర్ ముచ్చటించిన విధానంపై హర్షం వ్యక్తం చేసి, అభినందించారు.

- ఒంగోలు (కార్పొరేషన్)

ఆహార పదార్థాలు, డెయిరీ ఉత్పత్తులలో అధికం

అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్న వ్యాపారం

యథేచ్ఛగా అమ్మకాలతో ప్రమాదంలో ప్రజారోగ్యం

క్రిమినల్ చట్ట పరిధిలోకి తెస్తేనే అడ్డుకట్ట

రాష్ట్రంలో కల్తీ గుర్తింపు ల్యాబ్ ఒకటే కావడంతో కేసుల్లో జాప్యం

అధికారులు తక్షణం దృష్టిపెట్టాల్సిందే..

అంతా 'కల్తీ'!



జిల్లాలో కల్తీ దందా జోరుగా సాగుతోంది. అందరూ నిత్యం తాగే పాలు నుంచి తినే తిండి వరకు కల్తీమయం చేస్తున్నారు. గత వారంరోజులుగా తిరుమల వ్యవహారం దేశం మొత్తం చర్చనీయాంశమైంది. పవిత్రమైన ప్రసాదంగా భావించే లడ్డూలో ఉపయోగించే నెయ్యిలో ఇతర పదార్థాలు కలిపినట్లు గుర్తించారు. అదే సమయంలో జిల్లాలోనూ కల్తీ వ్యాపారం యథేచ్ఛగా నడుస్తోంది. దర్శి ప్రాంతాల్లో రసాయనాలతో పాలు తయారుచేస్తున్నారు. మరోవైపు ఒంగోలులోనూ నెయ్యి స్కాంను గతంలో అధికారులు గుర్తించారు. ఇటీవల రోడ్‌సైడ్ ఫుడ్ సెంటర్లలో బిర్యానీలో నాసిరకం పదార్థాలు వాడినట్లు అధికారులు గుర్తించి కేసులు నమోదు చేశారు. అలాగే మినరల్ వాటర్ బాటిళ్లు కూడా నకిలీవి అమ్ముతున్న పరిస్థితి. అయితే మొక్కుబడి పెనాల్టీలతో సరిపెట్టి వదిలేస్తుండటంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. నకిలీ తయారీకేంద్రాలపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోకుంటే ప్రజారోగ్యం ప్రమాదంలో పడే అవకాశాలు స్పష్టంగా కనినిపిస్తున్నాయి.

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 26: జిల్లాలో నూనెలు, నీళ్లు, ఆహారం, కారం, ప్రతి ఒక్కరు వినియోగించే పాలు సైతం కల్తీమయంగా మారాయి. డబ్బు సంపాదనే ధ్యేయంగా కొందరు అక్రమార్కులు ఆ దందాకు పాల్పడుతున్నారు. దానికితోడు అధికశాతం టిఫిన్ సెంటర్లు, హోటళ్ల తక్కువ ధరకు వస్తున్నాయని నాణ్యతను పట్టించుకోకుండా వాటిని వినియోగిస్తున్నారు. ఫలితంగా ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతోంది. తక్కువ రకం నూనె, కంటికి ఇంపుగా ఉండేందుకు వాడే రసాయనాల కారణంగా ఆహారపదార్థాలు విషపూరితంగా మారుతున్నాయి. పాలిష్ చేసిన రేషన్ బియ్యాన్ని ఉపయోగించడం వలన అధికశాతం ప్రజలు ఉదర సంబంధమైన వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ కల్తీని అరికట్టాల్సిన అధికారులు తనిఖీలు నిర్వహించినా ప్రయోజనం లేకుండాపోతుంది. ప్రత్యేకించి నకిలీ పదార్థాలు ఉన్నట్లు గుర్తించి కేసులు నమోదు చేసినా, అవి క్రిమినల్ చట్టపరిధిలోకి రావడం లేదు. కేవలం జాయింట్ కలెక్టర్ సమక్షంలో పెనాల్టీ విధించడంతో వ్యాపారుల ఇష్టారాజ్యమైంది. గతంలో మునిసిపల్ అధికార యంత్రాంగం ఫుడ్ ఇన్‌స్పెక్టర్లుగా ఉండగా ప్రస్తుతం ఆహార తనిఖీల నిమిత్తం ఆహార భద్రత అధికారులకు ఆ బాధ్యతలు అప్పగించారు. దీంతో ఫిర్యాదులు వస్తే తప్ప కార్యాలయం నుంచి కాలు బయటపెట్టకుండా రూ.వేలలో అదనపు ఆదాయానికి అలవాటు పడి ప్రజారోగ్యాన్ని విస్మరించారు.

ఫాస్ట్‌ఫుడ్‌కు పెరిగిన డిమాండ్

ప్రస్తుత రోజుల్లో అధికశాతం ప్రజలు ఇంటి వంటకు విరామం ప్రకటిస్తున్నారు. ఫాస్ట్‌ఫుడ్‌లు, రెస్టారెంట్లకు వెళ్లడం ఎక్కువైంది. దీంతో వీధికొక్క ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వెలుస్తోంది. ఇదిలా ఉండగా, కర్రీస్ పాయింట్లు కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి. సాయంత్రమైతే చాలు రహదారుల్లో ఫుట్‌పాత్ వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. తోపుడు బండ్లపై టిఫిన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. జనం కూడా వాటిని ఆదరిస్తున్నారు. ఇంటిల్లిపాది వెళ్లి ఆహారపదార్థాలను తింటున్నారు. అయితే వ్యాపారులకు ఆదాయం మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉన్నా, నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో తిన్న వారికి మాత్రం అనారోగ్య సమస్యలు తప్పడం లేదు. ఎక్కువగా ఫుడ్ పాయిజన్, డయేరియా బారిన పడుతున్నారు.

గడిచిన ఐదేళ్లలో నమోదైన కేసులు

104

జిల్లాలో గడిచిన ఐదేళ్లలో సుమారు 104 కేసులు నమోదు చేయగా, వ్యాపారుల వద్ద నుంచి సుమారు రూ.34.85 లక్షల అపరాధ రుసుము వసూలు చేశారు. 2021-22 ఏడాదిలో 23 కేసులు నమోదుచేయగా, 2022-23లో 27 కేసులు, అలాగే 2023-24లో 50 కేసులు, 2024-25కు సంబంధించి ఇప్పటివరకు 6 కేసులు నమోదు చేశారు. అందులో ఎక్కువగా పాలు, డెయిరీ ఉత్పత్తులు ఉండగా వంట నూనెలు, బేకరి ఐటమ్స్, అలాగే నెయ్యి, నాన్‌వెజ్, వెజ్ బిర్యానీలు, నూడిల్స్ తయారీ, చికెన్ పకోడి, కేంద్రాలలోనే కల్తీ ఎక్కువగా జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. వాటితోపాటు టీ పౌడర్, జీడిపప్పు, కారం తయారీ, జ్యూస్ పాయింట్లలోనూ నకిలీ భాగోతం నడుస్తోంది. ఇదిలా ఉంచితే ఐస్‌క్రీమ్, ప్యాక్ చేసిన నీళ్ళ ప్యాకెట్లు, బాటిళ్లు ఇలా అన్నీ రకాల ఆహార పదార్థాలలోనూ కల్తీ ఉన్నట్లు గుర్తించారు.

క్రిమినల్ కేసుల పరిధిలోకి తేస్తేనే అడ్డుకట్ట

ఆహార పదార్థాలలో కల్తీని గుర్తించేందుకు అవసరమైన ల్యాబ్ రాష్ట్రంలో విశాఖలోనే ఉంది. ఇతర జిల్లాలో లేకపోవడంతో సేకరించిన శాంపిల్స్‌ను ల్యాబ్‌లకు పంపి, అక్కడ నుంచి నివేదికలు రావడానికి చాలా సమయం పడుతోంది. దీంతో నకిలీ వ్యాపారానికి అడ్డుకట్ట వేసే పరిస్థితి కనిపించడం లేదు. ఇదిలా ఉంచితే నకిలీ అని ల్యాబ్ రిపోర్టు వచ్చిన తర్వాత కూడా అపరాధ రుసుము మాత్రమే వేసి వదిలేస్తుండడంతో నకిలీ వ్యాపారకేంద్రాల తలుపులు మళ్ళీ తెరుచుకుంటున్నాయి.

పెరుగుతున్న డయేరియా కేసులు

జిల్లావ్యాప్తంగా ఏటా డయేరియా కేసులు పెరుగుతున్నాయి. గత ఐదేళ్లలో ప్రభుత్వ లెక్కల ప్రకారం 7వేలకు పైగా కేసులు నమోదు కాగా, ప్రైవేటు ఆసుపత్రిలో చేరే వారి సంఖ్యకు లెక్కలేదు. అధికశాతం మంది ఉదర సంబంధమైన గ్యాస్‌ట్రబుల్, కడుపునొప్పి, మంట, పేగుపూత వంటి వ్యాధులు బారిన పడుతున్న కేసులే అధికంగా కనిపిస్తున్నాయి. పదేళ్ల పిల్లల నుంచి వృద్ధుల వరకు ఉదర సంబంధమైన వ్యాధులతో బాధపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆహార పదార్థాలను కల్తీ చేసి, అనారోగ్యానికి కారణమవుతున్న అక్రమార్కులను గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేస్తే కొంతమేర అడ్డుకట్ట పడే అవకాశం ఉంది.

అదే ఉత్సాహం!

ముగిసిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం

ముఖ్యమైన ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం

ఇతర చోట్ల కదిలిన కేడర్

వందరోజుల పాలన ఫలితాలపై ఇంటింటి ప్రచారం

ఒంగోలు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం ఉత్సాహంగా సాగి గురువారంతో ముగిసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈనెల 20 నుంచి వారంరోజుల పాటు ప్రభుత్వంలోని కీలక ప్రజాప్రతినిధుల నుంచి గ్రామ, వార్డు స్థాయిలోని టీడీపీ కేడర్, ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేకించి క్షేత్రస్థాయి సిబ్బంది ఉత్సాహంగా ఇందులో పాల్గొన్నారు. వంద రోజుల్లో ప్రభుత్వం ఆయా వర్గాల సంక్షేమం కోసం అమలుచేసిన పెన్షన్ల పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, అన్న క్యాంటీన్లు పునరుద్ధరణ వంటి కీలక అంశాలతోపాటు ప్రజలకు ఉపయోగపడే పలు నిర్ణయాలను తీసుకుంది. వాటన్నింటిని వివరిస్తూ 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టగా జిల్లాలో వారంరోజులపాటు ఉత్సాహంగా సాగింది. రాష్ట్రస్థాయిలో ఈ కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు నాయుడు తొలిరోజు జిల్లాలోని మద్దిరాలపాడు నుంచే ప్రారంభించగా అనంతరం ఆయా నియోజకవర్గాలలో మంత్రి డాక్టర్ స్వామితో పాటు అధికారపార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జీలు నిర్వహించారు. కాగా చివరి రోజైన గురువారం కూడా ఆయా ప్రాంతాల్లో అదే ఉత్సాహంగా కార్యక్రమం సాగింది. చీమకుర్తి మండలం కంభంపాడులో ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ ఆధ్వర్యంలో జరిగిన సభలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొన్నారు. ఒంగోలులోని 30వ డివిజన్‌లో జరిగిన సభలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పాల్గొనగా మార్కాపురంలోని రాజ్యలక్ష్మి కాలనీలో జరిగిన సభలో అక్కడి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొన్నారు. గిద్దలూరు మండలం ముండ్లపాడులో జరిగిన సభలో అక్కడి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొనగా దర్శిలోని క్రిస్టియన్‌పాలెంలో జరిగిన సభలో నియోజకవర్గ ఇన్‌చార్జీ గొట్టిపాటి లక్ష్మి పాల్గొన్నారు. వారంరోజుల పాటు జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించడంతోపాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు కూడా నిర్వహించారు.



కమ్యూనిటీ హాలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్

ఎక్సైజ్ కొత్త టీమ్

- **బాధ్యతలు తీసుకున్న డిప్యూటీ కమిషనర్**
- **నేడు సీఐలకు పోస్టింగ్ నెలాఖరులోపు సిబ్బంది బదిలీలు**

ఒంగోలు(క్రైం) సెప్టెంబరు 26 : ఎక్సైజ్ నూతన పాలసీ రానున్న నేపథ్యంలో ముందుగా బదిలీల ప్రక్రియను పూర్తి చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఎక్సైజ్‌శాఖను విభజించి 70 శాతం మంది సిబ్బందితో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) ఏర్పాటు చేసింది. అదే విధంగా మద్యం దుకాణాలు ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని నిర్వహించింది. నూతన ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత ఎక్సైజ్‌శాఖలో మార్పులు తీసుకువస్తోంది. తొలుత ఎక్సైజ్, ఎస్‌ఈబీలను విలీనం చేసింది. అనంతరం కొత్తపాలసీని తీసుకొచ్చి మద్యం దుకాణాలు తిరిగి ప్రయివేటు వ్యక్తులకు కేటాయించనుంది. ఈ క్రమంలో ప్రకాశం, బాపట్ల జిల్లాల పర్యవేక్షణకు ఒంగోలు కేంద్రం కార్యాలయంగా డిప్యూటీ కమిషనర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విధుల నిర్వహణకు అసిస్టెంట్ కమిషనర్‌ను నియమించింది. దీంతో డిప్యూటీ కమిషనర్‌గా హేమంత్ నాగరాజు, అసిస్టెంట్ కమిషనర్‌గా కె.విజయలు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఖాజామోహిద్దీన్ బుధవారమే బాధ్యతలు స్వీకరించారు. ఇంకా రెగ్యులర్ ఏఈఎస్‌గా పి.ఎర్ర వెంకట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్‌గా ఎ.జనార్దనరావును నియమిస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇంకా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 14 సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల నియామకం శుక్రవారం జరిగే అవకాశం ఉంది. ఎస్సైలు, కింది స్థాయి సిబ్బంది బదిలీలు కూ డా ఈనెలాఖరు లోపు పూర్తి చేయనున్నారు.

వచ్చే నెలలో మద్యం దుకాణాలకు టెండర్లు

వచ్చే నెలలో మద్యం దుకాణాలకు ఆన్‌లైన్ ద్వారా టెండర్లు పిలవనున్నారు. దరఖాస్తు ఫీజు రూ.50 వేలనుంచి రెండు లక్షల వరకు ఉండే అవకాశం ఉంది. నూతన పాలసీ వచ్చిన తరువాత వచ్చే నెలలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి ప్రయివేటు దుకాణాలలో మద్యం విక్రయాలు జరగనున్నాయి. ఇప్పటికే కొన్ని మద్యం బ్రాండ్‌ల ధరలు తగ్గించి విక్రయాలు చేస్తున్నారు. వచ్చే నెలలో అన్నీ మద్యం బ్రాండ్‌లు అందుబాటులో ఉంటాయని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి పెద్దపీట

మంత్రి స్వామి

ఎన్‌హెచ్‌ఎఫ్‌డీసీ లబ్ధిదారులకు రూ.1.46కోట్ల రుణాలు అందజేత



సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి స్వామి, వేదికపై కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 26: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి టీడీపీ కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. గురువారం ఒంగోలు నగరం భాగ్యనగర్‌లోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన బధిరుల సంకేతభాషా దినోత్సవం, జాతీయ దివ్యాంగుల ఆర్థిక అభివృద్ధి సంస్థ ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులకు రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమానికి కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి మంత్రి స్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ఎనలేని కృషి చేస్తుందన్నారు. బధిరుల సంకేత భాషా దినోత్సవం బధిరుల పాఠశాలలో జరుపుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు. వారి భవిష్యత్తు, ఆర్థిక పరిస్థితులు, జీవన ప్రమాణాలు, మెరుగుపడేలా అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్క విభిన్న ప్రతిభావంతులు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. 40 సంవత్సరాల క్రితమే బధిరుల కోసం దూరదర్శన్‌లో ప్రత్యేకంగా వార్తలు ప్రసారం అయ్యేవని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు.

అలాగే విశాఖపట్నంలో రూ.200 కోట్లతో 30 ఎకరాలలో జాతీయ విభిన్న ప్రతిభావంతుల క్రీడా ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. అలాగే పదో తరగతి పాసైన విద్యార్థులు ఇంటర్ చదువుకునేందుకు అవసరమైన జూనియర్ కళాశాల ఏర్పాటుకు తనవంతు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే విభిన్న ప్రతిభావంతులు తమ సమస్యలు చెప్పుకునేందుకు కలెక్టర్, ఎస్పీ స్పందన (గ్రీవెన్స్)లో ప్రతి సోమవారం ఒక అనువాదకుడిని అందుబాటులో ఉంచుతామని మంత్రి తెలిపారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులను అన్ని విధాలుగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

ముందుగా మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా జ్యోతి ప్రజ్వలన చేసి విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషి చేసిన హెలెన్‌కెల్లర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే 50 మంది లబ్ధిదారులకు రూ.1.46కోట్ల రుణ చెక్కులను మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు.

అనుచరులతో వెళ్లిన మాజీమంత్రి

కూటమి పార్టీలతో కలిసి పనిచేస్తా

జగన్ ఏకపక్ష నిర్ణయాలతో ఇబ్బంది పడ్డా

ఒంగోలులో భారీ ర్యాలీ చేసిన వ్యాపారవేత్త కంది

జనసేనలో చేరిన బాలినేని, రవిశంకర్



పవన్ కల్యాణ్‌తో బాలినేని శ్రీనివాసరెడ్డి, కంది రవిశంకర్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు బాలినేని శ్రీనివాసరెడ్డి, వ్యాపారవేత్త కంది రవిశంకర్ గురువారం వేర్వేరుగా జనసేన పార్టీలో చేరారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కండువాలు కప్పి వారిని పార్టీలో వారిని చేర్చుకున్నారు. పార్టీ ఆదేశం మేరకు ఒక్కొక్కరే జనసేనలో చేరినప్పటికీ తదుపరి వారి అనుచరులను కూడా చేర్చుకునే కార్యక్రమాలు చేపట్టనున్నారు. వైసీపీకి గుడ్‌బై చెప్పిన బాలినేని భారీ వాహనాలలో అనుచరులు వెంటరాగా మంగళగిరిలోని పార్టీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. కంది రవిశంకర్ ఒంగోలులో అనుచరులతో ర్యాలీ నిర్వహించి, ఆ తర్వాత కుటుంబసభ్యులతో మాత్రమే జనసేన కార్యాలయానికి వెళ్లారు. అక్కడ జనసేన నాయకత్వం నిర్ణయించిన మేరకు బాలినేనితోపాటు మరో ఇద్దరు, ముగ్గురు నాయకులతో వెళ్లారు. పవన్ కల్యాణ్ తొలుత బాలినేనిని పార్టీలోకి చేర్చుకుని ఆలింగనం చేసుకున్నారు. ఆ తర్వాత గొర్రెపాటి శ్రీనివాసరావుతోపాటు కార్పొరేటర్ భర్త తిరుమలరావును బాలినేని పవన్ కల్యాణ్‌కు పరిచయం చేయగా వారు కూడా పార్టీలో చేరారు. వ్యాపారవేత్త రవిశంకర్, తన వియ్యంకుడు పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారు రోశయ్యతో కలిసి పార్టీలో చేరారు. ఆతర్వాత రవిశంకర్ తన ఇద్దరు కుమారులు విష్ణుమోహన్, సాయినాథ్‌లను పవన్ కల్యాణ్‌కు పరిచయం చేశారు.

బాలినేని వెంట వైసీపీ శ్రేణులు

బాలినేని వెంట ఒంగోలు నియోజకవర్గానికి చెందిన వైసీపీ శ్రేణులు పెద్దసంఖ్యలో ర్యాలీగా వెళ్లారు. ఇప్పటికే వైసీపీలో ఉన్న సుమారు 10మందికిపైగా కార్పొరేటర్లు, వివిధ హోదాల్లో ఉన్న పలువురు నాయకులు, బాలినేని అనుచరులు ఆయన వెంట వెళ్లిన వారిలో కనిపించారు.

కూటమి పార్టీలతో కలిసి పనిచేస్తా

పార్టీలో చేరిన అనంతరం బాలినేని మీడియాతో మాట్లాడుతూ తన చేరిక ద్వారా కూటమి పార్టీలో విభేదాలు వస్తాయని జరిగే ప్రచారంలో వాస్తవం లేదని పేర్కొన్నారు. కూటమి పార్టీ నేతలను కలుపుకొని ముందుకు పోతానని, తనపై జరుగుతున్న కొన్ని అసత్యప్రచారాలు, చిన్న వివాదాలు సర్దుకుంటాయని చెప్పారు. ఇక నుంచి అధినేత పవన్ ఏది చెబితే అది చేస్తా. ప్రకాశం జిల్లాలో జనసేనను ప్రజల్లోకి తీసుకెళ్తా, టీడీపీ, బీజేపీ నేతలతో కలిసి పనిచేస్తానని ప్రకటించారు. వైసీపీ నేత జగన్ మోహన్‌రెడ్డికి తన లాంటి సీనియర్ నేతలంటే లెక్కలేదని వ్యాఖ్యానించారు. ఆయన తీసుకున్న ఏకపక్ష నిర్ణయాలు మనసుకు కష్టం కలిగించాయన్నారు. గతంలో జగన్ మంత్రివర్గ విస్తరణలో అందరినీ మారుస్తానని చెప్పి తనలాంటి కొందరిని మార్చి అవమానించారు. ఇక నుంచి తమ పార్టీ జనసేన అభివృద్ధి కోసం తన వంతు కృషిచేస్తానని తెలిపారు.

ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి......

వ్యాపారవేత్త రవిశంకర్ మాట్లాడుతూ ప్రజాసేవ చేయాలన్న దృఢమైన లక్ష్యంతోటే ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చినట్లు చెప్పారు. పార్టీ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ కూటమి పార్టీలతో కలిసి ప్రభుత్వ సేవా కార్యక్రమాలలో భాగస్వామిని అవుతానని చెప్పారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఇతర నేతలతో కలిసి పనిచేస్తానని పేర్కొన్నారు.


సీఎం సహాయనిధి మంజూరు పత్రాలు అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

ఐదుగురికి రూ.25 లక్షలు మంజూరు

● సీఎం సహాయనిధి నుంచి ఎల్‌ఓసీలు ఇచ్చిన మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, సెప్టెంబరు 26 : అద్దంకి నియోజకవర్గంలో ఐదుగురికి అత్యవసర చికిత్సలు అవసరం కావటంతో ముందస్తు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.25,84,400కు ఎల్‌ఓసీలను గురువారం చిలకలూరిపేటలో మంత్రి రవికుమార్ అందజేశారు. అద్దంకి మండలం కుంకుపాడుకు చెందిన అనపర్తి మరిదంకు కాలేయ మార్పిడి చేయాల్సిరావటంతో రూ.15 లక్షలు మంజూరు చేయించారు. పంగులూరు మండలం నార్నెవారిపాలేనికి చెందిన రావిపాటి వీరాంజనేయులుకు, బల్లికురవకు చెందిన పెంట్యాల సుబ్బారావుకు మోకాలి మార్పిడికి ఒక్కొక్కరికి రూ.2,17,200 చొప్పున, సంతమాగులూరు మండలం చవిటిపాలేనికి చెందిన రావూరి అరవింద్‌కు డిస్క్ ఆపరేషన్‌కు రూ.2,50,000, తంగేడుమల్లికి చెందిన మర్లపాటి వీరాంజనేయులుకు అల్సర్ వ్యాధికి రూ.4 లక్షలు మంజూరు కాగా గురువారం మంత్రి రవికుమార్ వాటి పత్రాలు అందజేశారు.


'ఇది మంచి ప్రభుత్వం' ముగింపు సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

సంక్షోభంలోనూ సంక్షేమానికి పెద్దపీట

● ఎమ్మెల్యే కొండయ్య యాదవ్

చీరాల, సెప్టెంబరు 26 : గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసిందని, అయినా విజనరీ లీడర్ సీఎం చంద్రబాబు సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య యాదవ్ అన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' ముగింపు సందర్భంగా గురువారం బెస్తపాలెంలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పనితీరుకు దర్పణం పట్టే కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ 100 రోజుల పాలన సీఎం చంద్రబాబు దార్శనికతకు నిదర్శనమన్నారు. వచ్చే నెలలో అర్హులైన వారికి నూతన పెన్షన్లు మంజూరు చేసే విధంగా చర్యలు చేపడతామన్నారు. గ్రంధి ఆదిత్య.. అన్న క్యాంటీన్ నిర్వహణకు తనవంతు విరాళంగా రూ.10వేలు ఎమ్మెల్యే కొండయ్య అందజేశారు.


కారంచేడులో వరి నాట్లు వేస్తున్న కూలీలు

ఊపందుకున్న వరినాట్లు

కారంచేడు (పర్చూరు) : కొమ్మమూరు కాలువకు జలకళ సంతరించుకోవటంతో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. నిన్నా మొన్నటి వరకు కొమ్మమూరు కాలువలో సక్రమంగా నీరులేకపోవటం, వరినారు మళ్ల ఎండుముఖం పట్టడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. దీనికితోడు ఇటీవల సంభవించిన వరదల కారణంగా కొమ్మమూరు కాలువకు గండ్లు పడటంతో నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడింది. ఈ తరుణంలో స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక చొరవతో సమస్యను నీటి పారుదల శాఖా మంత్రి నిమ్మల రామారావు దృష్టికి తీసుకుపోయారు. కొమ్మమూరు కాలువకు నీటిని విడుదల చేయించారు. దీంతో మాగాణి సాగు ఊపందుకుంది. ప్రస్తుతం అన్నదాతలు వరి నాట్ల పనిలో నిమగ్నమయ్యారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి సాగు విస్తీర్ణం పెరుగుతుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

వంద రోజుల పాలనపై కరపత్రాల పంపిణీ

బల్లికురవ : మండలంలోని చెన్నుపల్లిలో గురువారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి తిరిగి వంద రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలపై ప్రజలకు కరపత్రాల ద్వారా అవగాహన కల్పించారు.

● యద్దనపూడి, (మార్టూరు) : యద్దనపూడి మండలం గన్నవరంలో గురువారం 'ఇది మంచి ప్రభుత్వం'లో భాగంగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నల్లపనేని రంగయ్యచౌదరి ఆధ్వర్యంలో ఇంటింటా తిరుగుతూ కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో అభివృద్ధి పనులపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో కృష్ణ కుమారి విచ్చేశారు.


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రాంబాబు

అసంపూర్తి గృహాలను పూర్తి చేయాలి

బల్లికురవ : ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో అసంపూర్తి పనులతో నిలిచి ఉన్న గృహాలను వెంటనే పూర్తి చేస్తే వారికి రావాల్సిన బిల్లులు కూడా వెంటనే మంజూరు చేయిస్తామని ఎంపీడీవో రాంబాబు తెలిపారు. బల్లికురవ, గుంటుపల్లి గ్రామ సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణ లబ్ధిదారులతో గురువారం 'మన ఇల్లు-మన గౌరవం' కార్యక్రమంలో భాగంగా సమావేశం జరిగింది. వంద రోజుల్లో గ్రామాల్లో పెండింగ్ గృహాలు పూర్తి చేసేలా ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు.

వీర వనిత చాకలి ఐలమ్మ

అద్దంకిటౌన్ : మంచి పోరాట పటిమ కలిగిన వీరవనిత చాకలి ఐలమ్మ అని, నేటి తరానికి ఆమె స్ఫూర్తిదాయకమని మాజీ సర్పంచ్ చెన్నుపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం చిట్యాల ఐలమ్మ (చాకలి ఐలమ్మ) 129వ జయంతి సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. భూ పోరాటాల ద్వారా ఆమె 10 వేల ఎకరాలు భూమిని భూస్వాముల నుంచి పేదలకు పంచేలా చేసిందన్నారు.

పాఠశాలలో భాషా వారోత్సవాలు

అద్దంకిటౌన్ : ప్రముఖ తెలుగు కవులు గురజాడ అప్పారావు, గుర్రం జాషువా జయంతులను పురస్కరించుకుని పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం భాషా వారోత్సవాలు నిర్వహించామని హెచ్ఎం కోట అంజమ్మ తెలిపారు. విద్యార్థులతో గురజాడ, జాషువా పద్యాలు పాడించారు.


విద్యావనరుల కేంద్రంలో చర్చా పోటీలో పాల్గొన్న విద్యార్థినులు

ప్రతిభ పోటీల్లో బాలికల సత్తా

పంగులూరు : వికసిత భారత్‌లో భాగంగా 'స్వర్ణాంధ్ర - 2047' అంశంపై గురువారం మండల స్థాయిలో పాఠశాలల బాల బాలికలకు నిర్వహించిన వివిధ పోటీల్లో బాలికలు సత్తా చాటారు. 6 నుంచి 10వ తరగతి వరకు చదివే బాల బాలికలకు నిర్వహించిన వ్యాసరచనలో బూదవాడ పాఠశాల విద్యార్థిని షేక్ సమీర, వక్తృత్వంలో చందలూరు పాఠశాల విద్యార్థిని సిహెచ్.గాయత్రి, చర్చా పోటీలో ఎస్.దీపికారాణి ప్రథమ స్థానంలో నిలిచారు. వీరు ఈ నెల 28న జిల్లాస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని ఎంఈవో నాగభూషణం తెలిపారు.


పార్వతమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న విద్యార్థినులు

మాగుంట పార్వతమ్మకు నివాళి

మార్టూరు : మాజీ ఎంపీ మాగుంట పార్వతమ్మ మృతికి గురువారం మండలంలోని వలపర్ల ఎంఎస్ఆర్ జూనియర్ కాలేజీలో సంతాప సభ నిర్వహించారు. ఆమె చిత్రపటానికి మాజీ సర్పంచ్ కొల్లిపర పూర్ణచంద్రరావు, నేతాజీ విద్యాసంస్థల డైరెక్టర్ సయ్యద్ కరిముల్లా, లెక్చరర్ శ్రీనివాసరెడ్డి, పలువురు లెక్చరర్లు, పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

నియోజకవర్గస్థాయి ఆటల పోటీలు

వేటపాలెం (చీరాల) : పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు నియోజకవర్గస్థాయి ఆటలు పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను డిప్యూటీ డీఈఓ అబ్బరాజు శ్రీనివాసరావు ప్రారంభించారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మార్టూరు : గాంధీ కలలు కన్న గ్రామాల పరిశుభ్రతే 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యమని పంచాయతీ కార్యదర్శి మురళి అన్నారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని నాగరాజుపల్లిలో ప్రతి వీధీ శుభ్రంగా ఉండాలని, గ్రామంలో ఎక్కడా చెత్త కనబడకూడదని, అందరూ ఆరోగ్యంగా జీవించాలనే లక్ష్యంతో కార్యక్రమం నిర్వహిస్తున్నామని మురళి అన్నారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు.

బదిలీ అయిన ఉద్యోగులకు సత్కారం

మార్టూరు : మార్టూరు తాలూకా ఏపీఎన్‌జీవో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సబ్ రిజిస్ట్రార్ మేకల చినరామకోటయ్య కందుకూరుకు, సీనియర్ అసిస్టెంట్ పవన్ ఒంగోలుకు బదిలీపై వెళుతున్న సందర్భంగా గురువారం అసోసియేషన్ నేతలు వారిద్దరిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల గోపి, సుభాని పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

అద్దంకి : రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. గుర్రంవారిపాలేనికి చెందిన తన్నీరు సైదులు (29) ఆరోగ్యం సరిగా లేకపోవటంతో ఈనెల 24న అద్దంకి వచ్చి మందులు తీసుకొని మోటార్‌సైకిల్‌పై తిరిగి వెళ్తుండగా గర్రంవారిపాలెం సమీపంలో ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఒంగోలు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందాడు.

కరెంట్‌షాక్‌తో మరో కార్మికుడు మృతి

● వారంలోనే ఇది రెండో మరణం

చీరాలటౌన్ : వారంలోనే చీరాల పరిధిలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రెండు కాంట్రాక్ట్ ఎలక్ట్రిషియన్‌ల కుటుంబాలు వీధినపడ్డాయి. ఈనెల 19న చీరాల రామకృష్ణాపురంలో జరిగిన ఘటనలో కారంచేడు మండలం దగ్గుబాడుకు చెందిన గానుగపాటి సుమంత్ (20) మృతిచెందగా, తాజాగా బాపట్ల మండలం ముత్తాయిపాలేనికి చెందిన తాతా వెంకటస్వామి (32) కన్నుమూశారు. బుధవారం కొత్తపేటలో ట్రాన్స్‌ఫార్మర్ పునరుద్ధరించారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఒకవైపు లైన్ విద్యుత్ సప్లై ఆగిపోవడంతో పరిశీలించేందుకు వెంకటస్వామి కరెంటు పోల్ ఎక్కాడు. తీగలకు కరెంటు సప్లై వచ్చి షాక్‌తో కిందపడ్డాడు. ఆయన్ను ఆస్పత్రికి తరలించగా బుధవారం అర్ధరాత్రి పరిస్థితి విషమించి చనిపోయాడు. మృతిచెందిన వెంకటస్వామికు భార్య పావని, కుమారుడు ఉన్నారు. రెండు మరణాల వెనుక సంబంధిత విద్యుత్ అధికారుల నిర్లక్ష్య వైఖరే కారణమని తెలుస్తోంది. కనీసం పనుల సమయంలో వారికి సరైన జాగ్రత్తలు లేక ప్రమాదం సంభవించకుండా ఉండేలా పరికరాలు కూడా అందించడం లేదు. ప్రతిఫలంగా రెండు కుటుంబాల రోదన మాత్రమే మిగిలి ఉంది.


ఆస్పత్రిలో మృతిచెందిన తాతా వెంకటస్వామి


విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రైతులతో మాట్లాడుతున్న డీఈఈ మస్తాన్‌రావు

రైతులకు నాణ్యమైన వ్యవసాయ విద్యుత్

బల్లికురవ, సెప్టెంబరు 26 : రైతులకు పంటల సాగులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యవసాయ విద్యుత్‌ను అందిస్తామని అద్దంకి డివిజన్ విద్యుత్ శాఖ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. గురువారం బల్లికురవ సబ్‌స్టేషన్‌లో పలు గ్రామాల రైతులతో విద్యుత్ శాఖ అధికారులు సమావేశం నిర్వహించారు. డీఈఈ మాట్లాడుతూ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు మండలంలో జూన్ నుంచి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నామన్నారు. మండలంలో 131 ఎస్టిమేట్లకు 490 మంది రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేశామన్నారు. 250 మంది రైతులు వ్యవసాయ విద్యుత్ కోసం దరఖాస్తులు చేసి ఉన్నారని, రెండు రోజుల్లోనే 200 మంది రైతులకు కనెక్షన్లు మంజూరు చేశామని చెప్పారు. ఆర్‌డీఎస్ఎస్‌లో అన్ని గ్రామాలకు త్రిఫేస్ విద్యుత్ అందించేలా ప్రత్యేక లైన్లకు నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో మార్టూరు డీఈఈ ఎం.సురేంద్రబాబు, ఏఈ శ్రీనివాసరావు, మండల టీడీపీ నాయకులు మలినేని గోవిందరావు పాల్గొన్నారు.

గవినివారిపాలెంలో యూబీ శాఖ ఏర్పాటు చేయాలి

● రీజనల్ మేనేజర్‌కు ఎమ్మెల్యే కొండయ్య విజ్ఞప్తి


యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ రవీందర్‌కు మొక్కను అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల : మండల పరిధిలోని గవినివారిపాలెంలో యూనియన్ బ్యాంక్ శాఖను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కొండయ్య, బ్యాంక్ రీజనల్ మేనేజర్ రవీందర్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం బ్యాంక్ రీజనల్ మేనేజర్ రవీందర్‌ను ఎమ్మెల్యే కొండయ్య కలిశారు. మార్యాద పూర్వకంగా మొక్కను అందజేశారు. అనంతరం గవినివారిపాలెం పంచాయతీ జనాభా, ఆర్థిక పరిపుష్టి, బ్యాంక్ లావాదేవీల అవశ్యకత తదితర అంశాలపై చర్చించారు. బ్యాంక్ శాఖ ఏర్పాటుకు రీజనల్ మేనేజర్ రవీందర్ సానుకూలంగా స్పందించి శాఖ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

సమాజసేవలో 'మానవతా' సంస్థ

ఇంకొల్లు : సమాజ సేవ లక్ష్యంగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ముందుకు సాగుతుందని ఆ సంస్థ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పూసపాడుకు చెందిన పేద ఇంజనీరింగ్ విద్యార్థిని వి.అఖిలకు శ్రీనివాసరావు మిత్రులు యర్లగడ్డ రామకృష్ణ, నాగెండ్ల రామచంద్రరావు, లంకా కృష్ణ, వడ్లమూడి శివయ్య సహకారంతో రూ.60వేల విలువ కలిగిన ల్యాప్‌ట్యాప్‌ను గురువారం అందజేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా మంచినీటి ట్యాంకర్లను ఏర్పాటు చేసి తాగునీటిని అందించడం, ఉచిత మెడికల్ క్యాంపులు, విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించడం వంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు.

అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు

అద్దంకిటౌన్ : గ్రామాల్లోని అన్ని రైతుసేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచామని, రైతులు సద్వినియోగ పరుచుకోవాలని ఏడీఏ కె.ధనరాజ్ అన్నారు. గురువారం మండలంలోని శంఖవరప్పాడులో 'పోలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించారు.

●బల్లికురవ : మండలంలోని కొప్పెరపాలెంలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది'లో ఏవో కుమారి రైతులతో కలిసి వరి, పత్తి పంటలను పరిశీలించి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. పత్తి పంటలో రసం పీల్చే పురుగు ఉందని రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ సిబ్బంది సలహాలతో పురుగు మందులను వాడాలన్నారు.

సేంద్రియసాగుతో అధిక దిగుబడులు

● వేటపాలెం (చీరాల) :సేంద్రియ వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను పాటించాలని, తద్వారా అత్యధిక దిగుబడి పొందవచ్చని ఇంటర్నేషనల్ మార్కెటింగ్ ఆర్గనైజర్ డాక్టర్ శరవన్ చెప్పారు. గురువారం పందిళ్లపల్లి పరిధిలో గోవన ఆదియ్య, సుధాకర్ చేపట్టిన సేంద్రీయ వ్యవసాయ క్షేత్రాలను గుంటూరు రైతు సాధికార సంస్థ ప్రతినిధులతో కలిసి ఇంటర్నేషనల్ మార్కెటింగ్ ఆర్గనైజర్ శరవన్ బృందం పరిశీలించింది.

సెయింట్‌ఆన్స్ కళాశాలలో ముగిసిన వర్క్‌షాప్

చీరాల : సెయింట్‌ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఐఓటీ (ఇంటర్‌నెట్ ఆఫ్ థింక్స్), ఎంబెడెడ్ సిస్టమ్స్‌కు సంబంధించి మూడు రోజులుగా జరుగుతున్న వర్క్‌షాప్ గురువారంతో ముగిసింది. వర్క్‌షాప్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ప్రశంసాపత్రాలు అందజేశారు. కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థులు వర్క్‌షాప్‌లో నేర్చుకున్న మెలకువలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తక్షణమే అసంపూర్తి గృహాలను పూర్తి చేయాలి

బల్లికురవ : ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో అసంపూర్తి పనులతో నిలిచి ఉన్న గృహాలను వెంటనే పూర్తి చేస్తే వారికి రావాల్సిన బిల్లులు కూడా మంజురు చేయిస్తామని ఎంపీడీవో రాంబాబు తెలిపారు. బల్లికురవ, గుంటుపల్లి గ్రామ సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణ లబ్ధిదారులతో గురువారం 'మన ఇల్లు-మన గౌరవం' కార్యక్రమంలో సమావేశం జరిగింది.

శ్రీవారి లడ్డూ కల్తీ అమానుషం


భావనారాయణస్వామి దేవస్థానంలో పూజలు చేస్తున్న జనసేన నాయకులు

చినగంజాం : తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ చేయడం అమానుష చర్యని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదపూడి విజయ్‌కుమార్ అన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసం తిరుమల వెంకటేశ్వరస్వామికి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అపచారానికి పరిహారంగా ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు మద్దతుగా గురువారం మండల జనసేన నాయకులు పూజలు నిర్వహించారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సందు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక భూ సమేత భావనారాయణస్వామి దేవస్థానంలో నాయకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు.

జగన్ ప్రచార యావతో రాష్ట్రం అధోగతి


పెదగంజాంలో సిమెంట్ రోడ్డు భూమి పూజలో పాల్గొన్న అధికారులు, నాయకులు

చినగంజాం : గత వైసీపీ ప్రభుత్వం ప్రచార యావలో పడి రాష్ట్రాన్ని అధోగతి పట్టించిందని టీడీపీ తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆసోది సుబ్బారెడ్డి, మండల అధ్యక్షులు పొద వీరయ్య ఆరోపించారు. మండలంలోని పెదగంజాం, నీలాయపాలెం గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి వంద రోజుల పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెదగంజాం, నీలాయపాలెం గ్రామ సర్పంచ్‌లు నక్కల కృష్ణ, తూమాటి శ్రీనివాసరావు, ఏపీవో జి.లక్ష్మీదేవి, గ్రామ కార్యదర్శి లక్ష్మీతులసీ పాల్గొన్నారు.

రహదారులను కమ్మేసిన చిల్లచెట్లు

పర్చూరు : మండలంలోని అధ్వానంగా మారిన రహదారులు.. రోడ్లను కమ్మేసిన చిల్లచెట్లు, ముళ్లపొదలతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్ల మార్జిన్‌లు చిల్లచెట్లతో నిండిపోయాయి. ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించలేక వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలతో రద్దీగా ఉండే పర్చూరు - ఇంకొల్లు (పాత మద్రాసు) రోడ్డు పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. స్థానిక వ్యవసాయ మార్కెట్ ప్రాంగణం సమీపంలోని రోడ్డు మార్జిన్‌లు ముళ్లపొదలతో అడవిని తలపిస్తున్నాయి. రాత్రి సమయంలో ఈ మార్గంలో వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

హమాలీల కూలి రేట్లు పెంచాలి

చీరాల : సివిల్ సప్లైస్ గోదాముల్లో పనిచేసే హమాలీలకు వెంటనే కూలి రేట్లు పెంచాలని హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పైడయ్య డిమాండ్ చేశారు. తమకు కూలి రేట్లు పెంచాలని కోరుతూ గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ గోపికృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్, సీపీఐ సీనియర్ నాయకుడు మేడా వెంకట్రావు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు


అన్నంబొట్లవారిపాలెం (పర్చూరు) : పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3900 నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై మాల్యాద్రి తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాధ్యతల స్వీకరణ

అద్దంకి : అద్దంకి మున్సిపల్ కమిషనర్‌గా డి.రవీంద్ర గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలు కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేసి ఇటీవల అద్దంకి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయి బాధ్యతలు స్వీకరించారు.

జొన్నతాళిలో సీసీరోడ్డు పనులు ప్రారంభం

మార్టూరు : మండలంలోని జొన్నతాళి గ్రామంలో బీసీ కాలనీలో రూ.8 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ఉపాధి హామీ పనులు కింద గ్రామానికి రూ.30 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఈ పనులు మొదలుపెట్టారు.



రమ్మని.. రావొద్దనీ..!

ఎన్నో సుందర వనాలు.. కానీ అందవిహీనాలు | జిల్లాలో పడకేసిన పర్యాటక అభివృద్ధి | కనీసం గుక్కెడు మంచినీరూ కరువే! | కార్యరూపం దాల్చని ప్రతిపాదనలెన్నో! | నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

ప్రపంచాన్ని ఒకచోట చేర్చే సామర్థ్యం ఒక్క పర్యాటక ప్రాంతానికే ఉంది. ప్రస్తుత పరుగు ప్రపంచంలో ఎవరికీ క్షణం తీరిక ఉండటం లేదు. ఉద్యోగం, వ్యాపారం ఇతర పనుల్లో ఎవరికివారు బిజీబిజీగా ఉంటున్నారు. అలాంటి వారిలో చాలామంది వారాంతపు సెలవులు, పండుగ రోజుల్లో ఇంటిల్లిపాదితో గడిపేందుకే మక్కువ చూపుతున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాలకు, పర్యాటక ప్రాంతాలకు వెళుతున్నారు. అయితే, జిల్లాలో పేరెన్నికగల పర్యాటక ప్రాంతాలు ఉన్నా అక్కడ కనీస వసతులు ఉండటం లేదు. గొంతు తడుపుకుందామన్నా మంచినీరు దొరకని పరిస్థితి నెలకొంది. పర్యాటకుల కోసం నిర్మించిన భవనాలు కూడా శిథిలస్థితికి చేరుకున్నాయి. ఈ పరిస్థితుల్లో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం ఎప్పటికప్పుడు నివేదికలు సిద్ధమవుతున్నా అవి కాగితాలకే పరిమితం అవుతున్నాయి. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ముఖ్యమైన పర్యాటక ప్రాంతాల స్థితిగతులపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం...



ఉదయగిరి దుర్గం



నెల్లూరు (సాంస్కృతికం)/ ముత్తుకూరు : జిల్లాలో పర్యాటక అభివృద్ధి పడకేసింది. రోజులు.. నెలలు.. సంవత్సరాలు గడుస్తున్నా పాలకులు ఇచ్చిన హామీలు నెరవేరడం లేదు. ఎన్నికల హామీలకు వేదికగా మారుతున్న తీర ప్రాంత పర్యాటక అభి వృద్ధి అమలులో వాస్తవ రూపం దాల్చడంలేదు. వాణిజ్య అవసరాలకు తగ్గట్టు వసతులు కల్పించి అభివృద్ధి చేయడంపై ప్రభుత్వాలు చూపిస్తున్న ఆసక్తి పర్యాటక అభివృద్ధి విషయంలో సన్నగిల్లుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా బ్రేకులు పడ్డాయి. ప్రధానంగా నెల్లూరులో పర్యాటక కేంద్రాలుగా బారాషహీద్ దర్గా, బోట్ క్లబ్, ఇరుకళల పరమేశ్వరి, తల్పగిరి రంగనాథస్వామి ఆల యాలతోపాటు పెన్నా వంతెన, నరసింహుల కొండలు ఉన్నాయి. నరసింహకొండ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.60 కోట్లు మం జూరు చేయగా, ఇరుకళల పరమేశ్వరి ఆలయ అభివృద్ధికి తిరుమల శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ.2.5 కోట్లు మంజూరయ్యాయి. కానీ ఇప్పటి వరకు అభివృద్ధి పునాది రాయి పడలేదు. ఇక రాపూరు మండలంలో ని పెంచలకోన క్షేత్రం అభివృద్ధికి రూపొందించిన మాస్టర్‌ప్లాన్ ఇప్ప టికీ అమలుకు నోచుకోలేదు. ఇక్కడ నృసింహస్వామి ఆలయంతోపా టు ఎత్తయిన కొండలు, జలపాతాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటాయి. ఇలాంటి ప్రాంతంపై పాలకులు శీతకన్ను ప్రదర్శిస్తున్నారు. బుచ్చిరెడ్డిపాళెంలో జొన్నవాడ కామాక్షితాయి, వలేటివారిపాళెంలో మాలకొండ లక్ష్మీనృసింహ స్వామి, దుత్తలూరులో వెంగమాంబ తదితర ముఖ్యమైన క్షేత్రాలతోపాటు కసుమూరు, ఏఎస్‌పేటలలో ప్రసిద్ధ దర్గాలు ఉన్నాయి. ఉత్సవాల సమయంలోనే కాస్తోకూస్తో వసతులు కల్పిస్తు న్న అధికారులు మిగిలిన రోజుల్లో గాలికి వదిలేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇక నగరంలోని బారాషహీద్ గంధ మహోత్సవం, రొట్టెల పండుగకు లక్షలాది మంది భక్తజనం తరలివస్తుంది. ఇప్పటికే ఆ దర్గాలో దాదాపు రూ.30కోట్లతో అభివృద్ధి చేశారు. మరో రూ.5కోట్లతో ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



జలాశయం దిగువన అలంకారప్రాయంగా మురగుదొడ్లు

● కళావిహీనంగా 'సోమశిల'

జిల్లా ప్రధాన నీటివనరు సోమశిల జలాశయం అందవిహీనంగా మారుతోంది. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న సమయంలో రూ.2.5 కోట్లతో దేవదాయ, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పర్ణశాలలు, డార్మెంటరీ, ఆడిటోరియం, మురుగుదొడ్లు, నీటివసతి కల్పించారు. అయితే, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆ భవనాలు నేడు శిథిలావస్థకు చేరుకున్నాయి. కనీసం పర్యాటకులకు మంచినీరు, మురుగుదొడ్లు కరువయ్యాయి. ఇక జలాశయం ఎర్త్‌డ్యాంపై గతంలో పచ్చిక, వివిధ రకాల అరుదైన మొక్కలు, పూలకుండీలలో మొక్కలతో సుందరంగా దర్శనమిచ్చేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. మొక్కలు ఎండిపోయి కుండీలన్నీ అందవిహీనంగా మారియ. అలాగే రెండేళ్ల క్రితం వరద పోటెత్తడంతో సోమేశ్వరాలయ గోపురం కుప్పకూలింది. వెంటనే ఆలయాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

- అనంతసాగరం

ప్రతిపాదనల్లోనే 'దుర్గం' అభివృద్ధి

అలనాటి శిల్పకళా నైపుణ్య తీపి గుర్తులు పంచే ఆలయాల ఆనవాళ్లు ఉదయగిరి సొంతం. ప్రకృతి శోభ కలిగిన ఉదయగిరి దుర్గంపై దట్టమైన అడువులు, కొండలు, జలపాతాలు, సెలయేళ్లు చూడముచ్చటగా ఉంటాయి. ఎందరో రాజులు, నవాబులు, బ్రిటీష పరిపాలనకు ఘన చరిత్ర కలిగిన ఉదయగిరి దుర్గం పర్యాటక కేంద్రంగా అభివృద్ధికి నోచుకోకపోవడం దారుణం. ప్రతిసారి ఎన్నికల సమయంలో నేతల మాటలు నీటి మూటలుగానే మిగులుతున్నాయి. 1989లో తొలివిడత రూ.2.16 కోట్లు మంజూరవగా, మొదటి దశలో 40 లక్షలతో కొన్ని పనులు చేసి వదిలేశారు. 2010లో ఉదయగిరి ఆనకట్ట సమీపంలో రూ.10 లక్షలతో అతిథిగృహం, హోటళ్లకు నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరాయి. అప్పటి కలెక్టర్ చక్రధర్‌బాబు, ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలు అధికారులతో కలిసి దుర్గాన్ని పరిశీలించారు. దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు రూ.100 కోట్లతో ప్రతిపాదనలు తయారుచేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపారు. ఆ ప్రతిపాదనలు సైతం కాగితాలకే పరిమితమయ్యాయి. పర్యాటక కేంద్రంగా దుర్గాన్ని అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందడంతోపాటు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

- ఉదయగిరి రూరల్



అల్లూరు : నిరుపయోగంగా ఇస్కపల్లి ప్రభుత్వ రిసార్టులు

తల్లడిల్లుతున్న తీరం

సువిశాల తీర ప్రాంతం జిల్లా సొంతం. ఇందుకూరుపేట మండలం మైపాడు, టీపీగూడూరు మండలం కొత్తకోడూరు, ముత్తుకూరు మండలం కృష్ణపట్నం, కావలి రూరల్ మండలం తుమ్మలపెంట, గుడ్లూరు మండలంలో కర్లపాళెం, ఉలవపాడు మండలంలో రామాయపట్నం ప్రాంతాల్లో బీచ్‌లు ఉన్నాయి. కృష్ణపట్నం వద్ద ఉన్న లైట్‌హౌస్‌తోపాటు ఇస్కపల్లి, రామాయపట్నం వద్ద ఉన్న లైట్‌హౌస్‌ల కమనీయ ప్రకృతి దృశ్యాలను తిలకించవచ్చు. ఈ ప్రాంతాల్లో అభివృద్ధి కోసం అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి పలుమార్లు ప్రతిపాదనలు పంపించారు. కానీ అమలులో చేతులెత్తేశారు. ఎలాంటి వసతులు లేకున్నా సెలవు రోజుల్లో పర్యాటకు ల తాకిడి అధికంగా ఉంటుంది. బీచ్‌లను అభివృద్ధి చేస్తే పర్యాటక ఆదాయంతోపాటు స్థానికులకు ఉపాధి లభ్యమవుతుంది. అలాగే తీర ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందిన పురాతన ఆలయాలు ఉన్నా సౌకర్యాలు మాత్రం అంతంత మాత్రంగానే ఉంటాయి.

- ● తుమ్మలపెంటలో బీచ్ అభివృద్ధి పనులు గత ప్రభుత్వ హయాంలో నిలిపివేశారు.
- ● నిధులు మంజూరు కాకపోవడంతో అల్లూరు మండలం ఇసుకపల్లి తీరంలో రిసార్ట్స్ నిర్మాణాలు నిరుపయోగంగా మారాయి. సందర్శకుల బెంచీల చుట్టూ ముళ్ల చెట్లు పెరిగిపోయాయి.
- ● మైపాడు బీచ్ రహదారి నిర్మాణం శిలాఫలకాలకే అంకితమైంది.
- ● కృష్ణపట్నంలో సుందరమైన బీచ్ అభివృద్ధి ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి.
- ● కొత్తకోడూరు రోడ్డు, బీచ్ అభివృద్ధి సంగతే మరిచిపోయారు.

- ముత్తుకూరు



అమ్మవారిని దర్శించుకోవడానికి పోటెత్తిన భక్తులు

పోలేరమ్మ జాతరకు పోటెత్తిన భక్తజనం

వెంకటగిరిలో ఎటుచూసినా జనసందోహమే
పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

వెంకటగిరి/ వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 26: వెంకటగిరి పోలేరమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. జాతరలో భాగంగా గురువారం తెల్లవారుజామున అమ్మవారు భక్తుల దర్శనార్థం దేవస్థానం వద్ద వేపమండలతో పందిరి వేసి కొలువు తీర్చారు. అమ్మవారిని దర్శించు కొనేందుకు భక్తులు బారులు తీరారు. అమ్మవారికి వేయికళ్ల దుత్తల్లో దీపాలు వెలిగించి నెత్తిన పెట్టుకు వచ్చి నాలుగు కూడల్లో బద్దలు కొట్టారు. మడిచీరలపై నడుస్తూ కొందరు.. నవధాన్య మొలకలను అమ్మవారికి సమర్పించుకొని ఇంకొందరు మొక్కులు చెల్లించుకున్నారు. నగరి ఆభరణాలైన బంగారు శూలం, సరుడును రాజా అనుచరుల ఆధ్వర్యంలో అమ్మవారికి అలంకరించి తీసుకెళ్లారు. దీంతో వెట్టివారు కుండలో వెలిగించిన గండర దీపాన్ని అమ్మవారికి చూపించి దీపం ఆరకుండా ఊరి పొలిమేరల్లోకి తీసుకుపోయి ఉంచారు. అక్కడ అమ్మవారి బలి దున్నపోతును తెగనరికి ఆ రక్తంతో పొలికుండల్లోని అన్నంతో కలిపి ఊరి పొలిమేరల్లో పొలి.. పొలి అని అరుస్తూ చల్లారు. దున్నపోతు రక్తంతో తడిచిన కత్తిని అమ్మవారికి చూపాక.. పూలతో అలంకరించిన ట్రక్కులో అమ్మవారి ప్రతిమను ఉంచి విరూపమహోత్సవం నిర్వహించారు. శివాలయం వద్దకు చేరుకోగా అమ్మవారికి అలంకరించిన ఆభరణాలను తీసేశారు. అనంతరం కైవల్యానది మీదుగా మల్లయ్య తోట వద్ద ఏర్పాటు చేసిన విరూప మండపంలో అమ్మవారి ప్రతిమను విరూపం గావించారు. అమ్మవారికి రాజాలు సమర్పించిన ఆభణాలతోపాటు, స్వర్ణ కిరీటం అలంకరించారు. ఈ ఏడాది జాతర ఏర్పాట్లపై ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దృష్టి సారించారు.

● తప్పెవరిది?

ఘటోత్సవంలో పొలికుండలు, బలిదున్న పోతును వాహనంపై ఊరేగించడం.. రాజాల వంటశాలకు బలిదున్న పోతును తీసుకెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం రాత్రి జాతర ఊరేగింపులో, గురువారం అమ్మవారి విరూపోత్సవంలో సంప్రదాయం ప్రకారం రాజాల నగిరి నుంచి పంపే సప్పరం వినియోగించాలి. ఈ ఆచారానికీ గత పాలకులు చరమ గీతం పాడి.. రథానికి బదులు ట్రాక్టరును వినియోగించారు. దీనిని అప్పట్లో తప్పు పట్టిన ఎమ్మెల్యే కురుగొండ్ల అదే ఆనవాయితీని కొనసాగించడం ఏమిటని స్థానికులు ప్రశ్నించారు. సప్పరంపై అమ్మవారిని ఊరేగిస్తే రోడ్డుకు రెండువైపులా ఉన్న భక్తులకు అమ్మవారి దర్శనభాగ్యం కలిగే అవకాశం ఉండేదని స్థానికులు అంటున్నారు. ఇలా.. జాతర ఆచార వ్యవహారాల్లో తప్పిదం పాలకులదా? పాలకవర్గానిదా? లేదా అధికారులదా? అన్న చర్చ సాగుతోంది.

● పోలీసుల వైఫల్యం

జాతర నిర్వహణలో పోలీసుల వైఫల్యం కనిపించింది. భారీ బందోబస్తు ఏర్పాటుచేసినా వారిని సమన్వయ పరుచుకోవడంలో ఉన్నతాధికారులు విఫలమయ్యారన్న ఆరోపణలున్నాయి. ఈ ఏడాది కూడా పోలీస్, అధికారుల బంధువులకు వీవీఐపీ దర్శనాలు పెచ్చుమీరడం వల్ల సామాన్య భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఓ దశలో ఎమ్మెల్యే కురుగొండ్ల జోక్యం చేసుకొని వీఐపీ దర్శనాలను కొంతసేపు నిలిపి వేయించారు. పోలీస్, అధికారుల సిఫారసు ఉన్న వారి వాహనాలను మాత్రం రాజమార్గంలో గుడి దగ్గర వరకు వెళ్లనివ్వడంతో కొన్నిచోట్ల ప్రజలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

ఏర్పాట్లు ఫెయిల్ : ఆనం

పోలీసుల నిర్లక్ష్యంతో పోలేరమ్మ జాతర ఫెయిల్ అయిందని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. పోలేరమ్మకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున గురువారం ఆయన పట్టు వస్త్రాలు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో వెంకటగిరి ఎమ్మెల్యేగా ఉన్న తాను పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించాలని పోరాడామన్నారు. గతేడాది ప్రభుత్వం గుర్తింపునిచ్చినా నిధులను విడుదల చేయలేదని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అమ్మవారి జాతరకు రాష్ట్ర పండుగగా గుర్తింపునిస్తూ రూ.50 లక్షలు అందించిందన్నారు. ఈ జీవోను కలెక్టర్ వెంకటేశ్వర్, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘువేంద్రమీనాకు అందించారు.



అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న మంత్రులు కందుల సురేష్, ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



అమ్మవారి దర్శనానికి వెళుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి



బటన్ నొక్కి నీరు విడుదల చేస్తున్న మంత్రి ఆనం

'సోమశిల'లో పర్యాటకాభివృద్ధికి రూ.600 కోట్లతో ప్రణాళిక

● రాష్ట్ర మంత్రి ఆనం ● 'రాళ్లపాడు'కు నీరు విడుదల

అనంతసాగరం, సెప్టెంబరు 26 : సోమశిలను సమగ్ర పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం సోమశిల డ్యాంలోని పవర్‌హౌస్‌లో గంగమ్మకు పూజలు చేసి ఉత్తర కాలువకు 200 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడుతూ కాలువ పరిధిలో తాగునీటి అవసరాల కోసం రాళ్లపాడు రిజర్వాయర్‌కు నీరు సరఫరా చేశామని చెప్పారు. సోమశిల ప్రాజెక్టు పరిధిలో రూ.600 కోట్లతో అభివృద్ధి పనులు చేసి పర్యాటక కేంద్రంగా అన్ని వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. అలాగే, జలాశయం బ్యాక్‌వాటర్‌లో బోటు షికారుకు కూడా రూపొందాయన్నారు. ఈ పనులకు త్వరలో సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో శంకుస్థాపన చేసేలా కసరత్తు చేస్తున్నామన్నారు. గత వరదలకు ధ్వంసమైన సోమేశ్వరాలయ అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.12 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. భక్తుల అభిరుచికి తగ్గట్టుగా పనులు పూర్తి చేయిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో మధులత, ఎస్ఈ వెంకటరమణారెడ్డి, డ్యాం ఈఈ దశరథరామిరెడ్డి, టీడీపీ నేతలు సునీత, సుజాతమ్మ, కృష్ణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

మోసపోయాం.. కాపాడండి!

చెల్లని చెక్కులతో రూ.2 కోట్లకు కుచ్చుటోపీ ● మంత్రి ఆనంకు వినతి

సంగం : ఆత్మకూరు నియోజకవర్గంలో పలువురు మాస్టర్ వీవర్స్‌కు గుర్తు తెలియని వ్యక్తులు చెల్లని చెక్కులు ఇచ్చి సుమారు రూ.2 కోట్లకు కుచ్చుటోపీ పెట్టిన విషయం ఆల స్యంగా వెలుగు చూసింది. ఈ మేరకు బాధితులు బుధవారం ఆత్మకూరులో మంత్రి ఆనంకు వినతిపత్రం అందచేశారు. మూడు నెలల కిందట సంగం, చేజర్ల, ఏఎస్‌పేట మాస్టర్ వీవర్స్ వద్దకు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి రూ.2 కోట్ల మేర పట్టు వస్త్రాలు అడిగారు. నమ్మకం కలిగేందుకు చెక్కులతోపాటు ఫోన్ నెంబర్లు కూడా ఇచ్చారు. మార్జిన్ బాగుండటంతో మా స్టర్ వీవర్స్ చెక్కులు తీసుకుని పట్టు చీరలు అందచేశారు. అయితే, ఆ చెక్కులను బ్యాంకులో జమ చేయగా బౌన్స్ అయ్యాయి. వాళ్లిచ్చిన సెల్ నెంబర్లకు ఫోన్ చేస్తే స్పందించలేదు. దీంతో తాము మోసపోయామని తెలుసుకుని మూడు మండలాల చేనేత మాస్టర్ వీవర్స్ మంత్రి ఆనంను కలిశారు. దీంతో స్పందించిన ఆయన విచారణ చేయాలని డీఎస్పీకి సూచించారు.

'ఇరిగేషన్'లో పలువురి బదిలీ

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : జలవనరుల శాఖలో పలువురిని బదిలీలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. కావలి ఈఈ, నెల్లూరు ఇన్‌చార్జి ఎస్ఈ కృష్ణమోహన్‌ను నరసరావుపేట లింగంగుంట్ల ఈఈగా బదిలీ చేసింది. అనంతపురంలో ఈఈగా పని చేస్తున్న దేశ్యనాయక్‌ను నెల్లూరు డ్రైనేజీ డివిజన్ ఈఈగాను, సోమశిల ప్రాజెక్టు రెండో డివిజన్ ఈఈ శ్రీనివాసరావును గూడూరు డివిజన్ ఈఈగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

● పలువురు డిప్యూటీ కలెక్టర్లు..

డిప్యూటీ కలెక్టర్లను కూడా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు ఆర్డీవో మలోలను జీఏడీలో రిపోర్టు చేసుకోవాల్సిందిగా ఉత్తర్వు ల్లో పేర్కొనగా ఆ స్థానంలో ప్రొహిబిషనరీ డిప్యూటీ కలెక్టర్ నాగ సంతోష్ అనూషను నియమించింది. ఆత్మకూరు ఆర్డీవో మధులతను నరసరావుపేటకు, ఆ స్థానంలో ప్రొహిబిషనరీ డిప్యూటీ కలెక్టర్ భూమిరెడ్డి పావనిని నియమించారు. అలాగే కావలి ఆర్డీవో శీనానాయక్‌ను జీఏడీలో రిపోర్టు చేసుకోవాల్సిందిగా, ఆ స్థానంలో డిప్యూటీ కలెక్టర్ వంశీకృష్ణను నియమించింది. తెలుగుగంగ ప్రాజెక్టు రాపూరు యూనిట్ డిప్యూటీ కలెక్టర్ ఎం.శ్రీనివాసులు బదిలీ అయ్యారు.

బల్క్ బుకింగ్ ఎప్పుడు?

విక్రయాలు మొదలైనా ఇంకా తీరని ఇసుక కష్టాలు | ప్రభుత్వ పనులపై తీవ్ర ప్రభావం | కంపెనీలు, అపార్ట్‌మెంట్లకూ ఇసుక కొరత | నిల్వలున్నా నిర్ణయం తీసుకోని ఉన్నతాధికారులు

దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదంటే ఇదే..! ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉచిత ఇసుక పాలసీని ప్రభుత్వం ప్రారంభించినా.. అధికారుల వైఖరితో ఇంకా ఇసుక కష్టాలు తీరడం లేదు. ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ ప్రారంభమై వారం రోజులు గడిచింది. కానీ ఇంత వరకు బల్క్ బుకింగ్‌కు అవకాశమివ్వలేదు. ఇదిగో ఇస్తున్నాం.. అదిగో ఇస్తున్నాం.. అంటూ రోజులు గడిపేస్తున్నారే తప్ప క్షేత్రస్థాయిలోని ఇబ్బందులను మాత్రం అధికారులు గుర్తించలేక పోతున్నారు. ఈ ప్రభావం ప్రభుత్వ పనులు, కంపెనీలు, అపార్ట్‌మెంట్ల నిర్మాణాలపై తీవ్రంగా పడుతోంది. సగం మంది భవన నిర్మాణ కార్మికులు ఈ వర్కులపైనే ఆధారపడి ఉన్నారు. ఈ పనులకు ఇసుక దొరకకపోవడంతో ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో కూలీలకు పనులు దొరకడం లేదు. జిల్లాలోని మూడు యార్డుల్లో 50 వేల మెట్రిక్ టన్నులకుపైగా ఇసుక నిల్వ ఉంది. అలాగే, రోజుకు సరాసరి 4 వేల టన్నుల వరకూ ఇసుకను డీసిల్టేషన్ పద్ధతిలో బయటకు తీస్తున్నారు. ఇంత నిల్వలు ఉన్నప్పటికీ బల్క్ బుకింగ్‌కు అవకాశమిచ్చి ఇసుక డిమాండ్‌ను తగ్గించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది.

నెల్లూరు, సెప్టెం బరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో గత ప్రభుత్వంలో ఇసుకను బంగారంగా మార్చేయడంతో ఇసుక ఆధారిత రంగాలు కుప్పకూలాయి. భారీ ధరను పెట్టి ఇసుకను కొనుగోలు చేయాల్సి వచ్చేది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఉచిత ఇసుక పాలసీని ప్రవేశపెట్టింది. ఇసు కను నదిలో నుంచి తీసుకు రావడానికి అయ్యే ఖర్చులు మినహా ఒక్క రూపాయి ఆదాయం కూడా తీసుకోకుండా ప్రజలకు అందించాలని నిర్ణయించింది. కానీ గత ప్రభుత్వం పర్యావరణ అనుమతులు తీసుకోకపోవడంతో ఇప్పుడు ఇసుక రీచ్‌లలో తవ్వకాలు జరిపేందుకు వీల్లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ఎలాగైనా ప్రజలకు ఇసుక కొరతను తీర్చాలని భావించిన ప్రభుత్వం డీసిల్టేషన్ పాయింట్లను తెరమీదకు తీసుకొచ్చింది. సంగం, నెల్లూరు బ్యారేజీల ఎగువన డీసిల్టేషన్ చేసి ప్రాజెక్టుల్లో నీటి నిల్వను పెంచడంతో పాటు అక్కడి నుంచి ఇసుకను తెచ్చి ప్రజలకు అందించే ప్రక్రియను ప్రారంభించారు. ఈ నెల మొదటి వారంలో ఈ ప్రక్రియ ప్రారంభం కాగా ఇప్పటి వరకూ సంగం, సూరాయపాలెం, పోతిరెడ్డిపాలెం పాయింట్ల నుంచి దాదాపు 55 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను వెలికితీశారు. ఈ నెల 19వ తేదీ నుంచి ఉచిత ఇసుక పాలసీ మొదలవగా ఆన్‌లైన్‌లో బుకింగ్‌లు ప్రారంభమయ్యాయి. జిల్లాలో రోజుకు సరాసరి ఐదు వేల మెట్రిక్ టన్నుల వరకూ ఇసుక విని యోగం ఉంటుందని అధికారుల అంచనా. అయితే ఆన్‌లైన్ బుకింగ్ కొత్త కావడంతో కొంత నెమ్మదిగా బుకింగ్‌లు జరుగుతూ వస్తున్నాయి. ఇప్పటి వరకూ 252 ట్రిప్పుల ఇసుక బుకింగ్ జరిగినట్లు అధికారుల సమాచారం. ఒక్కో ట్రిప్పులో 20 టన్నుల ఇసుకను బుకింగ్ చేస్తున్నారు. ఆ లెక్కన సుమారు 5 వేల టన్నుల ఇసుక అమ్మకాలు ఇప్పటి వరకూ జరిగాయి. ప్రస్తుతం సంగం యార్డులో 24 వేల మెట్రిక్ టన్నులు, పోతిరెడ్డిపాలెం యార్డులో 15 వేల మెట్రిక్ టన్నులు, సూరాయపాలెం యార్డులో 16 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయి. సాధారణంగా రోజుకు ఐదు వేల మెట్రిక్ టన్నుల వినియోగం ఉంటే అందులో సగం బల్క్ బుకింగ్‌లే ఉంటాయి. అంటే ప్రభుత్వ వర్కులు, అపార్ట్‌మెంట్లు, కంపెనీల నిర్మాణాలు వంటి వాటికి ఎక్కువగా ఇసుక వినియోగం ఉంటుంది. కానీ ఇప్పుడు ఈ బల్క్ బుకింగ్ కింద ఇసుకను కొనుగోలు చేసేందుకు అవ కాశం ఇవ్వలేదు. కేవలం సొంత ఇంటి నిర్మాణాలకు మాత్రమే ఇసుక బుకింగ్ చేస్తున్నారు. మర్రిపాడు యార్డులో విక్రయాలు నెలన్నర క్రితమే ఆగిపోయా యి. అప్పటి నుంచి ఇసుక దొరకక ప్రభుత్వ వర్కు లు, అపార్ట్‌మెంట్లు, కంపెనీల నిర్మాణాలకు ఇబ్బం దులు ఎదురవుతున్నాయి. ఆఖరుకు టిడ్కో అపార్ట్‌మెంట్ల వద్ద తుది వర్కులకు కూడా ఇసుక కొరత ఏర్పడడంతో పనులు నిలిచిపోయి ఉన్నాయి. నవంబరు నుంచి జిల్లాలో వర్షాకాలం ప్రారంభమవుతుంది. అప్పటిలోపు వీలైనంత త్వరగా పనులు చేసుకోవాలని పెద్ద వర్కులకు చెందిన వారు భావిస్తుంటారు. కానీ ఇప్పు డు ఇసుక దొరకకపోవ డంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతా ధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదని పలువురు వ్యాఖ్యానిస్తుండటం గమనార్హం.

త్వరలోనే అవకాశమిస్తారు

బల్క్ బుకింగ్‌కు త్వరలోనే అవకాశమిస్తారు. ప్రస్తుతం దానిపైనే ఉన్నతస్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. ఇసుక బుకింగ్‌లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా సమస్య వస్తే వెంటనే పరిష్కరిస్తున్నాం. ప్రస్తుతం మూడు యార్డుల్లో 50 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు అందుబాటులో ఉన్నాయి.

- ఏ శ్రీనివాసకుమార్, మైనింగ్ డీడీ

పాఠశాల అభివృద్ధి నిధుల గోల్‌మాల్

● రూ.ఐదు లక్షలు కూడా కాని పనులకు రూ. 11 లక్షలు ఖర్చట ● లెక్కలు అడిగిన గ్రామస్థులపై దాడి

కావలి రూరల్, సెప్టెంబరు26: మండలంలోని కొనదిన్నె ప్రాథమిక పాఠశాల అభివృద్ధి నిధులు గోల్‌మాల్‌పై గురువారం రచ్చ జరిగింది. నిధులు గోల్‌మాల్ అయ్యాయని గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. పాఠశాల అభివృద్ధికి పెట్టిన ఖర్చుకు బిల్లులు చూపాలని హెచ్‌ఎం రమణయ్యను, గత ప్రభుత్వంలో ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌గా పనిచేసిన కమలాపూరి శ్రీవిద్య, ఉప్పాల తిరుపతిరావులను గురువారం తల్లిదండ్రులు నిలదీశారు. దీంతో ఆగ్రహించిన వారు ఖర్చులు మేము చూపం... ఏమిచేసుకుంటారో చేసుకోండి.. అంటూ ఎదురుదాడికి దిగారు.

కాగా పాఠశాల అభివృద్ధికి రూ. 25 లక్షలు మంజురు కాగా, 2022లో హెచ్‌ఎం ఖాతాలోకి రూ.11 లక్షలు పడ్డాయి. హెచ్‌ఎంతోపాటు ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు సంతకాలు చేసి 2022 నుంచి 2023 వరకు వరకు విడతల వారీగా రూ.11 లక్షలు డ్రా చేశారు. ఆ నిధులతో పాఠశాల చుట్టూ ప్రహరీకి బేస్‌మెంట్, సెప్టిక్ ట్యాంక్, రెండు మరుగు దొడ్లు మాత్రమే కట్టి వదిలేశారు. అనంతరం టీడీపీ కూటమి అధికారం చేపట్టాక ఇటీవల స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా బలగాని చెన్నయ్య, కైదుపల్లి మమతను ఎన్నుకున్నారు. వీరు రూ.11 లక్షలకు లెక్కలు అడగటంతో ఆ నగదుకు పనులు చేశామని వారు బదులిచ్చారు. దీంతో రూ.5 లక్షలు కూడా ఖర్చు కాని పనులకు రూ.11 లక్షలు ఎలా అయ్యాయని బిల్లులు చూపమన్నారు. దీంతో గ్రామస్థులపై ఎదురుదాడికి దిగి అక్కడ నుంచి వెళ్లిపోయారని తల్లిదండ్రులు తెలిపారు.



పాఠశాల ఆవరణలో నిర్మించిన మరుగు దొడ్డి

ఫిర్యాదు అందితే విచారించి చర్యలు : ఎంఈవోలు

పాఠశాల అభివృద్ధి నిధుల విషయంలో అవకతవకలు జరిగినట్లు మా దృష్టికి రాలేదని ఎంఈవోలు గోవిందయ్య, వెంకట సుబ్బయ్య తెలిపారు. ఈ విషయమై మాకు ఎలాంటి ఫిర్యాదు అందినా విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

వంద రోజుల పాలన అమోఘం : మంత్రి దుర్గేష్

కావలిటౌన్, సెప్టెంబరు26: వంద రోజుల కూటమి పాలన అమోఘమని పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. గురువారం వెంకటగిరి జాతరకు హాజరై తిరుగు ప్రయాణంలో తుమ్మలపెంట రోడ్డులోని జనసేన కార్యాలయానికి విచ్చేశారు. ఆయనకు జనసేన నియోకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగే 8పండగలను రాష్ట్ర పండుగలుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన జల్‌జీవన్‌లో వైసీపీ డబ్బులు కాజేసిందన్నారు. ఇంకా వైసీపీ అవాకులు,చివాకులు పేలడం చూస్తుంటే వారికింకా బుద్ధి రాలేదన్నారు. కాగా బీజేపీ నేతలు కూడా మంత్రిని కలిసి సత్కరించారు.



మంత్రి దుర్గేష్‌ను సత్కరిస్తున్న జనసేన ఇన్‌చార్జి సుధాకర్

వాటర్‌ప్లాంట్ మరమ్మతులకు ఆర్థిక సాయం

కావలిటౌన్, సెప్టెంబరు26: స్థానిక వైకుంఠపురంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలోని వాటర్‌ప్లాంట్ మరమ్మతులకు పూర్వ విద్యార్థి శ్రీమల్లి రాము రూ.20వేలు గురువారం అందించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మెన్ మేఘమాల, సభ్యులు సత్యనారాయణ, ఉపాధ్యాయులు మధుసూదన్‌రావు తదితరులు రామును అభినందించారు.

కావలిలో తాగునీటి సమస్య తలెత్తకూడదు

● మున్సిపల్ కమిషనర్

కావలి,సెప్టెంబరు26: పట్టణంలో మంచినీటి సమస్య ఉందని ప్రజలు ఫోన్లు కానీ, కార్యాలయానికి కానీ వచ్చి అడక్కముందే, ఆ సమస్యను సచివాలయాల పరిధిలోనే పరిష్కరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు. పట్టణంలో తాగునీటి సమస్యపై ఇంజనీరింగ్ అధికారులు, వాటర్‌వర్క్స్ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులతో గురువారం కమిషనర్ చాంబర్‌లో కమిషనర్, డీఈ సాయిరాంలు సమీక్షించారు. విద్యుత్ మోటార్లు, పైపులైన్లు రిపేర్లు వచ్చినా ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసి తాగునీటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఇంటికి తాగు నీరు అందేట్లుగా చూడాలన్నారు.

ఉదయగిరి ప్రజల సాగునీటి కష్టాలు తొలగిస్తా : కాకర్ల

కలిగిరి, సెప్టెంబరు 26: ఉదయగిరి నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న, సాగు, తాగునీటి కష్టాలను తొలగించడమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మండలంలోని క్రాకుటూరులో గురువారం ఎమ్మెల్యే ఇంటింటికి తిరుగుతూ వందరోజుల పాలనపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, బిజ్జం కృష్ణారెడ్డి, సర్పంచి గోగుల మంజుల, ఎంపీటీసీ హరిశ్చంద్రారెడ్డి, గంజాం రాఘవేంద్ర, బీవీ రామారావు, మలినేని శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.



క్రాకుటూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

● తిరుమల పవిత్రతను మంట కలిపిన జగన్

కందుకూరు, సెప్టెంబరు 26 : తిరుమల ఆలయ పవిత్రతను జగన్ మంట కలిపారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని విక్కిరాలపేట రోడ్డులో గురువారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ఇక్బాల్, సీఐ వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ఉప్పుటూరి శ్రీనివాసులు, పిడికిటి వెంకటేశ్వర్లు, ముచ్చు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సంగం : వెంగారెడ్డిపాళెంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సర్పంచి ఆనం ప్రసాద్‌రెడ్డి తదితరులు

● వెంగారెడ్డిపాళెంలో..

సంగం, సెప్టెంబరు 26: మండలంలోని వెంగారెడ్డిపాళెంలో సర్పంచి ఆనం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ఇప్పటి వరకు చేసిన సంక్షేమ కార్యక్రమాలను వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పెయింట్ ముద్దలు ప్రమాదమే కదా ?

రోడ్డు ప్రమాదంలో బోల్తా పడిన వ్యానులో నుంచి జాతీయ రహదారిపై పడిన పెయింట్‌తో ప్రమాదం పొంచి ఉంది. మద్దూరుపాడు జాతీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఇటీవల ఓ వ్యాను ప్రమాదానికి గురైంది. ఆ వాహనంలో నుంచి రంగుడబ్బాలు పడి రంగులు మొత్తం రోడ్డు పాలయ్యాయి. అవి చెక్కులు కట్టి ముద్దలు ముద్దలుగా ఉన్నాయి.దీంతో వర్షాలు పడినప్పుడు వాహనాలు రోడ్డుపై జారి ప్రమాదానికి గురయ్యే ప్రమాదముందని వాహనచోదకులు అంటున్నారు. ప్రమాదాలు జరగ్గముందే హైవే సిబ్బంది వీటిని తొలగించాల్సి ఉంది.

- కావలి రూరల్



వరద బాధితులకు ఒకరోజు వేతనం విరాళం

కందుకూరు, సెప్టెంబరు 26 : విజయవాడ వరద బాధితులకు టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది ఒకరోజు వేతనం రూ.1,10,987లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి గురువారం అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రవికుమార్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ పీ రాజగోపాల్ బాబు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ కోటపాటి నరేష్ రాజా, షేక్ షనాజ్ బేగం, లైబ్రేరియన్ గడ్డం బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఇంటూరికి చెక్కు అందచేస్తున్న టీఆర్ఆర్ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్, అధ్యాపకులు

డాక్టర్ నూకసానికి సన్మానం

లింగసముద్రం, సెప్టెంబరు 26 : ఏపీ టూరిజం కార్పోరేషన్ చైర్మెన్‌గా నియమితులైన డాక్టర్ నూకసాని బాలాజీని మండలంలోని పెదపవని టీడీపీ నేతలు గురువారం ఘనంగా సన్మానించారు. ఒంగోలులోని ఆయన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గూడూరి కల్పన, టీడీపీ నాయకులు ధనుం మధు, కూరపాటి విజయభాస్కర్, నారిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల అందజేత

లింగసముద్రం, సెప్టెంబరు 26 : స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలోని విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన బెడ్‌షీట్లను గురువారం పంపిణీ చేశారు. హాస్టల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేఆర్ జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం. యు మాధవరావు వాటిని విద్యార్థులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ ఎం శివరామకృష్ణ పాల్గొన్నారు.

నేడు షూటింగ్‌బాల్ జట్ల ఎంపిక

ఉలవపాడు, సెప్టెంబరు 26 : జూనియర్స్ బాలబాలికల షూటింగ్ బాల్ ఎంపికలను శుక్రవారం నిర్వహించనున్నట్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జీ మురళి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని చాకిచర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం 3 గంటలకు ఎంపికలు జరుగుతాయని తెలిపారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి కలిగిన బాలబాలికలు వయసు ధ్రువీకరణ కోసం ఆధార్ కార్డు తీసుకొని రావాలన్నారు. మరింత సమాచారం కోసం 89190 36160 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

వేములపాటి ఎంపికపై హర్షం

కొండాపురం : ఏపీ టిడ్కో చైర్మన్‌గా ఉదయగిరి నియోజకవర్గ వాసి, జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేము లపాటి అజయ్ కుమార్ ఎంపికపై గురువారం ఆపార్టీ మండల ఉపా ధ్యక్షుడు కె.రాఘవేంద్ర, భీమవరప్పాడు జనసేన అధ్యక్షుడు తిప్పినేని రమేష్‌లు హర్షం వ్యక్తం చేశారు. అజయ్‌కుమార్ భవిష్యత్తులో మరె న్నో పదవులు పొందాలని వారు ఆకాంక్షించారు.

జేవీవీ ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్

వింజమూరు : మండలంలోని చాకలికొండ రాధాకృష్ణ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పదో తరగతి నుంచి చెనికల షాహిద్, 9వ తరగతి నుంచి గుండ్లపల్లి లోకేష్, 8వ తర గతి నుంచి కుంచెం లాస్య ప్రతిభను చాటి ఉపాధ్యాయుల ప్రశంసలు అందుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

స్వర్ణాంధ్ర 2047పై అవగాహన

ఏఎస్ పేట, : స్థానిక ఎంపీడీవో కార్యలయంలో గురువారం అధికారులకు స్వర్ణాంధ్ర-2047పై అవగాహన కార్యక్రమం ఎంపీ డీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజలను భాగస్వామ్యం చేసి రూపొందించవలసిన ప్రణాళికల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ రాజేంద్ర, స్పెషల్ ఆఫీసర్లు జ్యోతి, సాయి, ప్రసాద్, సతీష్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాల తనిఖీ

ఆత్మకూరు : విద్యార్థి జీవితంలో సమయం చాలా విలువైనదని ఉర్దూ జిల్లా డిఐ షేక్ ఖాజామొహిద్దీన్ తెలిపారు. గురువారం ఆయన మండలంలోని అశ్వీనీపురంలో ఉన్న ఉర్దూ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఖాదర్‌బాష, ఉపాధ్యాయుడు అబ్దుల్ హఫీజ్ పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఉర్దూ జిల్లా డీఐ షేక్ ఖాజామొహిద్దీన్

అనంతసాగరం పీహెచ్‌సీ తనిఖీ

అనంతసాగరం, సెప్టెంబరు 26: స్థానిక పీహెచ్‌సీని గురువారం జిల్లా టీబీ నివారణాధికారి ఖాదర్‌వలి తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలించి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. మండలంలో వ్యాధి నివారణ చర్యలపై పలు సూచనలు చేశారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమంపై ఆరాతీశారు. అలాగే రేవూరు, పాతదేవరవాయపల్లి ఆరోగ్య ఉపకేంద్రాలను పరిశీలించారు



వైద్యసిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా అధికారి ఖాదర్‌వలి

నేటి నుంచి గంధ మహోత్సవం

అనంతసాగరం, సెప్టెంబరు 26: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని హజరత్ మస్కూర్ అలిషాఖాదరీ దర్గా 14వ గంధమహోత్సవం శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరుగుతుందని నిర్వాహకులు సాని సాహెబ్, మజీద్ సాహెబ్ తెలిపారు. ఈసందర్భంగా దర్గాను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు వసతి, అన్నదానం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 26: జమాతే ఇస్లామి హింద్ ఉదయగిరి శాఖా మహిళా విభాగం ఆధ్వర్యంలో స్వేచ్ఛ పేరుతో మోసపోవద్దు అనే అంశంపై ఇటీవల జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన వారికి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం వైద్యుడు అఖిల్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్, మహిళా విభాగం అధ్యక్షురాలు అసియా, నిర్వాహకురాలు అల్సానియా, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం స్థాపించాలి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 26: ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏ నరసింహులు సూచించారు. గురువారం ఫడ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్రం సహకారంతో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడ్డ సంచులు వాడాలని సూచించారు. కళాశాల ఆవరణలో పరిశుభ్రత చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఫడ్స్ డైరెక్టర్ పీవీ రమణయ్య, బీజేపీ నాయకులు ఆవుల రోశయ్య , అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 26: మండలంలోని పుల్లాయపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన కల్లూరి మోహన్‌రెడ్డి గురువారం రూ.10 వేలు విలువ కలిగిన మైక్‌సెట్‌ను ప్రధానోపాధ్యాయుడు గాజులపల్లి సుబ్బారెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బోడబండ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ ఖాదర్‌బాషా, ఉపాధ్యాయిని ప్రశాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

పఠన, బోధనా సామర్థ్యాలను పెంపొందించాలి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 26: విద్యార్థుల పఠనా, బోధనా సామర్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి సూచించారు. గురువారం మండలంలోని కృష్ణంపల్లి మెయిన్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆర్లపడియ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ సబ్జెక్టుల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఆయా పాఠశాలల్లో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం రిజిస్టర్లు పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శివరామిరెడ్డి, పద్మనాభరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ వాగ్దానాలను నేరవేర్చడమే లక్ష్యం

ఆత్మకూరు, సెప్టెంబరు 26: మండలంలోని చెర్లోయడవల్లిలో గురువారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కేతా విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.వారు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించి కరపత్రాలు, స్టికర్లు అందజేశారు. అనం తరం ఏర్పాటుచేసిన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ వాగ్దానాలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పీ ఐజాక్‌ప్రవీణ్, సర్పంచి చేరెడ్డి ప్రభావతమ్మ, రావులకొల్లు మాజీ సర్పంచి ఆర్ మోహన్‌రెడ్డి తదితరలుఉ పాల్గొన్నారు.

'నూకసాని' ఎంపికపై హర్షం

లింగసముద్రం, సెప్టెంబరు 26 : ప్రకాశం జిల్లా టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ నూకసాని బాలాజీ ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మెన్‌గా ఎంపిక కావడంపై పలువురు గురువారం హర్షం వ్యక్తం చేశారు. మండల నాయకులు బోడి సురేష్, చిట్టిబోయిన సురేష్, జాజుల మనోజ్, బొచ్చు మాల్యాద్రి, దాసరి దేవేంద్ర, దిడ్డి వెంగబాబు తదితరులు ఒంగోలులోని కార్యాలయంలో బాలాజీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బాధిత కుటుంబానికి సాయం

జలదంకి, సెప్టెంబరు 26: మండలంలోని జమ్మలపాలెం ఎస్సీకాలనీకి చెందిన మైనంపాటి వినోద్‌కుమార్ ఇల్లు ఇటీవల దగ్ధమైంది. దీంతో జలదంకి రెడ్‌క్రాస్ చైర్మన్ వడ్డే శ్రీనాథ్‌రెడ్డి, రాష్ట్ర, జిల్లా పాలక మండలి సభ్యుడు డీ రవిప్రకాష్, కలికి శ్రీహరిరెడ్డిలు గురువారం బాధిత కుటుంబానికి వస్తుసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనాథ్‌రెడ్డి తన వంతు సాయంగా రూ.3వేలు అందజేశారు. అనంతరం రెడ్‌క్రాస్ బృదం స్థానిక ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు రక్తదానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

29న మెగా వైద్య శిబిరం

అల్లూరు, సెప్టెంబరు 26 : మండలంలోని ఇందుపూరు కాలువ సమీపంలోని దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 29న మెగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు అడ్మిన్ మేనేజరు అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ట్రస్ట్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు డీఎస్ఆర్ ట్రస్ట్‌లో ఈ శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజరు రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మను దర్శించుకున్న ప్రముఖులు

వింజమూరు, సెప్టెంబరు 26 : వెంకటగిరి పోలేరమ్మ తల్లి జాతరలో గురువారం పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలిసి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, కాకర్ల వెంకట్, మెట్టుకూరి చిరంజీవిరెడ్డి, మాలేపాటి చైతన్యలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా ఝులాల ఉత్సవం

ఏఎస్‌పేట, సెప్టెంబరు 26: స్థానిక హజరత్ సయ్యద్ ఖాజారహమతుల్లా నాయబ్ రసూల్ దర్గా గంధ మహోత్సవంలో భాగంగా గురువారం వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో ఘనంగా ఝులాల ఉత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా దర్గా ఈవో మహమ్మద్ హుసేన్ ఝులాలను ప్రత్యేకంగా తయారుచేసి దర్గాపై ఉన్న చంద్రవంకకు అలంకరించారు. పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు తీసుకొచ్చిన ఝులాలను చంద్రవంకతో పాటు దర్గాకు అలంకరించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ సైదులు పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు.

మాగుంట పార్వతమ్మ మృతి తీరనిలోటు

కావలిటౌన్, సెప్టెంబరు26: మాగుంట పార్వతమ్మ మృతి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ముసునూరులోని ఆయన నివాసం వద్ద పార్వతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ట్రంకురోడ్డు అభివృద్ధి పార్వతమ్మ పుణ్యమేనని, ట్రంకురోడ్డుకు పార్వతమ్మ రోడ్డుగా నామకరణం చేస్తే స్వాగతిస్తామన్నారు. కాగా గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో గాయపడి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న పాత్రికేయుడు శ్రావణ్‌ను ప్రతాప్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు మంచిది కాదన్నారు.



విలేకరులతో ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలిలో దేవర సంబరాలు

కావలి రూరల్ : పట్టణంలో శుక్రవారం విడుదల కానున్న దేవర సినిమా సందడి నెలకొంది. స్థానిక మానస థియేటర్ వద్దఏర్పాటు చేసిన బాబాయ్ నందమూరి బాలక్రిష్ణ, అబ్బాయ్ ఎన్టీఆర్ కటౌట్లు ఆకర్షణగా నిలిచాయి. పట్టణంలోని 4 థియేటర్లలో ఈ నెల 24 నుంచి ఆన్‌లైన్, కౌంటర్ల వద్ద టికెట్లు అందుబాటులోకి తెచ్చారు. రాత్రికి ఫ్యాన్సీషో వేయనున్నారు.